అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 6-11-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 306 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 8 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు | వెల : 6. 50



ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించండి

- బీజేపీని ఓడించండి
- వామపక్ష, ప్రజాతంత్ర, సామాజిక, లౌకిక, పోరాట శక్తులకు మద్దతివ్వండి : తమ్మినేని వీరభద్రం
- 14 మంది అభ్యర్థులతో తొలి జాబితా, మ్యానిఫెస్టో విడుదల



మ్యానిఫెస్టో విడుదల చేస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి తమ్మినేని, తదితరులు....

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేననీ, సీపీఐ(ఎం) పార్టీ అభ్యర్థులను ఆదరించి, ఎన్నికల్లో గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, మల్లు లక్ష్మి, టి సాగర్, ఎండీ అబ్బాస్‌తో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 14 మంది అభ్యర్థుల జాబితాతోపాటు ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేశారు. మరో మూడు స్థానాలకు అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి తగిన విధంగా కృషి చేస్తామనీ, వారి ప్రయోజనాలు కాపాడే విధంగా పోరాడుతామని ఎన్నికల ప్రణాళికలో పొందుపర్చినట్టు వివరించారు.

మూడు నినాదాలతో సీపీఐ(ఎం) ఈ ఎన్నికల్లో ప్రజల ముందుకు పోతుందని చెప్పారు. మొదటిది సీపీఐ(ఎం)కు అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఇవ్వండి' అని అడుగుతామన్నారు. అలా ప్రాతినిధ్యం ఇస్తే కార్మికులు, రైతులు , వ్యవసాయకూలీలు మహిళలకు, బడుగు,బలహీన వర్గాలకు, విద్యార్థులు, యువకులు, దళితులు, గిరిజనులు వంటి సామాన్యుల హక్కుల కోసం చట్ట సభల్లో పోరాడుతుందన్నారు. భవిష్యత్ పోరాటాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. గతంలో శాసన సభలో పార్లమెంట్‌లో కమ్యూనిస్టులు నిర్వహించిన పాత్రకు గణమైన చరిత్ర ఉందని వివరించారు. కమ్యూనిస్టులు బలంగా చట్టసభల్లో ఉన్న కాలంలోనే ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టాలొచ్చాయన్నారు. ఆర్థిక సంస్కరణల్లో ప్రయివేటీకరణకు పెద్ద పీట వేయకుండా అడ్డుకట్ట వేసింది కమ్యూనిస్టులేనన్నారు. ఎల్ఐసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల్ని, కార్మికులను కాపాడే పోరాటాలు నిర్వహించామన్నారు. ఆ రకంగా కమ్యూనిస్టుల పోరాట చరిత్ర మరవలేనిదన్నారు. ఆ పోరాట చరిత్రను తెలంగాణ ప్రజలు మననం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలోనే రాబోయే కాలంలో శాసన సభలో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ ప్రజల ముందుకు పోతున్నామని చెప్పారు. రెండో అంశంగా వామపక్ష అభ్యర్థులను బలపర్చాలని విజ్ఞప్తి చేశారు. వామపక్ష ఐక్యతను దృష్టిలో ఉంచుకుని సీపీఐకి కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నప్పటికీ ఆ పార్టీ పోటీ చేస్తున్న స్థానాల్లో సీపీఎం తమ అభ్యర్థులను పోటీ పెట్టబోదని స్పష్టం చేశారు. వామపక్ష, లౌకిక, ప్రజాస్వామిక, ...7లో

సీపీఐ(ఎం) అభ్యర్థుల తొలి జాబితా

1) భద్రాచలం: కారం పుల్లయ్య
2) అశ్వారావుపేట: పిట్టల అర్జున్
3) పాలేరు: తమ్మినేని వీరభద్రం
4) మధిర: పాలడుగు భాస్కర్
5) వైరా: భూక్యా వీరభద్రం
6) ఖమ్మం: యర్రా శ్రీకాంత్
7) సత్తుపల్లి: మాచర్ల భారతి
8) మిర్యాలగూడ: జూలకంటి రంగారెడ్డి
9) నకిరేకల్: బొజ్జ చిన్న వెంకులు
10) భువనగిరి: కొండమడుగు నర్సింహా
11) జనగాం: మోకు కనకా రెడ్డి
12) ఇబ్రాహీం పట్నం: పగడాల యాదయ్య
13) పటాన్‌చెరు : జే. మల్లికార్జున్
14) ముషీరాబాద్ : ఎం దశరద్

వివరాలు 8లో..

అబ్బాస్‌తో బ్లింకెన్ భేటీ

- మఘజి క్యాంప్‌పై ఇజ్రాయిల్ దాడి..50 మందికి పైగా మృతి
- అణుబాంబు దాడి చేస్తామన్న ఇజ్రాయిల్ మంత్రి



రమల్లా : అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఆదివారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతల మధ్య ఇజ్రాయిల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌ను సందర్శించారు. పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో సమావేశమైన ఫోటోను పాలస్తీనా అధికారులు విడుదల చేశారు. బ్లింకెన్ జోర్డాన్‌తో పాటు శుక్రవారం ఇజ్రాయిల్‌లో ...7లో

అబద్ధాలే మీ ఆయుధాలు

- వంచనలే మీ సిద్ధాంతాలు : సీఎంపై రేవంత్ రెడ్డి విమర్శలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'అబద్ధాలే మీ ఆయుధాలు...వంచనలే మీ సిద్ధాంతాలు' అంటూ టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్, మంత్రులపై ట్వీట్ చేశారు. 'నాటకాలే మీకు తెల్సిన విద్యలు. మీరు ఇచ్చి తప్పిన హామీలకు లెక్కలేదు. మీకింకా పాలించే హక్కు లేదు. ఈ గడ్డ మరువదు మీరు పెట్టిన గోస... మీపై లేనే లేదు భరోసా.ముక్కు నేలకు రాసినా, ...7లో



ఢిల్లీకి గులాములవుదామా?

రానున్నది ప్రాంతీయ పార్టీల యుగం


- ప్రజాస్వామ్యంలో మాటలకూ పరిమితుంది.. • సింగరేణి తెలంగాణ సొత్తు..
- సీతారామ ప్రాజెక్టుతో జిల్లా బంగారు తునక : ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్
- ప్రతి ఎన్నికల్లో పార్టీ మారే వ్యక్తి తుమ్మల : అజయ్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

'ఢిల్లీ గులాముల కింద ఉండే పార్టీకి ఓటేసి గులాములు అవుదామా..? రాబోయేది ప్రాంతీయ పార్టీల యుగం.. ఎక్కడోళ్లు అక్కడ పాలించుకుంటేనే ఉత్తమం' అని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. బీఆర్ఎస్ ఖమ్మం, కొత్తగూడెం నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో మాటలకు పరిమితి ఉందన్నారు. ఓ అర్భకుడు బీఆర్ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటు తాకనీయనని అంటున్నాడు.. ఖమ్మాన్ని ఆయన కొనేశాడా అని ప్రశ్నించారు. ఒకాయన నేను మంత్రి పదవి ఇచ్చానంటే.. ఆయనే నాకు మంత్రి పదవి ఇచ్చాను అంటున్నాడు.. ఎవరికి ఎవరు మంత్రి పదవి ఇచ్చారో మీకు తెలియదా అని ప్రశ్నించారు. పువ్వాడను గెలిపిస్తే పువ్వుల్లో పెట్టుకొని చూసుకుంటారని, తుమ్మలకు ఓటు వేస్తే తుమ్మముళ్ల పాలుజేస్తారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలు చైతన్యం తెచ్చిన నేల ఇది అన్నారు. ఓటును సరైన పద్ధతిలో వాడాలని సూచించారు. నాడు ఖమ్మం ఇరుకు సందులు, మురికి కాల్వలతో ఉండేదని, ఇప్పుడు రోడ్లు, లైట్లు, పచ్చని చెట్లతో సుందరంగా ఉందన్నారు. ఇదంతా మంత్రి అజయ్ కృషి ఫలితమేనని తెలిపారు. ఖమ్మం నగరంలో 1500 కి.మీ రోడ్లు, 1592 కి.మీ డ్రయినేజీలు నిర్మించామన్నారు. నూతన బస్టాండ్, ఐటీ హబ్ ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. మున్నేరు వరదల నుంచి విముక్తి కోసం రూ.700 కోట్లు మంజూరు చేయించుకున్నారని ...7లో

పర్మినెంట్ సిబ్బంది కుదింపు


- తాత్కాలిక సిబ్బంది నియామకాలు అంతంతే
- లేబర్ మార్కెట్‌లో స్తబ్ధత :ఎన్‌సీఈఆర్ సర్వే



న్యూఢిల్లీ: గత ఆరు నెలల్లో శాశ్వత సిబ్బందిని నియమించుకునే సంస్థలు సగానికి తగ్గాయని, పోనీ తాత్కాలిక నియామకాలు పెరిగాయా అంటే అదీ లేదనినేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ (ఎన్‌సీఈఆర్) సర్వే స్పష్టం చేసింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో శాశ్వత పోస్టులకు రిక్రూట్‌మెంట్‌ను పెంచాలని 30.9 శాతం సంస్థలు యోచించగా, జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఇటువంటి సంస్థలు15.9 శాతానికి పడిపోయాయి. తాత్కాలిక ఉద్యోగుల నియామకాలు ఈ కాలంలో 45 శాతం నుంచి 35.6 శాతానికి పడిపోయాయని (ఎన్‌సీఈఆర్) తెలిపింది. లేబర్ మార్కెట్‌లో సంక్షోభం తీవ్రతను ఇది తెలియజేస్తోంది. వచ్చే 6 నెలల్లో జాబ్ మార్కెట్ పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంఘటిత రంగంలో కొత్త రిక్రూట్‌మెంట్‌కు అవకాశాలు తగ్గిపోయాయి.. 83.9 శాతం సంస్థల్లో పర్మినెంట్ పోస్టుల భర్తీ చేసే జాడ ఎక్కడా కనిపించడం లేదు. అక్టోబర్‌లో సేవల రంగ వద్ధి మందగించిందని ఎస్అండ్‌పి గ్లోబల్ సర్వే ఇదివరకే వెల్లడించింది. అక్టోబరు 31 నాటికి ముగిసిన త్రైమాసికంలో కొత్త ఉద్యోగాల కల్పన కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఎన్‌సీఈఆర్ సర్వే ప్రకారం, సెప్టెంబర్ త్రైమాసికంలో తాత్కాలిక ఉద్యోగుల సంఖ్యను పెంచాలని యోచిస్తున్న సంస్థలను వేళ్లమీద లెక్కించవచ్చు. ఎన్‌సిఎఇఆర్ 126వ రౌండ్ సర్వే సెప్టెంబర్‌లో నిర్వహించారు. ఈ పరిశోధనా సంస్థ మొత్తం 500 కంపెనీలను సర్వే చేసింది. నైపుణ్యం కలిగిన కార్మికుల రిక్రూట్‌మెంట్‌ను పెంచడానికి కంపెనీలు పెద్దగా ఆసక్తి చూపడం లేదని సర్వే వెల్లడించింది.

మోడీనామిక్స్ వల్లే దిగజారుతున్న ఆదాయాలు

'కేవలం 3 నెలల్లో, శాశ్వత సిబ్బందిని పెంచుకోవాలని చూస్తున్న కంపెనీలు 30.9 శాతం నుంచి 15.9 శాతానికి పడిపోయాయి. తాత్కాలిక ఉద్యోగులను నియమించుకోవాలని చూస్తున్న కంపెనీలు కూడా వెనకడుగు వేస్తున్నాయి. 'మోడీనామిక్స్' వల్ల ప్రజల ఆదాయాలు దిగజారుతున్నాయి. దీంతో డిమాండ్ పడిపోతుంది. అంతిమంగా అది ఆర్థిక వ్యవస్థ కుప్పకూలేందుకు దారి తీస్తుంది".



ప్రధాని మోడీ వివిధ సందర్భాల్లో భారత దేశ ఆర్థిక వ్యవస్థ భేషుగ్గా ఉందని డాంబికాలు పోతున్నారు. ఆయన చేస్తున్న ప్రకటనలకు, వాస్తవ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రం పూర్తి భిన్నంగా ఉన్నది. మోడీ చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ఓ ప్రహసనంగా మారింది. ఫ్యాక్టరీ ఉత్పత్తిలో 14.9 శాతం వద్ధిని సాధించాలనేది మేకిండియా లక్ష్యంగా ప్రకటించారు. నిజానికి, ఈ రంగంలో వద్ధి రేటు పదేండ్లలో 5.9 శాతానికి మించి లేదని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి.

- సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



సఫారీ చిత్తు

- 243 పరుగుల తేడాతో భారత్ గెలుపు
- విరాట్ కోహ్లి 49వ శతకంతో రికార్డు
- రవీంద్ర జడేజా ఐదు వికెట్ల మాయజాలం



నవతెలంగాణ-కోల్‌కత : అగ్రజట్ల అమీతుమీలో టీమ్ ఇండియా అదరగొట్టింది. ఆదివారం ఈడెన్‌గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికాపై 243 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం సాధించిన ఆతిథ్య భారత్.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంతో సెమీఫైనల్స్‌కు చేరుకుంది. విరాట్ కోహ్లి (101 నాటౌట్, 121 బంతుల్లో 10 ఫోర్లు) వన్డే కెరీర్ 49వ శతకంతో దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డును సమం చేయగా.. శ్రేయస్ అయ్యర్ (77, 87 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) సమయోచిత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. రోహిత్ శర్మ (40), రవీంద్ర జడేజా (29 నాటౌట్) సైతం రాణించటంతో తొలుత భారత్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 326 పరుగులు చేసింది. ఛేదనలో దక్షిణాఫ్రికా చతికిల పడింది. పేసర్లు మహ్మద్ షమి (2/18), సిరాజ్ (1/11) నిప్పులు చెరుగగా.. స్పిన్నర్లు రవీంద్ర జడేజా (5/33), కుల్దీప్ యాదవ్ (2/7) మాయలో సఫారీ బ్యాటర్లు విలవిల్లాడారు. 27.1 ఓవర్లలోనే 83 పరుగులకు కుప్పకూలిన దక్షిణాఫ్రికా అన్ని రంగాల్లోనూ టీమ్ ఇండియా ముందు తేలిపోయింది. గ్రూప్ దశలో వరుసగా ఎనిమిదో విజయం సాధించిన రోహిత్‌సేన.. తన చివరి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో తలపడనుంది.

వివరాలు ఆటలులో

స్వాతంత్ర్య సమరయోధుడికి 40 ఏండ్ల తర్వాత పింఛన్

మోడీ సర్కార్ తీరుపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం

- కేంద్రానికి రూ.20,000 జరిమానా



న్యూఢిల్లీ : భారత స్వాతంత్ర్య సమరయోధుడు ఉత్తమ్ లాల్ సింగ్(96) తన పెన్షన్ కోసం దాదాపు నాలుగు దశాబ్దాల పాటు నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలతో ఆయనకు పింఛన్‌కు మార్గం సుగమమైంది. ఇది "విచారకరమైన పరిస్థితి" అని కోర్టు పేర్కొన్నది. భారత ప్రభుత్వం తీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ విషయంలో కేంద్రానికి ...7లో

మంత్రి సబితా గన్‌మెన్ ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం..?

నవ తెలంగాణ- జూబ్లీహిల్స్



(ఫైల్)

మంత్రి సబితా ఇంద్రారెడ్డి గన్‌మెన్ ఏఎస్ఐ ఫాజల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని మణికంఠ హోటల్లో ఆదివారం జరిగింది. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు గల కారణాలుగా అనుమానిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర ప్రసాద్, ఎస్ఐ చంద్రశేఖర్ పోలీసు ఉన్నతాధికారులు ఆత్మహత్యకు గల కారణాలను ...7లో



శోక సంద్రంగా నేపాల్ గ్రామాలు

- మృతులకు సామూహిక అంత్యక్రియలు
- క్షతగాత్రులకు ఉచిత వైద్యం : ప్రభుత్వ ప్రకటన
- మరోసారి భూప్రకంపనలు

వివరాలు 2లో

2018 కి మించి..

భారీగా నగదు, మాదకద్రవ్యాల స్వాధీనం

- గత ఎన్నికలతో పోలిస్తే ఇపుడు మూడు రెట్లు అధికం • తెలంగాణలో అత్యధికంగా 439 కోట్లు స్వాధీనం



న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టి భారీగా నగదు, మద్యం, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఆయా రాష్ట్రాల్లో 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల విలువతో పోలిస్తే ఇప్పటికే స్వాధీనం చేసుకున్న వాటి విలువ మూడు రెట్లు ఎక్కువగా ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికలు జరిగే ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన అక్టోబర్ 9వ తేదీ నుండి ఇప్పటి వరకూ రూ.953.34 కోట్ల నగదుతో పాటు నగలు, బంగారం, వెండి, మద్యం, మాదకద్రవ్యాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ రాష్ట్రాల్లో 2018 ఎన్నికల ప్రచారం సందర్భంగా కేవలం రూ.288.58 కోట్ల విలువైన వస్తువులు, నగదును మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. అంటే ఈసారి గతంతో పోలిస్తే ఇప్పటికే స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల విలువ రూ.660 కోట్లు పెరిగింది. చాలా ప్రాంతాల్లో పోలింగ్‌కు ఇంకా ఇరవై ఐదు రోజుల సమయం ఉంది. అప్పటికి స్వాధీనం చేసుకునే నగదు, ఇతర వస్తువుల విలువ భారీగా పెరగవచ్చునని భావిస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో గత నెల 31వ తేదీ నాటికి రూ.38.34 కోట్లు, మధ్యప్రదేశ్‌లో ఈ నెల 1వ తేదీ నాటికి రూ.226 కోట్లు, మిజోరంలో గత నెల 25వ తేదీ నాటికి రూ.36 కోట్లు, రాజస్థాన్‌లో గత నెల 24వ తేదీ నాటికి రూ.214 కోట్ల విలువైన వస్తువులు, నగదు స్వాధీనం చేసుకోగా తెలంగాణలో ఈ నెల 2వ తేదీ నాటికి అత్యధికంగా రూ.439 కోట్ల నగదు, ఇతర వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.156 కోట్ల నగదు ఉండగా రూ. 165.2 కోట్ల విలువైన 1,300 కిలోల బంగారం, వెండి, ఇతర లోహాలు, రూ.49.4 కోట్ల విలువైన మద్యం, రూ.24.7 కోట్ల విలువైన గంజాయి ఉంది. ఆదాయపన్ను శాఖ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ బృందాలను నియమించి, విస్తృతంగా తనిఖీలు జరుపుతోంది. విమానాశ్రయాల వద్ద ఎయిర్ ఇంటెలిజెన్స్ ...7లో

కమ్యూనిస్టులను బలపరచాలి

- ప్రజా సమస్యలపై నికరంగా పోరాడుతున్న సీపీఐ(ఎం) : పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు



నవతెలంగాణ-వైరాటౌన్

రాజకీయాలు వ్యాపారంగా మారిన ప్రస్తుత సమాజంలో చట్టసభల్లో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం చాలా ఉన్నదని, ప్రజల పక్షాన నికరంగా నిలబడి నిజాయితీగా పోరాటం చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని, ఓట్లు వేసి గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు విజ్ఞప్తి చేశారు. వైరా నియోజకవర్గ ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా చైతన్యంతో ఆలోచించి సీపీఐ(ఎం) అభ్యర్థి భూక్య వీరభద్రంకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సీపీఐ(ఎం) వైరా నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఆదివారం వైరా పట్టణంలోని మధు విద్యాలయం నందు ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పోతినేని మాట్లాడుతూ.. బీజేపీని ఓడించగలిగే పార్టీకి సీపీఐ(ఎం) మద్దతు ఇవ్వాలనే పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు మునుగోడు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌తో ఎన్నికల సర్దుబాటుకు ప్రయత్నించామని, కానీ కేసీఆర్ బీజేపీతో ఒప్పందం చేసుకోవడంతో తెగదెంపులు చేసుకున్నామని తెలిపారు.

తర్వాత కాంగ్రెస్ జాతీయ నాయకత్వం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రానికి ఫోన్ చేసి ఎన్నికల్లో కలిసి పోదామని కోరడంతో సీట్ల సర్దుబాటు కోసం ప్రయత్నం చేశామని, కాని పార్టీ రాష్ట్ర కమిటీ అడిగిన స్థానాలు ఇవ్వకుండా కాంగ్రెస్ అవమానపరచిందని, చివరికి వారు ఇస్తానన్న మిర్యాలగూడ, వైరా నియోజకవర్గాలను కూడా ఇవ్వకుండా మోసం చేసిందని అన్నారు. బీజేపీని ఓడించడమే సీపీఐ(ఎం) ప్రధాన లక్ష్యం అన్నారు. నవంబర్ 10న వైరా నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి భూక్య వీరభద్రం నామినేషన్ దాఖలు చేస్తారని, నామినేషన్ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుండి పార్టీ సానుభూతిపరులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. అనంతరం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. సీపీఐ(ఎం) సత్తా చాటేందుకు ప్రతి కార్యకర్త రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని, ఎర్రజెండా గురించి అవాకులు, చవాకులు పేలుతున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు.

సీపీఐ(ఎం) వైరా నియోజకవర్గం అభ్యర్థి భూక్య వీరభద్రం మాట్లాడుతూ.. అసెంబ్లీలో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం లేకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారని, దీనిని ప్రజలు అర్థం చేసుకొని సీపీఐ(ఎం)కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, సుంకర సుధాకర్, పారుపల్లి ఝాన్సీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మల్లెంపాటి వీరభద్రరావు, వైరా నియోజకవర్గం మండలాల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకుందాం

- డీలిమిటైజేషన్‌కు వ్యతిరేకంగా ఐక్యపోరు : పాలడుగు భాస్కర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ చెప్పారు. డీలిమిటైజేషన్‌కు వ్యతిరేకంగా జరిగే ఐక్యపోరులో అందరూ కలిసిరావాలని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగుల శిక్షణతరగుతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతున్నదని విమర్శించారు.

కార్పొరేట్ల కోసమే ప్రభుత్వ రంగ సంస్థలకు ఆర్డర్లు, నిధులు ఇవ్వకుండా జాప్యం చేస్తోందన్నారు. ఇన్సూరెన్స్, రైల్వే, రక్షణ వంటి రంగాల్లోని ప్రయివేటు పెట్టుబడులు దేశానికే ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, నాయకులు చెన్నకేశవులు, ఎ.బాపూరావు, ఎ.యాదగిరి, టి.సత్తయ్య, కాశీరెడ్డి, శ్రీధర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు

సచిన్‌తో రిహాబ్ రన్నర్స్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రిహాబ్ రన్నర్స్ పరుగులు పెడుతూనే ఉన్నారు. ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్నారు. తాజాగా ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన మారథాన్‌లో ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పుల్లెల గోపీచంద్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రముఖ కార్డియాక్ రిహాబ్ స్పెషలిస్ట్ డాక్టర్ మురళీధర్ ఇస్తున్న రిహాబ్‌తో గుండె జబ్బులకు గురైన వారు, శస్త్రచికిత్స చేయించుకున్న వారు సైతం కిలోమీటర్ల మేర పరుగులు పెడుతూ ఔరా అనిపిస్తున్న విషయం విదితమే.

ఒక్కసారి గుండె జబ్బుకు గురైతే పడకకే పరిమితమవుతారనే భావన ఉన్న సమాజానికి రిహాబ్ చేయించుకుని పరుగులు తీస్తున్న వారిని చూస్తే అక్కడే ఆగిపోతున్నారు. ప్రస్తుతం ప్రముఖులు సైతం వారి పరుగులకు ఆకర్షితులవుతున్నారు. తాజాగా సచిన్ ప్రశంసలను అందుకుని మురిసిపోయారు. 20 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల విభాగాల్లో మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెండు రాష్ట్రాల్లో జనసేనతో కలిసేపోటీ

- పొత్తులు ఖరారయ్యాయి : డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో జనసేన పార్టీతో తాము కలిసే పోటీ చేస్తామని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రకటించారు. జనసేన ఎన్డీఏ కూటమిలో భాగస్వామి అనీ, తెలంగాణలో ఆ పార్టీతో పొత్తులు ఖరారయ్యాయని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

వేలం పాట మాదిరిగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఉచిత పథకాలు ప్రకటిస్తున్నాయని విమర్శించారు. కర్నాటకలో సంక్షేమ పథకాల అమలులో ఆంక్షలు పెడుతున్నారని తెలిపారు. ఉచిత హామీలతో మోసపోయామని కర్నాటక ప్రజలు గుర్తించారన్నారు. కర్నాటకలో కరెంటు సరిగా ఇవ్వడంలేదనీ, వెయ్యి రూపాయలు వచ్చే కరెంట్ బిల్లు ఇప్పుడు మూడు వేలకు పెంచారని విమర్శించారు. కర్నాటకలో 65 ఏండ్లు దాటిన వారికే వృద్ధాప్య పింఛన్లు ఇస్తున్నారని తెలిపారు. ఈ నెల ఏడో తేదీన ఎల్బీ స్టేడియంలో జరిగే మోడీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అమ్మో కాలుష్యం

- ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ
- జాబితాలో కోల్‌కతా, ముంబయిలు కూడా..



న్యూఢిల్లీ : ప్రపంచాన్ని కాలుష్యం తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలు గాలి కాలుష్యంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత కాలుష్య నగరాల జాబితాలో భారత్ నుంచి దేశ రాజధాని న్యూఢిల్లీ మొదటి స్థానంలో ఉన్నది. అలాగే, కోల్‌కతా (3వ స్థానం), ముంబయి(6వ స్థానం)లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. స్విస్ గ్రూప్ ఐక్యూఎయిర్ సమాచారం ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ సమాచారం ప్రకారం.. ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 483 తో ఆందోళన కరంగా ఉన్నది. రెండో స్థానంలో ఉన్న లాహెూర్‌లో ఇది 371గా ఉన్నది. ఆ తర్వాత స్థానాల్లోని కోల్‌కతా (206), ఢాకా (189), కరాచీ (162), ముంబయి (162) లు ప్రమాదకర ఏక్యూఐలను కలిగి ఉన్నాయి. నిపుణులు, వైద్యుల అభిప్రాయం ప్రకారం ఏ ఆరోగ్యవంతమైన వ్యక్తికైనా సిఫారసు చేయబడిన ఏక్యూఐ 50 కంటే తక్కువగా ఉండాలి.

తక్కువ ఉష్ణోగ్రతలు, గాలి లేకపోవడం, పొరుగు రాష్ట్రాలలో వ్యవసాయ వ్యర్థాలను కాల్చడంతో వాయు కాలుష్య కారకాలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు.కొన్ని పర్యవేక్షణ స్టేషన్లలో ఏక్యూఐ 550కి పైగా ఉండటంతో న్యూ ఢిల్లీలోని రెండు కోట్ల మంది నివాసితులు కళ్ల దురద, గాలి దట్టమైన బూడిద రంగులోకి మారడంతో గొంతు దురద సమస్యలను ఎదుర్కొంటున్నట్టుగా తెలుస్తున్నది. ఒక పక్క భారత్ క్రికెట్ ప్రపంచ కప్‌నకు ఆతిథ్యం ఇస్తున్నది. ప్రమాదకర వాయు కాలుష్య స్థాయిలను పెంచకుండా ఉండటానికి నిర్వాహకులు ముంబయి, ఢిల్లీలోని మ్యాచ్‌లలో బాణసంచా కాల్చడాన్ని నిషేధించారు. బంగ్లాదేశ్ సోమవారం ఢిల్లీలో శ్రీలంకతో మ్యాచ్ ఆడాల్సి ఉన్నది. అయితే పొగమంచు కారణంగా వారి మ్యాచ్‌కు గాలి క్లియర్ అయ్యే అవకాశం తక్కువగా ఉండటంతో షెడ్యూల్ చేసిన శుక్రవారం శిక్షణా సెషన్‌ను రద్దు చేసింది.

ఇప్పట్లో హైపర్‌లూప్ రైళ్లు లేనట్లే

నిటి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్



న్యూఢిల్లీ : సమీప భవిష్యత్తులో దేశంలో అత్యంత వేగంతో నడిచే హైపర్‌లూప్ రైళ్లను ప్రవేశపెట్టే అవకాశం లేదని నిటి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ చెప్పారు. ఈ రైళ్ల ప్రత్యేకత ఏమంటే ఇవి ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. రవాణాకు సంబంధించిన మౌలిక సదుపాయాలపై పర్యావరణ ప్రభావం కూడా తగ్గుతుంది. ఇవి బులెట్ రైళ్ల కంటే వేగంగా ప్రయాణిస్తాయి. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని వీటిని తయారు చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇవి ఆర్థికంగా ప్రయో జనకరం కావని సారస్వత్ తెలిపారు. హైపర్‌లూప్ పరిజ్ఞానం వాణిజ్య పరంగా లాభదాయకమా కాదా అనే విషయాన్ని అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన కమిటీకి సారస్వత్ నేతృత్వం వహిస్తున్నారు. 'కొన్ని విదే శాలు హైపర్‌లూప్ పరిజ్ఞానం గురించి వివరించాయి. అయితే అది మనకు ఆర్థికంగా ప్రయోజనకరం కాదు. ఈ పరిజ్ఞానం పరిణితి చాలా తక్కువ స్థాయిలో ఉంది' అని ఆయన ఆదివారం ఓ వార్తా సంస్థకు చెప్పారు. ఇలాంటి టెక్నాలజీపై మనం ఎక్కువ మొత్తం ఖర్చు చేయలేమని అన్నారు.

అత్యధిక వేగంతో నడిచే హైపర్‌లూప్ రైలు ఓ ట్యూబులో ప్రయా ణిస్తుంది. దీని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలన్ మస్క్ ప్రతిపాదించారు. 2020 నవంబర్ 9న అమెరికాలోని లాస్ వేగాస్‌లో 500 మీటర్ల ట్రాక్‌పై దీనికి ట్రయల్ రన్ నిర్వహించారు. గంటకు 161 కిలోమీటర్ల కంటే అధిక వేగంతో ఇది ప్రయాణించింది.

శోక సంద్రంగా నేపాల్ గ్రామాలు

మృతులకు సామూహిక అంత్యక్రియలు

- క్షతగాత్రులకు ఉచిత వైద్యం : ప్రభుత్వ ప్రకటన
- మరోసారి ప్రకంపనలు



ఖాట్మండు : భారీ భూకంపం నుంచి నేపాల్ గ్రామాలు ఇంకా తేరుకోలేదు. శుక్రవారం రాత్రి భూకంపం సంభవించగా, ఇప్పటివరకూ వారికి పూర్తిస్థాయిలో సహాయం లభించడం లేదు. కొన్ని గ్రామాల్లో తాగడానికి మంచి నీరు కూడా లేని పరిస్థితి నెలకొంది. 6.4 తీవ్రతతో వచ్చిన ఈ భూకంపంతో జాజర్‌కోట్, వెస్ట్ రుకుమ్ జిల్లాల్లోని గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయి. రెండు జిల్లాల్లోనూ 157 మంది మరణించగా, సుమారు 400 మంది గాయపడిన సంగతి తెలిసిందే. వందల సంఖ్యలో ఇండ్లు నేలమట్టమయ్యాయి. గ్రామస్తులంతా కలిసి మృతులకు సామూహికంగా అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.

ట్రాక్టర్లతో దుంగలు, మృతదేహాలను శ్మశాన వాటికలకు తరలించి అంతిమ సంస్కారాలు జరిపిస్తున్నారు. మరణించిన వారిలో ఎక్కువమంది మహిళలు, చిన్నారులు ఉన్నారు. అర్ధరాత్రి భూకంపం రావడంతో ఎక్కువమంది నిద్రలోనే కన్నుమూశారు. కొన్ని చోట్ల కుటుంబాలు కుటుంబాలే మరణించడం లేదా కుటుంబంలో ఒక్కరే సజీవంగా ఉండడంతో ఆయా మృతదేహాలకు అంత్యక్రియలు చేసేవారే లేకుండా పోయారు. అనాథ శవాల్లా వాటికి అంత్యక్రియలు జరిపించాల్సి వచ్చిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను తరలించడం, శిథిలాలను తొలగించడం వంటి పనులను గ్రామస్తులే నిర్వహించుకుంటున్నారు. ఇప్పుడే ఇండ్లు కట్టుకోలేమని, ఈలోగా టెంట్లు, పరుపులు తదితర సామగ్రి ప్రభుత్వం అందజేస్తే ఈ చలిలో వాటితోనే గడుపుతామని ఒక గ్రామస్థుడు చెప్పారు.

క్షతగాత్రులకు ఉచిత వైద్యం

భూకంపం వల్ల గాయపడిన వారికి అన్ని ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందించాలని నేపాల్ ప్రభుత్వం నిర్ణయించింది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు చొప్పున అందించనున్నట్టు ప్రకటించింది. ఆదివారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశం తరువాత ఆరోగ్య శాఖ మంత్రి మోహన్ బహదూర్ బస్నెట్ విలేకరులతో మాట్లాడుతూ.. సహాయక కార్యకలాపాలు ముగింపు దశకు చేరుకున్నాయని, ఖాట్మండుతో సహా అన్ని ప్రదేశాల్లో ఆస్పత్రులను భూకంప బాధితుల చికిత్స కోసం సిద్ధంగా ఉంచామని తెలిపారు. విదేశాలు అందించే సహాయాన్ని ఎలా సమీకరించాలనే దానిపై తదుపరి సమావేశంలో చర్చిస్తామమని చెప్పారు.

మళ్లీ భూకంపం

శుక్రవారం అర్ధరాత్రి సంభవించిన భూకంపం నుంచి నేపాల్ తేరుకోకముందే ఆదివారం తెల్లవారు జామున మరో భూకంపం వచ్చింది. 4:38 గంటల సమయంలో 3.6 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. రాజధాని ఖాట్మండుకు వాయువ్యం గా 169 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతున ఈ భూకంప కేంద్ర ఉందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలియజేసింది. శనివారం మధ్యాహ్నం 3.3 తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు వివరించింది.

రూ. 490 కోట్లకు ఎన్నికల సొత్తు స్వాధీనాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న తనిఖీల్లో అక్టోబర్ 9 నుంచి ఈనెల 5వ తేదీ ఉదయం 9 గంటల వరకు స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.490.60 కోట్లకు చేరింది. ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ పట్టుబడుతున్న సొత్తు పెరుగుతున్నదని అధికారులు చెప్తున్నారు. నవంబర్ 4వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 5వ తేదీ ఉదయం 9 గంటలకు వరకు జరిగిన తనిఖీల్లో రాష్ట్ర వ్యాప్తంగా రూ.2.53 కోట్ల నగదు పట్టుబడింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన అక్టోబర్ 9 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు పట్టుబడిన మొత్తం నగదు రూ. 173.32 కోట్లకు చేరిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. అక్రమ సరఫరాలద్వారా పట్టుబడిన మొత్తం మద్యం విలువ రూ.60.09 కోట్లు ఉన్నదనీ, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల విలువ రూ. 28.61 కోట్లు, బంగారం, వెండి, ఇతరత్రా స్వాధీనాల విలువ రూ. 176.05 కోట్లు, కుక్కర్లు, చీరలు,క్రీడా సామాగ్రి సహా ఇతర వస్తువలు విలువ రూ.52.51 కోట్లు ఉన్నాయని వివరించారు.

రాయ్‌గఢ్ అగ్ని ప్రమాదం

- ఎనిమిది మృత దేహాల వెలికితీత

ముంబయి : మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో అగ్నిప్రమాదం జరిగిన ఒక ఫార్మా కంపెనీ నుంచి ఎనిమిది మృతదేహాలను వెలికి తీశారు. శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగినా ఈ వార్తను రాయ్‌గఢ్ పోలీసులు ఆలస్యంగా విడుదల చేశారు. ఈ ప్రమాదం జరిగిన నుంచి 11 మంది గల్లంతయ్యారని ఉద్యోగులు, బంధువులు ఆరోపిస్తున్నారు. దీంతో మిగిలిన ముగ్గురి కోసం సహాయక బృందాలు గాలిస్తున్నాయి. ఇంకా వీరి ఆచూకీ లభించలేదు. జిల్లాలోని ఎంఐడిసి మహద్‌లోని బ్లూ జెట్ హెల్త్‌కేర్ అనే పరిశ్రమలో ఈ అగ్నిప్రమాదం జరిగింది. ప్రాథమిక విచారణ ప్రకారం.. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ప్రారంభమయ్యాయి. వీటితో పరిశ్రమలోని రసాయనాలతో నిండిన బారెల్స్ పేలడంతో మంటలు మరింత తీవ్రంగా మారాయి.

గాంధీభవన్‌లో బీఫామ్‌ల సందడి

- అందుకున్న గద్దర్ కూతురు
- అభ్యర్థుల తరపున బీఫామ్‌లు తీసుకెళ్లిన వారి పిల్లలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గాంధీభవన్‌లో బీఫామ్స్ సందడి నెలకొంది. రెండు విడతాలుగా 100 మంది అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ...ఆదివారం బీఫామ్‌లను అందించింది. ఇప్పటి వరకు 65 మంది అభ్యర్థులు బీఫామ్స్ అందుకున్నారు. ముగ్గురు అభ్యర్థులకు బీఫామ్‌లు ఆపేయాలని అధిష్టానం ఆదేశించింది. మిగతా 32 మంది అభ్యర్థులు సోమవారం తీసుకోనున్నారు. అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో వారి పిల్లలు వచ్చి బీఫామ్స్‌లు అందుకున్నారు. వారందరికి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీ, విశ్వనాథ్, ఉపాధ్యక్షులు జి నిరంజన్, కుమార్‌రావు తదితరులు బీఫామ్స్ అందజేశారు. కొడంగల్ అభ్యర్థి, రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, జూబ్లీహిల్స్ అభ్యర్థి అజహరుద్దీన్, కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డితోపాటు పలువురు ప్రముఖులు బీఫామ్స్ తీసుకున్నారు. కంటోన్మెంట్ అభ్యర్థి గద్దర్ కూతురు జి వెన్నెల స్వయంగా వచ్చి తీసుకున్నారు. జగిత్యాల అభ్యర్థి,ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కుమారుడు, నిర్మల్ అభ్యర్థి శ్రీహరిరావు కూతురు బీఫామ్ తీసుకున్నారు. సోమవారం కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి తన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. వనపర్తి అభ్యర్థి జి.చిన్నారెడ్డి, చేవెళ్ల అభ్యర్థి భీంభరత్, బోథ్ అభ్యర్థి వన్నెల అశోక్‌లకు బీఫామ్‌లు ఆపేయాలని అధిష్టానం ఆదేశించింది. ఆయా నియోజకవర్గాల్లో వారు గెలిచే అవకాశం లేదని అధిష్టానం దృష్టికి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఆ నియోజకవర్గాలకు బలమైన అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నారు.

సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించండి

బీజేపీ అభ్యర్థులను ఓడించండి

వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక, సామాజిక పోరాట శక్తులను బలపర్చండి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల మ్యానిఫెస్టో-2023





రాష్ట్ర శాసనసభకు 2023 నవంబరు 30న ఎన్నికలు జరగనున్నాయి. ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ మ్యానిఫెస్టో ప్రకటిస్తున్నది. ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. కీలక అంశాలను పరిష్కరించకుండా పాలకులు దాటవేస్తున్నారు. సీపీఐ(ఎం) నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా ఉంది. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నది. అలాంటి సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించి శాసనసభకు పంపించడం అవసరం. గత ఐదేండ్లుగా వామపక్షాలు లేని శాసనసభను తెలంగాణ ప్రజలు గమనించారు. ప్రజాసమస్యల గురించి వామపక్షాలు మాత్రమే శాసనసభలో నినదిస్తాయని రుజువైంది. వామపక్షాలు లేని లోటు శాసనసభలో స్పష్టంగా కన్పించింది. ఈ ఎన్నికల సందర్భంగా సీపీఐ(ఎం), వామపక్షాల అభ్యర్థులను గెలిపించడం ద్వారా తెలంగాణ తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నాం.

నిర్వాసితులు

- భూములు కోల్పోయిన నిర్వాసితులకు 2013చట్ట ప్రకారం (ప్రభుత్వ, అసైన్డ్ భూములకు కూడా) పరిహారం ఇవ్వాలి.
- పట్టాలు లేకున్నా సాగుదారు లందరికీ పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తాం.

ప్రజాసమస్యలు



- ఇండ్లు లేని వారందరికీ ఇండ్లస్థలాలు, ఇండ్ల నిర్మాణానికి రు.10లక్షలు ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తాం.
- ప్రభుత్వ భూములను అర్హులైన పేదలందరికీ పంపిణీ చేయాలని పోరాడుతాం.
- ప్రభుత్వ, అటవీ బంజరు భూములలో నివాసం ఉంటున్న, సాగుచేస్తున్న పేదలకు పట్టాల కోసం పోరాటం చేస్తాం.
- కుల, మత ఘర్షణలను నివారించి, నేరాలకు బాధ్యులైనవారిని శిక్షించి, బాధితులకు రక్షణకు కట్టుబడి ఉంటాం.

ఉపాధి హామీ



- ఉపాధి హామీ చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలని, సంవత్సరం పొడవునా అర్హులైన వారందరికీ పని కల్పించాలని, పట్టణ ప్రాంతాలకు కూడా ఈ చట్టాన్ని వర్తింపచేయాలని ప్రభుత్వంపై పోరాడుతాం.
- కేంద్రం కేటాయించే నిధులతో పాటు తగినన్ని నిధులు రాష్ట్ర బడ్జెట్ నుండి కేటాయించాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తాం.
- కొలతల పద్ధతి నివారించి రోజు కూలీ విధానం అమలుకు కృషిచేస్తాం.

పారిశ్రామిక రంగం



- కనీస వేతనం రూ. 26,000/-లకు తగ్గకుండా నిర్ణయించే వరకూ, కార్మిక చట్టాల అమలుకు పోరాడతాం.
- సమాన పనికి సమాన వేతనం మా డిమాండ్
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తాం.
- ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేస్తాం.
- చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరతాం.
- మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు కృషి చేస్తాం. వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటుకు ప్రయత్నం చేస్తాం.
- రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం.
- ఐటీఐఆర్ ప్రాజెక్టును రప్పించే ప్రయత్నం ప్రభుత్వం చేయడానికి కృషి చేస్తాం
- సింగరేణిని ప్రభుత్వరంగంలోనే బలోపేతం చేసేందుకు, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు వత్తిడి చేస్తాం.
- విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను త్వరితంగా ఏర్పాటు చేసి, స్వయం పోషకత్వం సాధించేందుకు చర్యలు తీసుకోవాలనీ, వివిధ జిల్లాల్లో లభిస్తున్న ఖనిజాల ఆధారంగా పరిశ్రమలను నెలకొల్పి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం. వికేంద్రీకరణ ద్వారా అన్ని జిల్లాల్లో ఉపాధి పెంచి సమతుల్యతకు కట్టుబడి ఉన్నాం.
- కాలుష్యరహిత పరిశ్రమలకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలి. పర్యావరణ రక్షణకు ప్రాధాన్యతనిచ్చి కఠినమైన చట్టాలను అమలు చేయాలి..
- పారిశుధ్య సేవలకు సంబంధించి రాంకీ, తదితర ప్రయివేటు సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలి.
- పారిశుధ్య కార్మికుల పిల్లలకు ఉన్నత చదువులకు స్కాలర్‌షిప్స్ అందించేందుకు కృషిచేస్తాం.

వ్యవసాయరంగం



- రైతుల పెట్టుబడికి సరిపడా రుణాన్ని బ్యాంకులు, సహకార సంస్థల నుండి సమకూర్చేందుకు కృషి చేస్తాం. మార్కెట్ కమిటీల ద్వారా రైతులకు ఉపకరణాలు ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తాం.
- రైతుల పంటలపై 80శాతం రుణాలు ఇచ్చి గోదాముల సౌకర్యం కల్పించాలని కోరతాం.
- ప్రభుత్వమే భూసార పరీక్షలు నిర్వహించి ఎరువులు, పురుగు మందుల వాడకంపై రైతులకు తగు సూచనలు చేమాలి.
- ధరల నిర్ణాయక కమిషన్ ఏర్పాటు చేసి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని,పంటలు సేకరించాలని కోరతాం.
- విత్తన చట్టాన్ని తక్షణమే ఆమోదించి అమలు చేసేందుకు, విత్తన పరిశోధనా కేంద్రాల కోసం కృషి చేస్తాం.
- ప్రత్యామ్నాయ పంటలుగా తృణధాన్యాలకు ప్రోత్సాహం
- వ్యవసాయ అనుబంధ రంగాలైన పాలు, కూరగాయాలు, పశుసంవర్ధక శాఖ, హార్టికల్చర్ శాఖల నుండి సలహాలు, ఆర్థిక వనరులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తాం. పశుసంవర్ధకశాఖ, హార్టికల్చర్ శాఖల నుండి సలహాలు, ఆర్థిక వనరలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తాం.
- కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం రూపొందించాలని, ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ కోసం కృషి చేస్తాం.
- కౌలురైతులకు గుర్తింపు, వ్యవసాయ రుణాలు, సబ్సిడీలు, పంటబీమా, కౌలు, పోడు మొదలగు రైతులందరికీ రూ.5లక్షల రైతు బీమా సౌకర్యం కల్పించాలని, ప్రకృతి వైపరీత్యాలు, అటవీ జంతువుల వల్ల పంట నష్టం జరిగితే సాగు చేసిన రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తాం.
- 10 ఎకరాల లోపు రైతులకు వ్యవసాయ ఉపకరణాలు (విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు) ఉచితంగా ప్రభుత్వం అందించాలి. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి చేసి, నాణ్యమైన విత్తనాలను అందించాలి.

అందరికీ విద్య



- రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20శాతం నిధులను, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులను విద్యకు కేటాయించేందకు ఆందోళన కొనసాగిస్తాం. ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేయాలి.
- టిఫిన్, భోజనం, పుస్తకాలు, దుస్తులు మరియు అన్నిరకాల ఆటవస్తువులు పాఠశాలకు కల్పించాలి. విద్యార్థులకు విద్యాహక్కు చట్టం అమలు చేసేందుకు కృషి చేస్తాం.
- అందరికీ ఉచిత శాస్త్రీయ విద్యను ప్రవేశపెట్టేందుకు, 3-18 సం.ల వయసు గల విద్యార్థులకు విద్యాహక్కుచట్టం అమలు చేసేందుకు కృషి చేస్తాం.
- కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేసేందుకు పోరాడతాం.
- ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలి. కొత్తగా కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుమతులు ఇవ్వరాదు.
- రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తాం.

వైద్యం

- పేదలందరికీ ఉచిత వైద్యం అందిస్తాం. వైద్య రంగానికి తగినన్ని నిధులు బడ్జెట్‌లో కేటాయించేందుకు ఆందోళన కొనసాగిస్తాం.
- కార్పొరేట్ వైద్యాన్ని నియంత్రించి, ప్రభుత్వ ఆరోగ్య రంగాన్ని పటిష్టం చేసేందుకు, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ ను రూ. 15 లక్షలకు పెంచి, సమర్థవంతంగా అమలుచేసేందుకు ఒత్తిడి చేస్తాం.

వ్యవసాయ కార్మికులు



- వ్యవసాయ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని, ప్రీమియం ప్రభుత్వమే చెల్లించడానికి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తాం.
- వినియోగ రుణాలు (కన్స్యూమర్ లోన్స్) బ్యాంకుల నుండి ఇవ్వాలని డిమాండ్ చేస్తాం.
- వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం అమలుకు కట్టుబడి వున్నాం.
- భూమి లేని వ్యవసాయ కూలీలకు మిగులు భూమి పంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం.

ప్రజా పంపిణీ వ్యవస్థ



- ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసి ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు పోరాడతాం.
- సన్నబియ్యం, గోధుమలు, పప్పులు, నూనెల వంటి నిత్యావసర సరుకులను చౌక డిపోల ద్వారా పంపిణీ చేసేందుకు పోరాడుతాం.

కార్మిక సంక్షేమం- ఉద్యోగ భద్రత



- అంగన్వాడీ, ఆషా, మధ్యాహ్న భోజనం, ఐకెపి తదితర స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించేందుకు జరిగే పోరాటాలకు అండగా ఉంటాం. గ్రామ పంచాయితీ, మున్సిపల్ కార్మికుల వేతనాలకు ప్రభుత్వం నుండి గ్రాంటు ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం. పిఎఫ్, ఇఎస్ఐ,గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యాల కల్పన, 7 లక్షల మంది బీడీ కార్మికుల ఉపాధి, వేతనాల పెంపు కోసం కృషి చేస్తాం.
- కార్మిక కేంద్రాలలో ఇఎస్ఐ హాస్పిటల్స్ ఏర్పాటు, ఇఎస్ఐ సేవలను సమర్థవంతంగా అమలు జరిపేందుకు కృషి చేస్తాం.
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్‌కు ఆటంకంగా వున్న యాక్ట్ 2/94 రద్దుకై పోరాడతాం. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్, ఎన్.ఎం.ఆర్ తదితర ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ కోసం జరిగే ఆందోళనలకు మద్దతునిస్తాం.
- అన్ని రకాల హమాలీలకు, మోటార్ ట్రాన్స్‌పోర్టు, ఆటో, ఇతర అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2వ పిఆర్‌సిని అమలు, డిఎ సకాలంలో విడుదల, హెల్త్ స్కీమ్ పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు మా ప్రాధాన్యత.
- యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు రెగ్యులరైజేషన్ కోసం ఉద్యోగ సంఘాలతో చర్చించి వారి సమస్యలను ప్రజాయుతంగా పరిష్కరించేందుకు వత్తిడి చేస్తాం
- నిస్తేజంగా పడివున్న కార్మికశాఖను పునర్వవస్థీకరించాలి. కార్మికుల ప్రయోజనాలకు హాని కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. కనీస వేతనాల సలహామండలి, లేబర్ వెల్ఫేర్ బోర్డు తదితర త్రైపాక్షిక కమిటీలను క్రియాశీలకంగా పనిచేయించే విధంగా ఒత్తిడి చేస్తాం.

అధికార వికేంద్రీకరణ

- స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తాం. కేరళ మాదిరిగా రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి.
- 73, 74 రాజ్యాంగ సవరణలకు అనుగుణంగా నిధులు, అధికారాలు బదిలీ చేయాలి.
- గ్రామీణ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తాం.

సామాజిక అంశాలు

- కులవివక్షకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపర్చాలి. కుల దురహంకార హత్యలకు, దాడులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలి. ఇందుకోసం ప్రజాస్వామ్య శక్తులను సమీకరిస్తాం.

వెనుకబడిన తరగతులు



- బీసి కులాలకు జనగణనను చేపట్టాలి. బీసిల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలి.
- వృత్తిదారులకు ప్రమాదబీమా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తాం
- అర్హులైన వారందరికీ ఇంటి స్థలం, ఆ స్థలంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణానికి ఆర్థిక సహాయం కోసం పోరాడతాం.

దళితుల ఆత్మగౌరవం-అభివృద్ధి కొరకు హామీ



- ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేయాలి.
- ఎస్సీ, ఎస్టీ బడ్జెట్లలో, సబ్‌ప్లాన్ చట్టాలలో లోపాలను సవరించి, రూల్స్ రూపొందించి ఖచ్చితంగా సబ్‌ప్లాన్ నిధులను ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి ఖర్చుచేసేందుకు ప్రభుత్వంపై పోరాడతాం.
- దళిత, గిరిజన, నిమ్నకులాల ప్రజల అత్యధికంగా ఉన్న వ్యవసాయ కార్మిక రంగంలో సమగ్ర సామాజిక భద్రతా చట్టం తీసుకురావాలి. ఉపాధి హామీ కార్మికులకు హెల్త్ కార్డులు, పెన్షన్లు ఇచ్చేందుకు కృషిచేస్తాం.
- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో వర్గీకరణకు కృషి చేస్తాం. బ్యాక్‌లాగ్ పోస్టులను సత్వరమే భర్తీ చేసేందుకు, బ్యాంకులతో లింక్ లేకుండా కార్పొరేషన్ రుణాలు ఇచ్చేందుకు ఒత్తిడి తెస్తాం.
- జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను పకడ్బందీగా అమలు చేయాలి.
- స్మశాన వాటికలు లేని గ్రామాలలో స్మశానవాటికలు ఏర్పాటుకు కృషి చేస్తాం.
- దళిత క్రైస్తవులను ఎస్సీలుగా పరిగణించాలి.
- కాటికాపరుల వృత్తిపై జీవిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆరోగ్య రక్షణకు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ మంజేరు చేయాలి.
- స్మశానవాటికలలో తోటమాలి పని ప్రయివేటీకరణను రద్దుచేసి కాటికాపరులకు అప్పగించాలి.
- కాటికాపరుల పిల్లలకు ఉచిత విద్య, హాస్టల్ వసతి ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం.
- భూమి లేని నిరుపేద బ్యాగరీ కుటుంబాలకు సాగుభూమి కేటాయించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం.

సింగరేణి కార్మికుల సంక్షేమం



- వారసత్వ ఉద్యోగాలు కొనసాగింపు, కోలిండియాలో అమలవుతున్న ఒప్పందాలు (పర్మినెంటు, కాంట్రాక్టు కార్మికులు, అధికారులకు) వర్తింపుకు కృషి చేస్తాం. కార్మికులకు ఇండ్ల స్థలాలు కేటాయింపుకు యాజమాన్యంపై ఒత్తిడి తెస్తాం.
- కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ కు కృషి చేస్తాం.
- కోలిండియా వేతనాల అమలు కోసం, లాభాల్లో వాటా చెల్లింపు కొనసాగింపుకు కృషి చేస్తాం.
- కోల్ బ్లాకులను ప్రైవేటుపరం కాకుండా కాపాడతాం
- గుర్తింపు ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికులకు ఓటుహక్కు కల్పించేందుకు యాజమాన్యంపై ఒత్తిడి చేస్తాం.

గిరిజనులు



- ఆదివాసీలకు 1/70 చట్టం, పెసా చట్టం అమలు, ఏజెన్సీ ఏరియాను 6వ షెడ్యూల్‌కు మార్చి స్వయంప్రతిపత్తి పాలకమండలి ఏర్పాటుకు కృషి చేస్తాము. గిరిజన చట్టాలను, అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేస్తాం.
- ప్రతి జిల్లాకు ఐటిడిఎ ఏర్పాటు చేయాలి. తండాలలో ఏర్పడిన పంచాయితీలకు ఆర్థిక పరిపుష్టి కల్పించాలి.
- గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇచ్చి, రుణసౌకర్యం కల్పించేందుకు పోరాడతాం.
- జీవో ఎంఎస్ నెం.3 పునరుద్ధరణకై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తాం.
- నాన్ ఏజెన్సీలో ఉన్న గిరిజన గ్రామాలను ఏజెన్సీలో కలపటం, ఉట్నూర్, భద్రాచలం 5వ షెడ్యూల్ ప్రాంతాలను కలుపుతూ ఏజెన్సీ జిల్లా ఏర్పాటుకు జరిగే ఆందోళనకు అండగా ఉంటాం.
- గొత్తి కోయలను ఎస్టీలుగా గుర్తించాలి. వారి గ్రామాలను తొలగింపును వ్యతిరేకిస్తాం.
- గిరిజన విశ్వవిద్యాలయంలో గిరిజన విద్యార్థులకు 80శాతం రిజర్వేషన్ కల్పిస్తాం
- లంబాడీ, గోండి, కోయ భాషలను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చి లిపిని తయారుచేయిస్తాం

నవతెలంగాణ దర్వాజ 4
సోమవారం 6-11-2023 || హైదరాబాద్

శీతాకాలపు సాయంత్రం



రంగురంగుల సామానులు, శంఖాలు
గవ్వలు బండిమీద పెట్టుకుని చిరు వ్యాపారి
సముద్రపు ఎనిమోన్లు, షార్క్ తోకలు
తన నైపుణ్యాన్ని అంతా రంగరించి అరచి చెపుతూ
కొనుగోలు దారులను ఆకర్షించడానికి
ప్రయత్నం చేస్తున్నాడో చిరుతిళ్ళు అమ్మకందారు
రికామీ గా నడుస్తూ వెళుతున్న వృద్ధుల సమూహం
ఒకరిలో మరొకరిని పోగొట్టుకున్న యువ జంటలు
ఉత్సాహం ఉరకలెత్తే కాలేజీ పిల్లల గుంపులు
అందరూ ఒక ఆనిమేటెడ్ కబుర్లలో
అంతా ఒక్కసారిగా ఖాళీ తీరాన్ని
కాంతి పాదాల మేఘాలకు ఇచ్చేసి వెళ్లిపోయారు
సాయంత్రం షికారుకు వచ్చిన ఉల్లాస పక్షులు
తమకంతో గాలిలో గిరికీలు కొడుతున్నాయి
అసంఖ్యాకమైన చిన్ని పీతలు
తీరంలో ఎప్పటిలాగే జిత్తులమారి తనంతో

ఒడియా మూలం : శీతాకాంత్ మహాపాత్ర
తెలుగులోకి :వంశీకృష్ణ

సాహితీ వార్తలు

'రహదారి' కవితా సంపుటి ఆవిష్కరణ, అంకితోత్సవం

ఈ నెల10వ తేదీ సాయంత్రం విజయా హైస్కూల్ ఆర్మూర్‌లో కొరుప్రోలు హరనాథ్ కవితా సంపుటి 'రహదారి' ఆవిష్కరణ, అంకితోత్సవ కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమంలో నటి శ్రీమతి రాజశ్రీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ఈ కవితా సంపుటిని విజయా విద్యా సంస్థలు, అమృతలత అపురూపా అవార్డ్స్ అధినేత్రి డా॥ అమృతలతకి 'రహదారి'ని అంకింతం ఇస్తారు. ఈ కార్యక్రమంలో రాజశ్రీ, డా॥అమృతలత, వి.పి.చందన్ రావు, నెల్లుట్ల రమాదేవి, దేవలపల్లి సునంద, కవిత తదితరులు పాల్గొంటారు.

- దేవలపల్లి సునంద

'చాటువులు-చమత్కారాలు-సమాలోచన' మూడు రోజుల జాతీయ సదస్సు

ఏ.వి. ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్ కళాశాల తెలుగుశాఖ, యాద శంకర మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో 'చాటువులు-చమత్కారాలు- సమాలోచన' జాతీయ సదస్సు ఈ నెల 7,8,9 తేదీల్లో జరుగుతుంది. ఈ సదస్సు 7వ తేది ఉదయం 10 గం.లకు ఏ.వి. కళాశాల ఆడిటోరియంలో ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా శ్రీ తనికెళ్ల భరణి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య సి. కాశీం పాల్గొంటారు. ఈ సదస్సులో 42 మంది పరిశోధకులు పత్రసమర్పణ చేస్తున్నారు. 9వ తేది మధ్యాహ్నం సమాపనత్సవానికి ముఖ్య అతిథిగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఆచార్య మసన చెన్నప్ప, ఆచార్య సాగి కమలాకరశర్మ పాల్గొంటారు. ఈ సదస్సులో ఆచార్య కె.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొంటారు.


- డా.వై.సత్యనారాయణ

ఇప్పపూల పరిమళం

పైరగాలిలా స్వేచ్ఛగా, సెలయేటి నీళ్లలా స్వచ్ఛంగా, వెన్నెలలా చల్లగా గిరిజన ఆదివాసీలు అడవుల్లో బతుకుతున్నారని కవి కుమారులు ఊహిస్తుంటారు. కాని జీవన్ శ్రమపడి సంకలనం చేసిన 'ఇప్పపూలు' సంకలనంలోని కథలను చదివితే వాళ్లు సంఘర్షణాయుతమైన పరిస్థితుల్లో, ప్రాణాంతకమైన పరిస్థితుల్లో బతుకుతున్నారని తెలుస్తుంది.

మైదాన ప్రాంతం నుండి వెళ్లి అడవిలో స్థిరపడ్డ షావుకారు ఇచ్చిన నాలుగు వందలు కొద్దికాలం తర్వాత ఏడు వేలవుతాయి. అదీ ప్రతి సంవత్సరం వడ్డీ చెల్లిస్తూ వచ్చినా! ఇది 1950కి ముందు తెలంగాణ పల్లెల్లో జమిందారులు, షావుకార్లు బడుగు బలహీన వర్గాల వారికి చిన్నచిన్న అప్పులిచ్చి వాళ్ల పొలాలను కబళించి, ఇళ్లను కబ్జా చేసి, పిల్లలను కట్టుబానిసలను చేసుకున్నప్పటి దారుణాలను గుర్తు చేస్తుంది. సవర తెగకు చెందిన మల్లిపురం జగదీష్ రాసిన 'దారి' కథలో ఇదొక పార్శ్వం. రెండో పార్శ్వంలో వాళ్ల తెగకే చెందిన తెలివైన యువకుడు చిన్నచిన్న సహాయాలు చేసి విశ్వాసం చూరగొని వాళ్ల భూములను తన పేరిట మార్చేసుకున్నాడు. ఆ భూముల మీద బ్యాంకుల నుండి అప్పులు తీసుకున్నాడు. ఆ అప్పులు సర్కారు మాఫీ చేసింది. అయినా అతడు ఎవరి భూమిని వాళ్లకు బదలాయించడానికి ఇష్టపడక దౌర్జన్యపూరితంగా వ్యవహరిస్తాడు. అప్పుడు అతని సొంత తాత 'ఇన్నాళ్లు మాతోటి నడిసినట్టుగా నడిసి నీదారినీవు చూసుకున్నావు. మాకూ ఒక దారుంటాది' అంటాడు. అది విప్లవమార్గమని ధ్వని. ఈ యువకుడు అంచెలంచెలుగా రాజకీయంగా ఎదిగి దౌర్జన్య స్వభావాన్ని, పెట్టుబడిదారీ దోపిడీ స్వభావాన్ని అలవరచుకున్నాడు. ఈ కథలో రెండు వస్తువులున్నాయి. బయటివాడు ఆదివాసీలను మోసం చేయడం, తమవాడే విశ్వాసం పునాదిగా ఆదివాసీలకు ద్రోహం చేయడం. ఇందుకు విరుగుడుగా వాళ్లు తిరుగుబాటు చేస్తారు. దీంతో కథకు తమతుల్యత, తాత్వికత సిద్ధించాయి.

కోయ వర్గానికి చెందిన పద్దం అనసూయ 'మూగబోయిన శబ్దం' ఆదివాసీలకు మతమార్పిడుల మూలంగా ఎదురవుతున్న సవాలుకు సంబంధించిన కథ. చనిపోయిన పెద్ద కొడుకు కర్మకాండకు రమ్మని పిలవడానికి కథానాయిక ఇంటికి వచ్చాడు ఎనభై ఏండ్ల పెదనాయిన. వాళ్ల కోయ సంప్రదాయం ప్రకారం ఇట్లాంటి కార్యక్రమాలకు డోలోళ్లు వచ్చి డోళ్లు మోగిస్తారు. కోయజాతి పుట్టుపూర్వోత్తరాలు తెలిపే 'పూర్వం' గానం చేస్తారు. ఈ సంప్రదాయాలు చూసి వున్న రచయిత్రి తన పెదనాయిన ఇంట్లో కూడా వాటికోసం చూస్తుంది. కనిపించవు. ఆయనను అడుగుతుంది, డోలోళ్లు లేరేమని. చిన్నన్నను అడగమంటాడు. చిన్నన్నను అడిగితే, 'వాళ్లు రారు' అంటాడు. 'కర్మకాండ ఎవరు చేస్తారని' అడిగితే, తాను మతం తీసుకున్నానంటూ మెడలోని శిలువను చూపిస్తాడు. ఇది కథను అనుకోని మలుపు తిప్పే ఘట్టం. ఆ తర్వాత కొనసాగించటానికి కథంటూ మిగలలేదు. కేవలం సుళ్లు తిరిగే మనోవ్యథను కలిగించే ఆలోచనలు తప్ప. తమ తెగ చరిత్రను గానం చేసేవాళ్లే ఇక వుండరన్న భావన నాయికకు విద్యుద్ఘాతమవుతుంది. క్రైస్తవ మతాధికారి చదువబోయే బైబిల్ కోయ భాషలో వుండదు. ఆ నిబంధనలు కోయజాతికి నైసర్గికమైనవి కావు. ఇక మీదట వాళ్లు ప్రేమించే ఆదివాసీ సంగీత వాయిద్యాలు నశించిపోవచ్చు. వెరసి తమ సంస్కృతి కూకటివేళ్లతో కూలిపోయే రోజు వచ్చిందన్న భావన ఆమెకు కలుగుతుంది. చనిపోయినవారి ఆత్మశాంతికి ఉద్దేశించిన కర్మకాండ సాంప్రదాయకంగా జరగకపోవడం వల్ల పెద్ద కొడుకు ఆత్మశాంతి ప్రశ్నార్థకం కావడం పెదనాయినను ఎక్కువగా కలచివేస్తుంది. ఇది విశ్వాసానికి సంబంధించిన కోణం. ఎనభై ఏళ్ల ముది వయసులో పెదనాయినకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం విషయంలో ఏమీ చేయలేని నిస్సహాయత కూడా నాయికలో వ్యక్తమవుతుంది. ఆయనకు పెద్దకొడుకు ఎట్లాగూ లేడు. చిన్నకొడుకు వుండీ లేకుండా పోయాడు. అస్తిత్వ వేదనతోపాటు పెదనాయిన మానసిక వేదనను కూడా తీవ్రస్థాయికి చేర్చి పాఠకులలో సహానుభూతిని కలిగించటంలో రచయిత సఫలమయ్యాడు. ఉత్తమ పురుష కథనంలో స్త్రీ కంఠస్వరంతో సాగిన కథ ఇది.




బంజారా వర్గానికి చెందిన సూర్యాధనంజయ్ రాసిన 'అంబాలి', భూక్యా తిరుపతి రాసిన 'కాక్లా' కథలు రెండూ విశ్వాసానికి సంబంధించినవి. అంబాలి తన తెగ వాడినే పెళ్లిచేసుకుంటుంది. పైగా అది ప్రేమవివాహం. భర్త చనిపోయాడు. అత్తామామా, కులపెద్దలు ఆమెను ఆమె మరిదికిచ్చి రెండవ పెళ్లి చేయటానికి ఏకపక్షంగా నిర్ణయిస్తారు. దీన్ని అంబాలి ఎదిరిస్తుంది. అంతేకాదు, ఊరినీ, కుటుంబాన్నీ వదులుకుని తన వర్గానికే చెందిన ఉన్నత విద్యావంతురాలు అరుణతో పాటు నగరానికి వెళ్లిపోతుంది. ఒక మారుమూల తాండాకు చెందిన యువతి నగరవాతావరణంలో ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చే వాతావరణం ఏర్పడినట్లయింది. ఈ కథలో తెగపెద్దలు దేవర న్యాయాన్ని అమలు పరచాలని చూస్తారు. నిజానికి ఇది ఆస్తిపాస్తులను కాపాడుకోవటానికి, తమ వంశం, రక్తాన్ని పంచుకుని పుట్టే పిల్లలను పొందటానికి ఉద్దేశించింది. ఈ విశ్వాసాన్ని ఎదిరించడం ఒక విధంగా సంస్కరణవాదమే. దీనికి అదనంగా సూర్యాధనంజయ్ స్త్రీ స్వేచ్ఛను కూడా జోడించారు. దీంతో స్త్రీ వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసినట్లయింది.

'కాక్లా' కథ మొదలు కావటమే మరణవార్తతో మొదలై ఉత్కంఠభరితంగా సాగుతుంది. చనిపోయింది మేనత్త. రాయలసీమలో ఉద్యోగరీత్యా ఉన్న కథానాయకుడు సుదీర్ఘప్రయాణం తర్వాత మేనత్త ఊరు చేరుకుంటాడు. తనను చూడగానే ఆడామగా దు:ఖిస్తారు. అతను కూడా మేనత్తను తలచుకుని దు:ఖిస్తాడు. ఆశ్చర్యకరంగా చనిపోయిందనుకున్న మేనత్త కూడా ఏడుస్తూ కనిపిస్తుంది. ఇదే కథలో కీలకాంశం. ఆమె గొడ్లను కాయటానికి అడవికి పోతే పై నుండి కాకి వచ్చి తల తన్ని పోయింది. ఇది కీడు కలుగజేస్తుందన్నది తండా పెద్దల విశ్వాసం. ఈ కీడు తొలగిపోవాలంటే ఆమె మరణించిందన్న అబద్ధం చెప్పి బంధువులందరిని రప్పించాలి. ఇప్పుడు జరిగిందదే. ఇది విద్యాధికుడైన నాయకుడికి కోపం తెప్పిస్తుంది. చివరకు ఇది కల్లుతాగి, యాట మాంసం ఆరగించడంతో మంచి విందుగా ముగిసింది. ఇది తండా దృష్ట్యా విశ్వాసం, విద్యాధికుల దృష్ట్యా అభాసవిశ్వాసం. అందుకే వ్యంగ్యం కూడా. బతికివుండగానే తనను చంపేశారన్న భావన మేనత్తలోనుంచి తొలగించటానికి ఈ మత్తు ఒక మానసిక చికిత్స. ఆద్యంతాలలో తగు మాత్రం వ్యంగ్యం జోడించి రచయిత కథనం చేశాడు. మేనత్త బతికివున్నా, చనిపోయిందన్న భ్రమను కల్పించుకుని దు:ఖించిన వారిలో ఒక అతిశయ నాటకీయతను సృష్టించటంలో రచయిత సఫలమయ్యాడు.

తిమ్మక రాంప్రసాద్ (జాతావుతెగ) రాసిన 'పిన్లగ్ర' కథ భావుకమైన ప్రేమకు, విషాదాంతానికి సంబంధించింది. నాయకుడు మంచి పిల్లనగ్రోవి కళాకారుడు. జానకి ఆ సంగీతాన్ని, సంగీతకారుల్ని పిచ్చిగా ప్రేమిస్తుంది. నాలుగురాళ్లు సంపాదించుకుని వచ్చి, పెళ్లిచేసుకుందామని ఊరిని విడిచి సిమెంట్ ఫ్యాక్టరీలో కూలీగా పనిచేసి, రొయ్యల చెరువులు, కోళ్లఫారాలలో క్రిమిసంహారక మందులు చల్లే పనులు చేసి, అల్పకాలంలోనే అనారోగ్యం పాలై జీవచ్ఛవంగా మారి ఊరికి తిరిగి వస్తాడు. పిల్లనగ్రోవి బస్సు టైర్లకింద పడి నలిగిపోవటం వాళ్ల ప్రేమ విషాదాంతమైందన్నదానికి ప్రతీక. రచయితకు వాతావరణ చిత్రణలో మంచి నేర్పు వుంది. కవితాత్మకమైన వచనం ద్వారా ప్రణయాన్ని సృష్టించగలిగాడు. కథానాయకుడు 'గాలికి ధ్వని రంగులద్దగల పిన్లక్ర పాటగాడ'ట! డప్పుల హోరుకు 'కొండలు కదిలి ఊగుతున్నాయ'ట! కాని ఫ్యాక్టరీలు, రొయ్యల చెరువులు ఈ కొండను ధ్వంసం చేశాయి. ప్రపంచీకరణ ప్రభావంతో నగరాలు, గ్రామాలను విషపూరితం చేశాయి. ప్రేమలు, స్నేహాలు, బంధుత్వాలు బలైపోవడం కండ్లముందు జరుగుతున్న విపరిణామం. ఈ విశాల దృశ్యంలో ఈ విషాదాంత ప్రణయగాథ ఒక వికృత ఛాయ.

చింతా దీక్షితుల వంటి అగ్రశ్రేణి సాహితీవేత్త రాసిన కథ కూడా 'ఇప్పపూలు' సంకలనంలో వుంది. వామపక్ష రచయితలు రాసిన కథలన్నీ ఆలోచింపజేసేవిగా వున్నాయి. గిరిజన ఆదివాసీలకు మైదాన ప్రాంతాల చిన్న పెద్ద పెట్టుబడిదార్లకు మధ్య సాగుతున్న నిరంతర సంఘర్షణను వర్గపోరాటంగా చిత్రించడంలో వీరు సఫలమయ్యారు. దీంతో మైదాన ప్రాంతపు రచయితలు సంచార జాతి ప్రజల కష్టసుఖాలతో మమేకమై వున్నారన్న అంశం కూడా రుజువైంది. సుమారు వంద సంవత్సరాలుగా అప్పుడప్పుడు పత్రికల్లో అచ్చవుతూ వస్తున్న కథలలో నుండి ఓపికగా నలభై మంచి కథలను ఎంపిక చేసి ప్రచురించిన జీవన్‌గారికి అభినందనలు.



- అమ్మంగి వేణుగోపాల్
9441054637

ఆయుధం



నిద్ర రాని మనువడు
తాతతో అన్నడు
కథ చెప్పు అని

తాత చెప్పిందూ ...
ఒకానొక శుభ ముహూర్తాన
ఉపవాసం ఉన్న పులి జనంలోకి వచ్చింది
మాంసాహారమా? అంటే ఏమిటి?
నల్లనివన్నీ నీళ్ళు
ఎర్రనివన్నీ పండ్ల రసాలంటూ
నమ్మబలుకుతున్నది
కోరలు పీకిన పాములా
గడప గడపకు పాకుతున్నది

ఊళ్ళోకి కొన్ని ఇనుప డబ్బాలొచ్చాయి
మబ్బులు పట్టిన సూర్యుడిలా
అప్పుడెప్పుడో
జమ్మిచెట్టు మీద దాచిన విల్లంబుల్లా ఉన్నయి

ఊరు
తడితడిగా ఉన్న
మునుపటి గాయం తాలూకు గుర్తులు
ముట్టుకుని చూసింది
వసరు కారుతున్నది
ఆకలికి నకనకలాడుతూ
పులి
బక్క చిక్కి పోతున్న భయమవుతున్నది
పంజా పదును సరిచూసుకున్నది

పులి
ఒక్క అడుగు వెనుకకు జరిగింది
ఊరు హుషారయ్యింది
మీదికి దునికే
రక్తం రుచి మరిగిన ప్రమాదం పసిగట్టింది

గుండెల్లో దాచుకున్న ఆయుధం
అందుకున్నది
ఒక్కటే దెబ్బ
అంతే...
పులి మళ్ళీ లేవలేదు.

- గజ్జెల రామకృష్ణ, 8977412795

చిత్తు కాయితాలు!



ఆకాశానికి సవాలు విసిరే
హరిత ఆరోహణ క్రమాలు!
వందల వసంతాలు వర్ధిల్లి
అపురూప బంధమై నిలిచిన
అమేయ బృంద గానాలు!!

దుర్మార్గుల దృష్టిపడి
అరక్షణంలో అవి
ఆక్రందనతో నేలవాలు!!
అటవీ వనరుల అక్రమరవాణా
నగరాలపై చేసే అసుర అశ చేవ్రాలు!

గుండెకాయను దొంగిలించి
ఊపిరితిత్తుల ఉసురు తీసి!
రక్త ప్రసరణ వ్యవస్థను రిక్తపరచి
భూమాత నొసటన చేసిన
పచ్చినెత్తుటి పరశు గాయాలు!!

అడవిలో పుట్టి
అడవిలోనే పెరిగి
అనుక్షణం అడవితో
పెనవేసుకున్న పేగుబంధాలు!

తరతరాల నెనరు పాదులు మృగ్యమై
పరంపరాగత ఉపాధులు కోల్పోయి
పొరకలు నరికి! పోడులు కొట్టి
పొట్టపోసుకునే అనాథ అన్నార్తులు!

బస్తరులో బహిష్కృతులై!
భద్రాచలానికి దారులు వెదుకుతూ
తీరం దాటిన తుపానులా
గుడారాలు వేసుకున్న గూడేలు!!

కందకాలు కొట్టించి
సరిహద్దులు చెక్కించి
పంటలను తొక్కించి
నోటికాడి కూడు లాగేసి...!

తవ్వుకున్న తాగునీటి బావులను
తమచేతే పూడ్పించి!
పశువుల మందలను
బలవంతంగా తరలించి
ఆదీ అంతం లేని
విరాట పర్వాలను సృష్టిస్తూ...!

స్వేచ్ఛా గమన గమ్యాల్ని
అప్పనంగా హరించి!
అపరిమిత చట్టాలకు
అధికారాలకు కట్టుబడే
అసమాన సమాజ చట్రంలో!
ఇరికించబడ్డ చెత్త కాయితాలు
గుత్తి కోయల జీవితాలు!!

- కరిపె రాజ్ కుమార్,
8125144729

ఎకో ఎలిజీ



వెలుగుల పలకపై
ఎవరెవరో
చీకటిని చల్లుతుంటారు

పలకను వెతుకుతూ
వెన్నెల
కాటుకలిసిపోతుంది

కాటుకలిసిన వెన్నెలను గుర్తించక
కాలుతున్న అరణ్యాలు
ఎప్పటిలా
పరుగులు పెడుతుంటాయి

గమ్యాలు తెలియకున్నాయి
అరణ్యాలు కాలుతున్నాయి
వెన్నెల కాటుకలిసిపోతోంది
దిక్కు తోచక
వెలుగు పలక
తనపైకి
చీకటిని లాక్కుంటోంది దుప్పటిలా

- ఫణిమాధవి కన్నోజు,
7659834544

గొప్ప పుస్తకాలలో గొప్ప వ్యక్తులు మనతో మాట్లాడతారు. అత్యంత విలువైన వారి ఆలోచనలను మనకు అందిస్తారు.

అస్తిత్వ జలాల్లో కదిలే ఒంటరి నావికుడు


కవిత్వం ఊపిరి పీల్చడానికి పాఠకుని అనుభవ అస్తిత్వమే ముఖ్యం. పాఠకుని కంటనేత్ర లాలిత్య స్పర్శవల్లనే కవి తనను తాను కాపాడుకుంటాడు. తెలుగు సాహిత్య ముంగిలి ఇప్పుడు దీనావస్థలో ఉందనిపిస్తుంది. కాల సంవాదంలో కవి తన Bargaining power ని కోల్పోయాడు. దానికి కారణం power politics, వాటి ఎజెండాలు, సిద్ధాంతాలు ఉద్యమాలు ... వాటి వల్ల కవి తన Yellow card powerని ఆటలో కోల్పోయాడు. ఇప్పుడు అదే విషాదం, చింతన, బాధ. అదే ఓటమి. ఇప్పుడైతే పాట ఉంది కానీ పాటకాడు లేడు. కవులున్నారు కానీ కవిత్వం లేదు. కారణం... కవిత్వానికెపుడూ Short route ఉండదని కుప్పలు తెప్పలుగా వస్తున్న కవిత్వ సంకలనాలే చెబుతున్నాయి. ఈ పరిస్థితికి భిన్నంగా, ఎడంగా ఉంటూ తన కవిత్వ రసాస్వాదనలో మునిగి తేలుతూ పాటకుడవుతూ పాఠకసాధనలో అక్షరంగా కాలిపోతూ... 'లుప్తమై పోవాలి లిప్తకాలం కవిత్వం చదివిన తర్వాత' అంటూ మూడు దశాబ్దాలుగా... తన చుట్టూ పెనవేసుకుపోతున్న విఫలశూన్యాన్ని, తనకంటూ మిగిలిన మెటఫర్లతో ఎదుర్కొంటూ కాగిపోతూనే నడుస్తున్నాడు బాణాల శ్రీనివాసరావు. నేను ప్రేమగా పిలుచుకునే శీను.

సూదిమొనలమీద జీవానుభవాన్ని పదపాదాలతో కదుపుతూ, దు:ఖాన్ని చిదుముతూ... ఇదంతా నిశిరాత్రుల సుక్కపొడుపు నక్షత్రాల మానవేతిహాస రోదన. కవిత్వంలోని ఈ వేదన వినిపించదు. కనిపిస్తుంది. కవి, నిశ్శబ్దాన్ని కవిత్వ శంఖంలో పూరించే తెగువను కొనసాగిస్తూ సమూహంలో కదిలే ఒంటరి నావలా... కురిసే ఒంటరి వానలా ఏకాంతాన్ని జల్లెడ పడుతూ - కదులుతూనే ఉన్నాడు అస్తిత్వజలాల్లో.

బాణాల కవిత్వం తనతో తానే ఒంటరి సమూహమై ఆత్మగల నివేదనై చెప్పుకునే సంభాషణ. దీన్ని ఏ రొదసొదల వ్యామోహం లేకుండా.. అనుభవించే సాధన కలిగి ఉండాలి. అది గనుక మనల్ని నిశబ్దపరిచి.. వేకువ పరిస్తే తన దారిలోని నల్లతెల్లని భవిష్యత్తు అనుభవంలోకి వస్తుంది. "అంపశయ్య మీద ఎలా ఉంటుంది హాయి" అంటూ ఇదంతా అనివార్యంగా సూదిమొనల మీది ప్రయాణం అని వెల్లడిస్తాడు. భీతితో తలపడే పదసమూహాల్ని స్పష్టపరుస్తుంటాడు. బాణాల కవిత్వం స్పష్టంగా గోచరమవుతూనే అనుకోకుండా అస్పష్ట రూపచిత్రమై ఆకట్టుకుంటుంది. కవిత్వంలో సౌందర్యం ఉండాలి, ఆంతరంగిక వేదన ఉండాలి, అస్పష్టపు దిగులు జీర ఉండాలి. అప్పుడు కవి ఎప్పటికి కొత్తగా ప్రత్యేకంగా మెరుస్తుంటాడు బాణాల కవిత్వంలాగ. ఎందుకంటే అతని కవిత్వ దు:ఖమంతా మానవ కరచాలనం. పాముతో సావాసం కంటే భీతిగా పరిణమించిదెందుకనే యాతనతోనే మొదలవుతుంది. ఎప్పటికీ మానని గాయాలకు అస్తిత్వ గాథాలక్షణం ఉందని, అది చర్విత చరణంగా ఎదురుపడుతూనే చరిత్రగా ముడిపడుతుందనే ఎరుకను కలిగించే కవిత్వమిది. ఎందుకంటే మనలోపలి సున్నితత్వాన్ని కాపాడటమే కవిత్వమని నమ్ముతూ పాఠకుడిని సాంత్వన పరుస్తున్నాడు.

తను సత్యస్ఫూరకంగా నమ్మిన కవిత్వానుభవంతో. కవిత్వాన్ని చాలా నిసర్గంగా, నగ్నంగా, ఏ బరువు తెరువులు లేకుండా సమీపించాలి. అప్పుడే కవిత్వం కేంద్రంలోని సాధారణ గుణం అవగాహనకు వస్తుంది.

ఎప్పటికయినా పాఠకుడే కవికి దారి చూపుతాడు. ఈ మలుపులోని దిగువ ఎగువ దారిలో.. నిజాయితీగా కవిత్వ అన్వేషణలో మునిగి ఉన్నాడు ఈ కవి. తన కవిత్వంలో ఒకసారి "రాత్రిసింఫనీ" అనే కవిత దగ్గర నిలబడి వినండి రాత్రిసింఫనీ మంద్ర వాయువుని. "యుగాలనుంచి ఆకాశాసముద్రంలో/ ఒంటరినావికుడే సందమామ/ బహుశా అక్కడో పచ్చిబాలింత/ అలిసిపోయి పడుకుంది" అంటాడు. దట్టమైన చీకటిని అకస్మాత్తుగా మేల్కొల్పుతూ, ఈ వాక్యాలు దిక్కుల తలుపులు తెరిచి తమలోపలికి గువ్వగూటిని పిలిచినట్టుగా లోపలికి తీసుకుపోకుండా ఉంటాయా? ఒక అనుభవం క్షణంలో చిప్పిల్లకుండా ఉంటుందా? సీతాకోకచిలుకకి మేఘానికి నడుమ ఒక కథనాన్ని నీలిదారంగా ముడిపేనుతూ కవిత్వంగా ఒలికి పోతాడు. చిన్నగా మెదిలిన కవితలో మొదలు తుదిలేని వివశత్వం కనపడుతుంది. బాణాల చిన్న కవితలలో అలాగే మొదలూ తుదిలేని జీవధార ఒలికిపోతుంది. అందుకు కారణం కవిగా తను ఎక్కడా తెంపుకుంటూ పోడు. బతుకును పగులగొడుతూ పోడు. ద్రవమై అతుక్కుని ఖాళీల్లో ఇరుక్కుని సేదతీరుతూ ఉంటాడు. "గగనం పగిలిన శబ్దం/ ఎక్కడో దూరంగా అయినా ఎదురుచూపుల్లో కురవని మేఘం" అని మెల్లగా స్వరమూదుతూ బాణాల కవిత్వమిప్పుడు తన గత సంకలనాలైన "పర్యాయపదం", "ఆచూకీ" "కుంపటి" వంటి కవిత్వవిహాయసాల నుంచి ఎడంగా జరిగి Jonathan Livingston Seagull లోని సముద్రపక్షిలా భిన్నమైన Latitude లోకి ఎగుర్తూ కనపడుతూ ఉంటాడు.



ఎప్పటికయినా వేదనలోంచే జలతినిచ్చి విముక్తినిస్తుంది కవిత్వం. తనను తాను సమర్థించుకోవడం. లోకం కోసం లోకచింతనలో కాలి దగ్ధమయి పోవడం కోసం. కవి ఇంకేమి చేయలేడు. తనను తాను శుభ్రపడుతూ జీవించడంలో వేగిరపడుతుంటాడు. తనకు తానే వేసుకున్న సంకెళ్లను విప్పుకుంటూ అస్థిత్వంలోని మరుగుల్ని మెరుగుల్ని తొలగించుకునే ప్రయత్నం చేస్తుంటాడు. కొత్తగా మెరవటం కోసం యాతనపడుతుంటాడు. బాణాల కవిత్వంలో ఈ యాతన కనపడుతుంటుంది. తన అస్తిత్వ చేతనలోనే ముడికట్టి పెట్టుకున్న pure anatomy విప్పుకుంటూ, పాఠకుడి ముందర ప్రదర్శనను ఎత్తుకుంటాడు. 'ఏకత్వంలో భిన్నత్వం', 'రహదారుల్లోకి', 'పరిగేటోరియో స్వాగతం', 'వెన్నెలశిల్పం', 'పురాజ్ఞాపకం', 'బహుజనం', 'అదోలా, వెయిపున్నముల వెలుగు', వంటి కవితలు మనల్ని నిలబెట్టి చదివింపచేస్తాయి. సమాంతర, ఇతర అర్థాలను సవ్వడి చేసే ప్రయత్నం చేస్తుంటాయి. స్వీయాన్వయం కోసం పాఠకుడ్ని.

Even the most deliberate fables, if read naively or carelessly, may seem mere stories, but what counts in our discussion is structure that lends itself to a secondary reading, or rather, one that become stronger when given a secondary meaning as well as primary meaning. అని అంటాడు.

- సిద్ధార్థ



రైతు రుణమాఫీ, పంటల ధరలకు ప్రాధాన్యత

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో



భోపాల్: రైతుల రుణమాఫీ, పంటల ధరలకు ప్రాధాన్యత ఇస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆదివారం నాడిక్కడ ఆ పార్టీ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. రెండు రాష్ట్రాల్లో క్వింటాల్ బియ్యం రూ.3,200, గోధుమలకు రూ.3,000 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

రమేష్ మాట్లాడుతూ, "కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకటిస్తే సరిపోదు. ఎందుకంటే ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువ ధరకే రైతుల నుంచి పంటలు కొనుగోలు చేయడం జరుగుతున్నది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎంఎస్పీ కచ్చితంగా అమలు చేస్తామని చెప్పింది. ఢిల్లీలో ఏడాది పాటు సాగిన రైతుల ఉద్యమంలో డిమాండ్‌లో ఒకటి కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని. నరేంద్ర మోడీ ప్రభుత్వం కూడా హామీ ఇచ్చింది. కానీ ఇంతవరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదని ఆయన విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో రూ.2 లక్షల వరకు ఉన్న వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని ఈ మ్యానిఫెస్టో హామీ ఇచ్చింది. ఐదేండ కిందటి ఎన్నికల్లో గెలిచి కమల్‌నాథ్ నేతృత్వంలో కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించగానే ఆ ప్రభుత్వాన్ని ఫిరాయింపు రాజకీయాలతో బిజెపి కూల్చేసిందని జైరాం రమేష్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలకు హామీ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్‌ను)తిరిగి తీసుకువస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అలాగే ఛత్తీస్‌గఢ్‌లోని గిరిజన ప్రాంతాల్లో టెండు ఆకులను సేకరించేందుకు ఒక్కో బ్యాగ్‌కు 6 వేల రూపాయలు ఇస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టో పేర్కొంది. . ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై కూడా శ్రద్ధ చూపుతుందని అన్నారు. 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని కూడా కాంగ్రెస్ ప్రకటించింది. ఐదు రాష్ట్రాల్లో నవంబర్‌లో వేర్వేరు రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఛత్తీస్‌గఢ్ రెండు దశల్లో నవంబర్ 7 , 17 తేదీల్లో జరగనుంది. మధ్యప్రదేశ్‌లో ఒకే దశలో నవంబర్ 17న పోలింగ్ జరగనుంది.

మిజోరంలో హచెక్ సీటు ఎవరికి దక్కేన్..!

- ఓటర్ల చేతుల్లోనే అభ్యర్థుల భవితవ్యం

హచెక్. ఈశాన్య ప్రాంతంలో ఉన్న మిజోరంలో నవంబర్ 7న ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 40 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో 174 మంది అభ్యర్థులు తమ అదష్టాన్ని పరీక్షించుకోనున్నారు. త్రిపుర సరిహద్దులో పశ్చిమ మిజోరంలోని మమిత్ జిల్లాలో ఉన్న హచెక్, రాష్ట్రంలోని హాట్ సీట్లలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఈ సీటు ఎవరికి దక్కుతుందో నిర్ణయించడంలో బ్రూ , ఇతర మైనారిటీ ఓటర్లు ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. ఒక దశాబ్దం క్రితం జాతి అల్లర్ల తర్వాత 35 వేల మందికి పైగా బ్రూ ప్రజలు త్రిపురకు వలస వచ్చినప్పటికీ, దాదాపు ఐదువేల మంది గిరిజనులు అలాగే ఇతర చిన్న మైనారిటీ తెగలు హచెక్ సీటులో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే శక్తిని కలిగి ఉన్నారు. దీంతో ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొంది.

మహిళల ప్రాతినిధ్యం తక్కువే!

- ఒక్క మహిళా ఎమ్మెల్యే కూడా లేని రాష్ట్రం ఇదే
- ప్రతిబంధకంగా ఉన్న వ్యక్తిగత జీవితాలు ప్రోత్సాహమూ లేదు
- మిజోరం ఎన్నికల చిత్రం



ఐజ్వాల్ : మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో గత నెలలో జరిగిన నిరసన ప్రదర్శనకు వేలాది మంది హాజరయ్యారు. లంగ్‌లై సౌత్ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి అర్హతపై ప్రశ్నించేందుకు వారంతా అక్కడికి చేరుకున్నారు. చట్ట ప్రకారం కాంగ్రెస్ అభ్యర్థి మెరియమ్ హంగ్‌చల్‌కు పోటీ చేసే అర్హత ఉంది. కానీ కొందరు ఓటర్ల దృష్టిలో మాత్రం ఆమె పోటీకి అనర్హురాలు. గోర్ఖా తరగతికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకోవడంతో ఆమె గిరిజన హోదాను కోల్పోయారని, అలాంట పుడు ఎస్టీలకు రిజర్వ్ చేసిన స్థానంలో ఆమె ఎలా పోటీ చేస్తారని మిజో జిర్లాయ్ పాల్ (ఎంజడ్‌పీ) అనే విద్యార్థి సంఘం ప్రశ్నిస్తోంది. అలాంటి అభ్యర్థులను పోటీకి దింపవద్దని ఆ సంఘం రాజకీయ పార్టీలను కోరింది. ఎంజడ్‌పీ మూడు లేఖలు రాసినప్పటికీ కాంగ్రెస్ మాత్రం మెరియమ్‌నే పోటీకి దింపింది. దీంతో మెరియమ్‌ని, ఆమె పార్టీని బహిష్కరించాలని ఎంజడ్‌పీ పిలుపునిచ్చింది. రాష్ట్రంలో మిజో జనాభా తక్కువగా ఉన్నదని, తమ సమాజాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉన్నదని ఎంజడ్‌పీ ప్రధాన కార్యదర్శి తోమ్టే చెప్పారు.

మిజోరంలో ఎంజడ్‌పీ వంటి పౌర సమాజ గ్రూపుల ప్రాబల్యం ఎక్కువగానే ఉంది. బీజేపీ ఇప్పటికే తుల్వాల్ స్థానంలో తన అభ్యర్థిని మార్చేసింది. కాంగ్రెస్ మాత్రం లంగ్‌లై సౌత్‌లో మెరియమ్‌నే కొనసాగిస్తుండడంతో వివాదం చెలరేగుతోంది. మిజోరంలో మహిళలు రాజకీయాల్లో ఎక్కువగా ప్రవేశించకపోవడానికి వారి వ్యక్తిగత జీవితాలను ఓ కారణంగా చెప్పవచ్చు. అయితే ఇతర రంగాల్లో మాత్రం వారి భాగస్వామ్యం అధికంగానే ఉంటోంది.

ప్రాతినిధ్యం తక్కువే

1987లో మిజోరంకు రాష్ట్ర హోదా లభించింది. అప్పటి నుంచి కేవలం నలుగురు మహిళా ఎమ్మెల్యేలు మాత్రమే శాసనసభలో ప్రవేశించారు. మిజోరం అసెంబ్లీలో సభ్యుల సంఖ్య 40. ప్రస్తుతం దేశంలో ఒక్క మహిళా ఎమ్మెల్యే కూడా లేని రాష్ట్రం ఇదే. అక్షరాస్యతలో దేశంలోనే మిజోరం మూడో స్థానంలో ఉంది. ప్రతి వెయ్యి మంది పురుషులకు 976 మంది మహిళలు ఉన్నారు. మొత్తం ఓటర్లలో సగానికి పైగా అంటే 4,38,925 మంది మహిళా ఓటర్లే. అయినప్పటికీ చట్టసభలో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువ. మిజోరం శాసనసభ ఎన్నికల్లో 174 మంది పోటీ చేస్తుండగా వారిలో 16 మంది మహిళలు. బీజేపీ నుంచి ముగ్గురు, ఎంఎన్‌ఎఫ్, కాంగ్రెస్, జడ్‌పీఎం నుంచి ఇద్దరు చొప్పున పోటీలో ఉన్నారు. మిగిలిన వారు స్వతంత్రులు. 2018 ఎన్నికల్లో 18 మంది మహిళలు పోటీ చేసినప్పటికీ ఒక్కరూ గెలవలేదు. 2013లో ఎనిమిది మంది పోటీ చేశారు.

అందరికీ భిన్నంగా...

అయితే మహిళలందరి పరిస్థితి ఒకేలా లేదు. జేపీఎం తరపున పోటీ చేస్తున్న మాజీ టీవీ ప్రజెంటర్, రేడియో జాకీ వన్నెసాంగీకి మంచి ఆదరణ లభిస్తోంది. ప్రచారం సందర్భంగా కొందరు ఆమెతో సెల్ఫీలు దిగుతున్నారు. మరికొందరు ప్రేమతో ఆలింగనం చేసుకుంటున్నారు. అవివాహిత మహిళగా ఎన్నికల్లో పోటీ చేయడం సవాలుతో కూడుకున్నదేనని ఆమె చెప్పారు. ఇది 21వ శతాబ్దమని, కొత్త చరిత్ర సృష్టించడానికి సమయం ఆసన్నమైందని ఆమె తెలిపారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా మహిళలు మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, ఉపాధి వంటి అంశాలను ప్రస్తావిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ వ్యతిరేకత కన్పిస్తోంది.


త్రిముఖ పోటీ

ముఖ్యమంత్రి జోరాంతంగా నేతృత్వంలోని ఎంఎన్‌ఎఫ్ పార్టీ ప్రతిపక్షాల నుండి గట్టి పోటీని ఎదుర్కొంటోంది. 2013 ఎన్నికల్లో 34 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఐదు స్థానాలకు పరిమితమైంది. మరోవైపు గత ఎన్నికల్లో 8 సీట్లు గెలుచుకున్న జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జేపీఎం) 22% ఓట్లు సంపాదించి సవాలు విసురుతోంది. స్థానిక ఎన్నికల్లో కూడా ఈ పార్టీకి మంచి ఫలితాలు వచ్చాయి. ఇప్పటి వరకూ మిజోరంను ఎంఎన్‌ఎఫ్, కాంగ్రెస్ పార్టీలే పరిపాలించగా ఇప్పుడు జేపీఎం కూడా రంగంలో ఉండడంతో త్రిముఖ పోటీ నెలకొంది.

ప్రోత్సాహం లేదు

బీజేపీ టిక్కెట్ నిరాకరించిన జోహ్‌మింగ్‌లియానీ తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. పార్టీలోనూ, రాజకీయాల్లోనూ తన భవితవ్యంపై ఆమె ఎటూ చెప్పలేకపోతున్నారు. మహిళల కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల్లో పలు హామీలు ఇచ్చాయి. ఎన్నికల్లో మహిళల భాగస్వామ్యం అతి తక్కువగా ఉండడంపై స్వతంత్ర అభ్యర్థి ఫ్లోండో మాట్లాడుతూ 'రాజకీయాల్లోకి రాకుండా మహిళల్ని ఎప్పుడూ నిరుత్సాహపరుస్తానే ఉంటారు. చర్చిల్లో సైతం మహిళా పెద్దలు కానీ, పాస్టర్లు కానీ లేరు' అని వాపోయారు. మహిళలు పని చేయాలని సమాజం కోరుకుంటోంది కానీ వారు నిర్ణయాలు తీసుకునే స్థాయిలో ఉండడం దానికి ఇష్టం లేదని పీహెచ్‌డీ విద్యార్థిని నామ్టే తెలిపారు.

మిజోరం, ఛత్తీస్‌గఢ్ తొలి విడతకు ముగిసిన ప్రచారం



న్యూఢిల్లీ : మిజోరం, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు తొలి విడతకు ప్రచారం ముగిసింది. మిజోరంలోనిమొత్తం 40 అసెంబ్లీ స్థానాలతోపాటు ఛత్తీస్‌గఢ్‌లోని 20స్థానాలకు మొదట విడతలో నవంబర్ 7న పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి ప్రధాన పార్టీలు జోరుగా ప్రచారం నిర్వహించగా.. మంగళవారం పోలింగ్ జరగనున్న ప్రాంతాల్లో ప్రచారానికి తెరపడింది. నవంబర్ 7న రెండు రాష్ట్రాల్లో కలిపి మొత్తంగా 60 శాసనసభ స్థానాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

త్రిముఖ పోరు..

మిజోరంలో 40 అసెంబ్లీ స్థానాలుండగా.. 8.57లక్షల మంది ఓటర్లున్నారు. మొత్తం 174 మంది బరిలో నిలబడ్డారు. అధికార మిజో నేషనల్ ఫ్రంట్, జోరం పీపుల్స్ మూమెంట్, కాంగ్రెస్‌లు పూర్తిస్థాయిలో అభ్యర్థులను రంగంలో దించాయి. గత ఎన్నికల్లో అధికారానికి దూరమైన కాంగ్రెస్..ఈసారి ఎలాగైనా గెలవాలనుకుంటోంది. రాహుల్ గాంధీ వంటి నేతలతో అక్కడ ప్రచారం నిర్వహించింది. మిజోరంలో ప్రధాని పర్యటించాల్సి ఉన్నప్పటికీ ఆకస్మికంగా అది రద్దయ్యింది.

కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ..

ఛత్తీస్‌గఢ్‌లో తొలివిడతలో 20 స్థానాల్లో పోలింగ్ జరగనుంది. ఇందుకోసం ప్రధాన పార్టీలు ముమ్మరంగా ప్రచారం చేశాయి. ఇక ప్రధాని మోడీ ఛత్తీస్‌గఢ్‌లోని డోంగార్‌గఢ్‌లో ఉన్న బమ్లేశ్వరీ అమ్మవారి దేవాలయంతోపాటు చంద్రగిరిలో జైన్ మందిర్‌ను దర్శించుకున్నారు. అక్కడ ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్ ఆశీస్సులు తీసుకున్నట్టు ప్రధాని మోడీ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలుండగా.. తొలివిడత 20 స్థానాలకు నవంబర్ 7న పోలింగ్ జరగనుంది. మిగతా 70 స్థానాలకు నవంబర్ 17న మరోవిడతలో నిర్వహించనున్నారు.

ప్రస్తుతం జరుగుతోన్న 20 స్థానాల్లో ఎక్కువగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోనే ఉన్నాయి. దీంతో ఇక్కడ కేంద్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది.

మధ్యప్రదేశ్‌లో 39 మంది కాంగ్రెస్ నేతలపై వేటు

- పార్టీ అభ్యర్థులపై రెబల్ గా పోటీ చేసినందుకు చర్యలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మధ్యప్రదేశ్‌లోని 39 మంది కాంగ్రెస్ నేతలపై ఆ పార్టీ వేటు వేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పోటీ చేసినందుకు ఈ 39 మంది నాయకులను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి ఆరేండ్లపాటు బహిష్కరించారు. పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ ఆదేశాల మేరకు వీరిని కాంగ్రెస్ నుంచి బహిష్కరించినట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్ సింగ్ ప్రకటనలో తెలిపారు

కేసీఆర్‌ను ఢీకొట్టే సత్తా ఎవరికీ లేదు

మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- ఆమనగల్, షాద్‌నగర్‌లో ప్రజా ఆశీర్వాద సభలు



నవతెలంగాణ-ఆమనగల్

తెలంగాణ ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం కేసీఆర్‌ను ఢీకొట్టే సత్తా ఎవరికీ లేదని మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభల్లో మంత్రి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తున్నట్టు తెలిపారు. కేసీఆర్‌ను ఓడించేందుకు ఢిల్లీ నుంచి గుంపులు గుంపులుగా వివిధ పార్టీలకు చెందిన మహా మహా నాయకులు నరేంద్ర మోడీ, అమిత్ షా, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లాంటి వారు ఎంత మంది వచ్చినా ఒరిగేది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ మాత్రం సింహం లాగా సింగిల్ గానే వారిని ఎదుర్కొంటారని అన్నారు. ఢిల్లీ గులాములు కావాలో.. తెలంగాణ బిడ్డలు కావాలో రేపు జరగబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కోరిక మేరకు ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే ఆమనగల్‌లో అవసరమైన కార్యాలయాలు, వెల్జాల్, గట్టు ఇప్పలపల్లి, రఘుపతి పేట తదితర గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన జైపాల్ యాదవ్‌ను మరోసారి గెలిపించాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుమురంభీం వర్ధంతి వేడుకలో విషాదం

- ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు

నవతెలంగాణ-కడెం

నిర్మల్ జిల్లా కడెం మండలంలోని చిన్న బెల్లాల్‌లో ఆదివారం నిర్వహించిన కుమురంభీం వర్ధంతి వేడుకలో విషాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఏర్పాటు చేసిన కుమురంభీం వర్ధంతి కార్యక్రమంలో భాగంగా జెండాను ఏర్పాటు చేశారు. జెండా ఎత్తే క్రమంలో పైన ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లకు జెండా ఇనుప పైపు తగలడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా క్షతగాత్రులను వెంటనే ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో పెంద్రం మోహన్(26) మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆత్రం భీంరావు(25) మృతి చెందారు. వెంకుపటేల్ చికిత్స పొందుతున్నాడు. దాంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ స్థానిక ఆస్పత్రికి వెళ్లి వారి మృతదేహాలను పరిశీలించారు. పేదరికంలో ఉన్న ఆ కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. వారి మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో బాధితుడు వెంకుపటేల్‌ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటానని తెలిపారు.

తమ్మినేనికి కృతజ్ఞతలు : డీజేహెచ్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశాన్ని సీపీఐ(ఎం) తన ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చినందుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు డీజేహెచ్ఎస్ అధ్యక్షులు బొల్లోజు రవి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీజేహెచ్ఎస్ విన్నపం మేరకు సీపీఐ(ఎం) తన ఎన్నికల మ్యానిఫెస్టోలో జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశాన్ని పొందుపరిచిందని తెలిపారు.

ఎన్నికల్లో గుణపాఠం ద్వారానే.. పాలకుల విధానాలను తిప్పికొట్టగలం

నవ తెలంగాణ సంపాదకులు ఆర్.సుధాభాస్కర్

- ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కార్మిక సంక్షేమంలో రాజీలేని కృషి : శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



నవతెలంగాణ - పటాన్‌చెరు

ఎన్నికల్లో గుణపాఠం ద్వారానే పాలకుల విధానాలను తిప్పికొట్టగలమని నవతెలంగాణ సంపాదకులు ఆర్.సుధాభాస్కర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమలో ఇటీవల జరిగిన యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో హెచ్ఎంఎస్ యూనియన్‌పై శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అఖండ మెజార్టీతో విజయం సాధించింది. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో విజయోత్సవ సభ నిర్వహించారు. శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన జరిగిన సమావేశానికి శాండ్విక్ యూనియన్ మాజీ అధ్యక్షులు, నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్ హాజరై మాట్లాడారు. 39 సంవత్సరాల తర్వాత కూడా అత్యధిక మెజారిటీతో సీఐటీయూను గెలిపించిన శాండ్విక్ కార్మికులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పడం ద్వారా మాత్రమే పాలకుల నిరంకుశ విధానాలను తిప్పికొట్టగలమని చరిత్రలో అనేక ఉదాహరణలు ఉన్నాయన్నారు. రానున్న అసెంబ్లీ, ఆ తర్వాతి పార్లమెంటు ఎన్నికల్లో పాలకులకు దిమ్మతిరిగే తీర్పు ఇవ్వాలని కార్మికవర్గానికి, ప్రజానీకానికి పిలుపునిచ్చారు. అనంతరం చుక్క రాములు మాట్లాడుతూ.. ప్రారంభం నుంచీ పరిశ్రమ లో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కార్మిక సంక్షేమంలో రాజీలేని కృషి చేస్తున్నామని తెలిపారు. కంపెనీలో నూతన కార్మికులు రావాలనే లక్ష్యంతో ఎత్తుగడలను రూపొందించు కొని ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి యూనియన్ కృషి చేస్తోందన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశం కల్పించంలో యూనియన్ విజయం సాధించిందన్నారు. 40 ఏండ్ల నుంచి కార్మికులను ఐక్యంగా ఏకతాటిపై నిలబెడుతూ సీఐటీయూ నాయకత్వం లో కార్మిక సంక్షేమమంటే శాండ్విక్ యూనియన్‌ను చూసే విధంగా ఆదర్శంగా యూనియన్‌ను నిలిపామన్నారు. ఇంతటి చరిత్ర గల మన యూనియన్‌ను విచ్ఛిన్నం చేయా లనే కుట్రతో కొందరు స్వార్థపరులు పోటీ యూనియన్ పెట్టారని మండిపడ్డారు. శాండ్విక్‌లో సీఐటీయూకు తప్ప వేరే వారికి చోటులేదనే విషయం గతనెల 19వ తేదీన జరిగిన యూనియన్ ఎన్నికల్లో 106 ఓట్ల అఖండ మెజారిటీతో గెలిపించడం ద్వారా కార్మికులు నిరూపించారన్నారు. ఈ సందర్భంగా కార్మిక సోదరులం దరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

ఓభవిష్యత్తు లో విచ్ఛిన్న కరవాదుల దుష్ప్రచారాన్ని ఎదుర్కొని కార్మికుల ఐక్యతను కాపాడుకోవడం ద్వారా మరిన్ని విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షు లు జె.మల్లికార్జున్, సీఐటీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బీరమ్ మల్లేశ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు రాజయ్య, జిల్లా నాయ కులు, శాండ్విక్ యూనియన్ నాయకులు, వివిధ పరిశ్రమల యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కవితను అరెస్టు చేయకుంటే కుమ్మక్కు అయినట్టా?

- దళిత సీఎం నుంచి దళిత బంధు దాకా మోసమే : మీట్ ది ప్రెస్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మద్యం కేసు దర్యాప్తు నడుస్తున్నదనీ, కవితను అరెస్టు చేయకుంటే బీఆర్ఎస్‌తో బీజేపీ కుమ్మక్కు అయినట్టేనా? అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. దళిత సీఎం నుంచి దళిత బంధు దాకా అడుగడుగునా సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల్ని మోసం చేశారని విమర్శించారు. సీఎం కేసీఆర్ సచివాలయానికి రాడనీ, ఎమ్మెల్యేలు బస్తీల్లోని ప్రజల ఇబ్బందులను పట్టించుకోరని ఆరోపించారు. పదేండ్లుగా ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. గొప్పలు చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని విమర్శించారు. దేశంలోని పార్టీలకు ఎన్నికల ఫండింగ్ చేస్తానని ఆ వ్యవస్థనే కేసీఆర్ ఛిద్రం చేశారని ఆరోపించారు. కేసీఆర్ ఢిల్లీలో చక్రం తిప్పాలనీ, రాష్ట్రంలో కొడుకిని సీఎం చేయాలని కలలు కంటున్నారని అన్నారు. కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డిలో ఓడిపోతారని చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేయాలని చూస్తోందని విమర్శించారు. తెలంగాణతో పాటు ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం కర్నాటక ప్రభుత్వం అక్కడి ప్రజల నుంచి స్పెషల్ ట్యాక్స్ వసూలు చేస్తున్నదని ఆరోపించారు. తాము 88 మంది అభ్యర్థుల్ని ప్రకటించామనీ, ఒకటెండ్రు రోజుల్లో మిగిలిన స్థానాలకు కూడా ఎంపిక చేస్తామని చెప్పారు. బీసీ సీఎం నినాదంతో ఎన్నికలకు వెళ్తామన్నారు. కేసీఆర్ కాంగ్రెస్ ప్రొడక్ట్ అన్నారు. బీఆర్ఎస్ కొనేపార్టీ, కాంగ్రెస్ అమ్ముడుపోయే పార్టీ అని విమర్శించారు. ఎంఐఎంతో గతంలో కాంగ్రెస్, ఇప్పుడు బీజేపీ దోస్తానా చేస్తున్నాయన్నారు. బీసీ నినాదంతో ముందుకెళ్తున్నాం కాబట్టి పార్టీ తనను పోటీచేయొద్దని అధిష్టానం ఆదేశించిందన్నారు. తెలంగాణకు కేంద్రం నిధులివ్వడం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సరిగాదన్నారు. దీనిపై ప్రెస్‌క్లబ్‌లోనైనా..అమరవీరుల స్థూపం వద్దనైనా చర్చకు సిద్ధమేనా అని సీఎంకు సవాల్ విసిరారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జనసేన తమకు మద్దతిచ్చిందనీ, అందులో భాగంగానే ఇప్పుడు కూడా పొత్తుతో ముందుకెళ్తున్నామని చెప్పారు. జర్నలిస్టులు, పోలీసులు, రాజకీయనాయకులు 365 రోజులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ల విత్‌డ్రా తర్వాత తమ పార్టీ మ్యానిఫెస్టో విడుదల చేస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రచారరథం అడ్డగింత

- డొంకేశ్వర్ మండలం అన్నారంలో..
- ఎలాంటి అభివృద్ధి చేయలేదని గ్రామస్తుల ఆవేదన



నవతెలంగాణ-డొంకేశ్వర్

నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలంలోని అన్నారం గ్రామస్తులు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రచార రథాన్ని ఆదివారం అడ్డుకున్నారు. తమ గ్రామాన్ని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దత్తత తీసుకుంటానని హామీనిచ్చి ఏ ఒక్క అభివృద్ధి పనులు చేపట్టలేదని, ఐదేండ్లలో ఎమ్మెల్యే ఒక్కసారి కూడా తమ గ్రామానికి రాలేదని వాపోయారు. తమ సమస్యలను ఒక్కసారి కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ఎన్నికల ప్రచారానికి వస్తున్న నేపథ్యంలో అడ్డుకున్నట్టు తెలిపారు.

కారు.. సార్.. ఇక పరార్‌రు

- ఎన్ని కుట్రలు చేసినా గెలిచేది కాంగ్రెస్సే : కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత, ఎమ్మెల్యే సీతక్క



నవతెలంగాణ - ములుగు

కారు.. సార్.. ఇక పరారేనని, 10 ఏండ్లలో మనల్ని దోచుకున్న కోట్ల రూపాయలతో ఓట్లు కొనడానికి వస్తున్నారని, ఎన్ని కుట్రలు చేసినా గెలిచేది కాంగ్రెస్ పార్టీనేనని కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామం మంచినీళ్ళపల్లి, హుమ్మయినగర్‌కు చెందిన సుమారు 300మంది యువకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే సీతక్క పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో రూ.1000 కోట్లు పెట్టిన బీఆర్ఎస్‌ను ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారనీ, రేపు ములుగులోనూ అదే రిపీట్ అవుతుందన్నారు. తాను ప్రజలను నమ్ముకున్నానని, వాళ్ళు డబ్బులను నమ్ముకున్నారనీ, తాను గెలిస్తే ప్రజలు గెలిచినట్టు, వాళ్ళు గెలిస్తే డబ్బులు గెలిచినట్లనని అన్నారు. మనం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఎంత అగం అయిందో ఒక్కసారి ఆలోచన చెయ్యాలని, దొరల పాలన కావాలా ప్రజల వద్దకే పాలన అందించే కాంగ్రెస్ కావాలా మీరే తేల్చుకోండని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి రావడానికి ఒక్క అవకాశం ఇవ్వండనీ, అగమైన తెలంగాణను బాగు చేసుకుందామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు విచ్చలవిడిగా డబ్బులు, మద్యంతో ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాల్లో.. మహాలక్ష్మి పథకం, కుటుంబంలో మహిళకు నెలకు రూ.2500 నగదు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే, ఎకరాకు రూ.15వేల పెట్టుబడి ఆర్థిక సహాయం, వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్, వ్యవసాయ కూలీలకు రూ.15 వేల ఆర్థిక సహాయం చేయనున్నట్టు చెప్పారు. గృహజ్యోతి పథకం, గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇంటి పథకం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, యువ వికాస పథకం, విద్యార్థులకు రూ.5 లక్షలతో విద్య భరోసా కార్డు, చేయూత పెన్షన్, ఆసరా పెన్షన్ రూ.4000 పెంపు. రైతులకు 24 గంటల కరెంటు అందించడం తదితర హామీలతో కాంగ్రెస్ మీ ముందుకు వస్తోంన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మారో తీన్‌మార్



ప్రపంచకప్‌లో నేడు
బంగ్లాదేశ్ x శ్రీలంక
వేదిక : న్యూఢిల్లీ
సమయం : మ॥ 2.00
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

'భారత్‌కు ఆడే ఏ అవకాశమైనా నాకు పెద్దదే. నా పుట్టినరోజు, ఈ అభిమానుల నడుమ ఇటువంటి అవకాశం నిజంగా కలే. ఈ ఘనత సాధించటంలో మద్దతుగా నిలిచిన అభిమానులకు ధన్యవాదాలు. భారత్ విజయాల్లో నా పాత్ర ఏ రూపంలోనైనా పోషిస్తూనే ఉంటాను.'
- విరాట్ కోహ్లి

'విరాట్ బాగా ఆడావు. రానున్న కొన్ని రోజుల్లోనే 49 నుంచి 50 శతకానికి చేరుకుని నా రికార్డును బద్దలు కొడతావని ఆశిస్తున్నాను. 49వ శతకం సాధించిన నీకు అభినందనలు.'
- సచిన్ టెండూల్కర్



ఇండియాకు ఎదురేది!

బ్యాటర్లకు తిరుగులేదు. బౌలర్లకు ఎదురులేదు. ఇదీ ఐసీసీ 2023 ప్రపంచకప్‌లో ఆతిథ్య టీమ్ ఇండియా జైత్రయాత్ర. అగ్ర జట్టు, కఠిన ప్రత్యర్థి దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో కాస్తో కూస్తో ఉత్కంఠ ఆశించిన తటస్థ అభిమానులకు నిరాశే ఎదురైంది. టీమ్ ఇండియా జైత్రయాత్ర ముంగిట దక్షిణాఫ్రికా తేలిపోయింది. ఛేదనలో దక్షిణాఫ్రికా 83 పరుగులకే కుప్పకూలగా.. రవీంద్ర జడేజా (5/33) ఐదు వికెట్ల మాయజాలం ప్రదర్శించాడు. విరాట్ కోహ్లి (101 నాటౌట్), శ్రేయస్ అయ్యర్ (77) మెరుపులతో తొలుత భారత్ 326 పరుగుల భారీ స్కోరు చేసింది. 243 పరుగుల తేడాతో సఫారీని చిత్తు చేసి గ్రూప్ దశలో వరుసగా ఎనిమిదో విజయం సాధించింది.

- దుమ్మురేపిన బ్యాటర్లు, కుప్పకూల్చిన బౌలర్లు
- 243 పరుగుల తేడాతో సఫారీపై ఘన విజయం
- విరాట్ కోహ్లి రికార్డు 49వ సెంచరీ
- రవీంద్ర జడేజా ఐదు వికెట్ల మాయజాలం

భారత్ 326/5,
దక్షిణాఫ్రికా 83/10
ఐసీసీ ప్రపంచకప్

నవతెలంగాణ-కోల్‌కత

ఎనిమిదికి ఎనిమిది. టీమ్ ఇండియాకు ఎదురేది. ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ 243 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. రవీంద్ర జడేజా (5/33) ఐదు వికెట్ల మ్యాజిక్‌కు మహ్మద్ షమి (2/18), కుల్దీప్ యాదవ్ (2/7) విజృంభించటంతో ఛేదనలో దక్షిణాఫ్రికా 27.1 ఓవర్లలో 83 పరుగులకే చేతులెత్తేసింది. టెయిలెండర్ మార్కో జాన్సెన్ (14, 30 బంతుల్లో 1 ఫోర్) సఫారీ శిబిరంలో టాప్ స్కోరర్. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా 50 ఓవర్లలో 5 వికెట్లకు 326 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (101 నాటౌట్, 121 బంతుల్లో 10 ఫోర్లు) శతకంతో చెలరేగగా, శ్రేయస్ అయ్యర్ (77, 87 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు) అర్థ సెంచరీతో మెరిశాడు. సూర్యకుమార్ (22), రవీంద్ర జడేజా (29నాటౌట్, 15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్‌లతో మెప్పించారు. కెరీర్ 49వ వన్డే సెంచరీ సాధించిన బర్త్‌డే బాయ్ విరాట్ కోహ్లి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. ప్రపంచకప్ గ్రూప్ దశలో భారత్ తన చివరి మ్యాచ్‌లో నవంబర్ 12న బెంగళూర్‌లో నెదర్లాండ్స్‌తో తలపడనుంది.

కోహ్లి శతక్కొట్టాడు :

ఈడెన్ పిచ్ నెమ్మదించింది. పరుగుల వేట గగనమైంది. రెండో ఇన్నింగ్స్‌కు మంచు ప్రభావం ఉండనుంది. అయినా, టాస్ నెగ్గిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు రోహిత్ శర్మ (40, 24 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు), శుభ్‌మన్ గిల్ (23) ధనాధన ఆరంభాన్ని అందించారు. సఫారీ పేసర్లపై దండెత్తిన రోహిత్..ఆరో ఓవర్లోనే 60 పరుగుల మార్క్ దాటించాడు. ప్రమాకరంగా మారుతున్న రోహిత్‌ను రబాడ వెనక్కి పంపగా.. కండ్లుచెదిరే మాయతో గిల్‌ను కేశవ్ మహరాజ్ సాగనంపాడు. దీంతో 93 పరుగులకు భారత్ ఓపెనర్లను కోల్పోయింది. ఈ స్థితిలో విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ భారత్‌ను ముందుకు నడిపించారు. మూడో వికెట్‌కు 134 పరుగులు జోడించగా కోహ్లి 67 బంతులో అర్థ సెంచరీ అందుకోగా, అయ్యర్ 64 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. నెమ్మదించిన పిచ్‌పై పరుగుల వేట కష్టమైనా.. తొలుత అయ్యర్ దూకుడు పెంచగా, కోహ్లి సైతం అదే బాటలో నడిచాడు. భారీ షాట్‌కు ప్రయత్నించి అయ్యర్ అవుట్ కాగా.. రాహుల్ (8) ఇబ్బంది పడ్డాడు. సూర్య (22), జడేజా (29 నాటౌట్) చివర్లో కోహ్లితో కలిసి కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. సూర్య ఐదు బౌండరీలు బాదగా.. చివరి ఓవర్లో జడేజా విశ్వరూపం దాల్చాడు. మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో అజేయంగా 29 పరుగులు చేశాడు. 119 బంతుల్లో శతకం సాధించిన కోహ్లి.. 101 పరుగుల అజేయంగా నిలిచాడు. సఫారీ బౌలర్లలో ఎంగిడి,రబాడ, జాన్సెన్, మహరాజ్, షంషి తలా ఓ వికెట్ పడగొట్టారు.

సఫారీ చతికిల :

మంచు ప్రభావం అనుకూలతతో సఫారీ బ్యాటర్లు రెచ్చిపోతారని అనుకుంటే.. భారత బౌలర్లు కథ మార్చేశారు. సిరాజ్ తొలి ఓవర్లోనే ఫామ్‌లో ఉన్న డికాక్ (5)ను అవుట్ చేయగా.. పవర్‌ప్లేలోనే బంతి అందుకున్న జడేజా.. సఫారీ కెప్టెన్ బవుమా (11) కథ ముగించాడు. కొత్త బంతితో జడేజా మాయజాలం ముంగిట సఫారీ బ్యాటర్లు తేలిపోయారు. స్పిన్ బాగా ఆడగల క్లాసెన్ (1), డెవిడ్ మిల్లర్ (11) జడేజాకు దాసోహం అయ్యారు. వాండర్ డుసెన్ (13), మార్క్‌రామ్ (9)లను షమి సాగనంపాడు. దీంతో 59 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా చేతులెత్తేసింది. మార్కో జాన్సెన్ (14) ఓటమి అంతరం కుదించే ప్రయత్నం చేశాడు. కుల్దీప్ యాదవ్ సైతం రెండు వికెట్లతో మెరువగా.. 27.1 ఓవర్లలోనే దక్షిణాఫ్రికా 83 పరుగులకు కుప్పకూలింది. 243 పరుగుల తేడాతో భారత్ గెలుపొందింది.



స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) బవుమా (బి) రబాడ 40, గిల్ (బి) మహరాజ్ 23, విరాట్ కోహ్లి నాటౌట్ 101, శ్రేయస్ అయ్యర్ (సి) మార్క్‌రామ్ (బి) ఎంగిడి 77, కెఎల్ రాహుల్ (సి) వాండర్ డుసెన్ (బి) జాన్సెన్ 8, సూర్యకుమార్ (సి) డికాక్ (బి) షంషి 22, రవీంద్ర జడేజా నాటౌట్ 29, ఎక్స్‌ట్రాలు : 26, **మొత్తం : (50 ఓవర్లలో 5 వికెట్లకు) 326.**

వికెట్ల పతనం : 1-62, 2-93, 3-227, 4-249, 5-285.

బౌలింగ్ : లుంగిసాని ఎంగిడి 8.2-0-63-1, మార్కో జాన్సెన్ 9.4-0-94-1, కగిసో రబాడ 10-1-48-1, కేశవ్ మహరాజ్ 10-0-30-1, షంషి 10-0-72-1, ఎడెన్ మార్క్‌రామ్ 2-0-17-0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : డికాక్ (బి) సిరాజ్ 5, బవుమా (బి) జడేజా 11, వాండర్ డుసెన్ (ఎల్బీ) షమి 13, మార్క్‌రామ్ (సి) రాహుల్ (బి) షమి 9, క్లాసెన్ (ఎల్బీ) జడేజా 1, డెవిడ్ మిల్లర్ (బి) జడేజా 11, మార్కో జాన్సెన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 14, కేశవ్ మహరాజ్ (బి) జడేజా 7, కగిసో రబాడ (సి,బి) జడేజా 6, లుంగి ఎంగిడి (బి) కుల్దీప్ 0, షంషి నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 2, **మొత్తం : (27.1 ఓవర్లలో ఆలౌట్) 83.**

వికెట్ల పతనం : 1-6, 2-22, 3-35, 4-40, 5-40, 6-59, 7-67, 8-79, 9-79, 10-83.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 5-0-14-0, మహ్మద్ సిరాజ్ 4-1-11-1, రవీంద్ర జడేజా 9-1-33-5, మహ్మద్ షమి 4-0-18-2, కుల్దీప్ యాదవ్ 5.1-1-7-2.

శతకం నం.49

- సచిన్ సరసన విరాట్ కోహ్లి
- అత్యధిక సెంచరీల రికార్డు సమం

పరుగుల యంత్రం, క్రికెట్ సూపర్ స్టార్ విరాట్ కోహ్లి మరో రికార్డు సమం చేశాడు. ప్రపంచ క్రికెట్‌లో అందని ద్రాక్షగా మిగిలిన మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 49 వన్డే సెంచరీల రికార్డును ఆదివారం విరాట్ కోహ్లి సమం చేశాడు. ప్రపంచకప్ గ్రూప్ దశలో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో అజేయంగా 101 పరుగులు చేసిన కోహ్లి.. కెరీర్ 49వ శతకం సాధించాడు. సచిన్ టెండూల్కర్ 452వ ఇన్నింగ్స్‌లో ఈ ఘనత సాధించగా.. విరాట్ కోహ్లి 277వ ఇన్నింగ్స్‌లోనే దిగ్గజం సరసన నిలిచాడు. అత్యధిక శతకాల జాబితాలో రోహిత్ శర్మ (31), రికీ పాంటింగ్ (30), సనత్ జయసూర్య (28) టాప్-5లో కొనసాగుతున్నారు. విరాట్ కోహ్లి రికార్డు 49వ వన్డే సెంచరీ బాదటంతో క్రికెటర్లు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా కింగ్‌పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

ఈ ఏడాది విరాట్ కోహ్లి సూపర్ ఫామ్‌లో ఆడుతున్నాడు. ఈడెన్‌గార్డెన్స్‌కు ముందే కోహ్లి ఈ ఘనత సాధించాల్సింది. కానీ ఆస్ట్రేలియాపై చెన్నైలో 85 పరుగులు, న్యూజిలాండ్‌పై ధర్మశాలలో 95 పరుగులు, శ్రీలంకపై వాంఖడెలో 88 పరుగులు చేసిన కోహ్లి.. సెంచరీకి చేరువగా వచ్చి అభిమానులను నిరాశపరిచాడు. బంగ్లాదేశ్‌పై పుణెలో శతకబాదిన కోహ్లి.. సచిన్ రికార్డుకు అడుగు దూరంలో నిలిచాడు. ప్రపంచకప్ గ్రూప్ దశలో ఎనిమిది మ్యాచుల్లో రెండు సెంచరీలు, నాలుగు అర్థ సెంచరీలు బాదిన కోహ్లి (543) అత్యధిక పరుగులు చేసిన జాబితాలో డికాక్ (550) తర్వాతి స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక ఈ ఏడాది 99.82 స్ట్రయికరేట్, 72.18 సగటుతో విరాట్ 1000కి పైగా పరుగులు సాధించాడు. ఇలా ఓ ఏడాదిలో వెయ్యికి పైగా పరుగులు చేయటం కోహ్లికి ఇది ఎనిమిదోసారి. సచిన్ టెండూల్కర్ ఏడు క్యాలెండర్ ఇయర్స్ రికార్డును సైతం విరాట్ బద్దలు కొట్టాడు.

ఈడెన్‌గార్డెన్స్‌లో సఫారీపై శతకం నం.49 అంత సులువుగా దక్కలేదు. ఆరంభంలో రోహిత్, గిల్ ధనాధన్ ఆరంభం అందించినా.. పవర్‌ప్లే అనంతరం పిచ్ నెమ్మదించింది. బ్యాట్ పైకి బంతి రాలేదు. స్ట్రయిక్‌రొటేషన్ చేస్తూ ముందుకు సాగటం ఒక్కటే ముందున్న మార్గం. శ్రేయస్ అయ్యర్‌తో కలిసి కోహ్లి ఆ పని చేశాడు. పరుగుల వేటతో పాటు చివరి వరకు క్రీజులో నిలవాలనే జట్టు ప్రణాళికలను అమలు పరిచాడు. పిచ్ నెమ్మదించటంతో కోహ్లి, అయ్యర్‌తో పాటు కెఎల్ రాహుల్ సైతం ఓ దశలో తడబాటుకు లోనయ్యాడు. కానీ ఓపిగ్గా క్రీజులో నిలిచి అనువైన బంతుల కోసం ఎదురుచూసిన కోహ్లి.. 119 బంతుల్లో 100 పరుగుల మార్క్ అందుకున్నాడు. ఈ ప్రపంచకప్‌లోనే కోహ్లి శతకాల అర్థ సెంచరీ పూర్తి చేసుకుంటే అభిమానులకు పండుగే.



క్యాండిడేట్స్ టోర్నీకి వైశాలి

గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌కు చేరువగా..

చెన్నై : భారత యువ చెస్ స్టార్స్ ఆర్. ప్రజ్ఞానంద, ఆర్. వైశాలి అరుదైన రికార్డు సాధించారు. ప్రతిష్టాత్మక చెస్ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించిన తొలి అక్కా తమ్ముడిగా నిలిచారు. ఫిడె మహిళల గ్రాండ్ స్విస్ టోర్నీలో మాజీ వరల్డ్ చాంపియన్ చైనా గ్రాండ్‌మాస్టర్‌పై గెలుపొందిన వైశాలి.. వచ్చే ఏడాది కెనడాలో జరుగనున్న క్యాండిడేట్స్ టోర్నీకి బెర్త్ ఖాయం చేసుకుంది. ఈ టోర్నీలో మరో రౌండ్ మిగిలి ఉండగా.. అగ్రస్థానంలో నిలిచి కనీసం టాప్-2 ముగింపు లాంఛనం చేసుకుంది. ఇక ప్రస్తుతం 2498 క్లాసికల్ రేటింగ్‌తో ఉన్న వైశాలి గ్రాండ్‌మాస్టర్ హోదాకు మరో రెండు పాయింట్ల దూరంలో నిలిచింది. కోనేరు హంపి, హారిక ద్రోణవల్లి తర్వాత భారత్ నుంచి గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కించుకోనున్న మూడో మహిళగా వైశాలి నిలువనుంది. ఈ ఏడాది చెస్ ప్రపంచకప్ రన్నరప్‌గా నిలిచిన ప్రజ్ఞానంద ఇదివరకే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించిన సంగతి తెలిసిందే.



ఉత్సాహంగా హాఫ్ మారథాన్

హైదరాబాద్ : హైదరాబాద్ హాఫ్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆదివారం ఉదయం జరిగిన హాఫ్ మారథాన్ రేసులో తెలంగాణ స్ప్రింటర్ రమేశ్ చంద్ర, ప్రజక్త (మహారాష్ట్ర) విజేతలుగా నిలిచారు. మెన్స్ విభాగంలో 21.1 కిమీ రేసును రమేశ్ ఓ గంట 13 నిమిషాల 10 సెకండ్లలో ముగించగా.. సతీశ్ కుమార్ (1.15.50), పియూశ్ (1.16.56) తర్వాతి స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో ప్రజక్త 83 నిమిషాల 45 సెకండ్లలో రేసును ముగించగా.. ప్రీను యాదవ్ (1.24.46), తేజస్విని (1.25.11) టాప్-3లో నిలిచారు. 10కిమి రేసులో చేతన్ కుమార్ (మెన్స్), షీలా యాదవ్ (ఉమెన్స్) విన్నర్లుగా నిలిచారు. సుమారు 8000 మందికి పైగా రన్నర్లు పోటీపడిన హాఫ్ మారథాన్ ఈవెంట్‌ను ఏజెస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రచారకర్త సచిన్ టెండూల్కర్, బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్‌లు జెండా ఊపి ప్రారంభించి.. రేసు అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

చాలా కాలం గుర్తుండిపోయే జపాన్..

హీరో కార్తి నటిస్తున్న తన 25వ చిత్రం 'జపాన్'. 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వం వహించిన ఈ పాన్ ఇండియా హీస్ట్ థ్రిల్లర్‌ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ ఆర్ ప్రభు నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. 'దీపావళి' కానుకగా ఈనెల 10న గ్రాండ్‌గా థియేటర్స్‌లో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత ఎస్ఆర్ ప్రభు మీడియాతో ముచ్చటించారు.



ప్రస్తుతం కీర్తి సురేష్‌తో 'కన్నివెడి', అలాగే రష్మిక మందనతో 'రెయిన్ బో' చిత్రాలు చేస్తున్నాం. ఈ రెండూ వేటికవే భిన్నమైన సినిమాలు. 'జపాన్' మాదిరిగానే ఈ సినిమాలు సైతం ప్రేక్షకుల్ని విశేషంగా అలరిస్తాయి.
- ఎస్ఆర్ ప్రభు

- రచయిత, దర్శకుడు రాజు మురుగన్ ఆలోచనలు చాలా విలక్షణంగా ఉంటాయి. ఆయన సమాజాన్ని చూసే విధానం, ఏదైనా విషయాన్ని చెప్పే తీరు చాలా యూనిక్‌గా ఉంటుంది. నవ్విస్తూనే ఆలోజింపజేస్తారు. రాజు మురుగన్ చెప్పిన 'జపాన్' కథ కార్తికి చాలా నచ్చింది. ఇది క్యారెక్టర్ బేస్డ్ సినిమా. ముఖ్యంగా 'జపాన్' పాత్ర ప్రేక్షకుల మనసులో చాలా కాలం నిలిచిపోతుంది.
- కార్తి కూడా డిఫరెంట్ సినిమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తారు. ప్రతిసారీ ఏదో కొత్తది చేయడానికి ప్రయత్నిస్తారు. ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మొదటి నుంచి ఒక క్యూరియాసిటీ ఉంది. గెటప్, వాయిస్ మాడ్యులేషన్ ఇవన్నీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ట్రైలర్, టీజర్ చూసినప్పటికీ ఇది ఎలాంటి సినిమానో అనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో ఉంది. ఆ క్యూరి యాసిటీని మెయింటైన్ చేశాం.
- ఇది క్యారెక్టర్ డ్రివెన్ మూవీ. కార్తి అద్భుతంగా చేశారు. జపాన్ పాత్ర చాలా ఫేమస్ అవుతుంది. కార్తి 'ఎవ్వరా మీరంతా' డైలాగ్ ఎంత వైరల్ అయ్యిందో.. జపాన్ కంటెంట్ కూడా చాలా వైరల్ అవుతుంది. పాత్ర సీరియస్‌గా ఉన్నప్పటికీ అతను ఏదైనా ఒక విషయాన్ని చూసే తీరు, మాట్లాడే విధానం ప్రేక్షకులకు మంచి వినోదాన్ని పంచుతుంది. ఇది హీస్ట్ ఫిల్మ్. ఇందులో మానవత్వం గురించి ఉంటుంది. సొసైటీని రిఫ్లెక్ట్ చేసే ఎలిమెంట్స్ ఉంటాయి. సినిమా ఫన్‌గా ఉండటంతో ప్రేక్షకులకు ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు.
- ఇక జపాన్ జీవితంలో అను క్యారెక్టర్ చాలా స్పెషల్. జపాన్ లానే అను పాత్ర కూడా ఊహాతీతంగా ఉంటుంది. ఆ పాత్ర ప్రేక్షకులకు ఖచ్చితంగా నచ్చుతుంది. జీవి ప్రకాష్ ఈ చిత్రానికి మ్యూజిక్ చేసిన విధానం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. పాటలు కూడా చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. రవివర్మన్ దేశంలోనే గొప్ప టెక్నిషియన్. ఇందులో విజువల్స్ అద్భుతం.
- నాగార్జున ఈ చిత్ర ట్రైలర్ టీజర్ చూసి ఇలాంటి డిఫరెంట్ కథలు, పాత్రలు ప్రతి సినిమాకి ఎలా చేయగలుగుతున్నారని కార్తిని అభినందించారు. అన్నపూర్ణ స్టూడియోస్ గత ఏడాది కార్తి 'సర్దార్' సినిమాని విడుదల చేసింది. సినిమా విషయంలో సుప్రియ, మా ఆలోచనలు ఒకేలా ఉంటాయి. ఎక్కువ రీచ్‌కి అన్నపూర్ణ స్టూడియోస్ మంచి ఫ్లాట్ ఫామ్.

ఒక టికెట్‌తో ఇద్దరికి సినిమా చూసే ఛాన్స్



రక్షిత్ అట్లూరి, అపర్ణ జనార్ధన్, సంకీర్తన విపిన్ హీరో హీరోయిన్స్‌గా నటించిన చిత్రం 'నరకాసుర'. సుముఖ క్రియేషన్స్, ఐడియల్ ఫిలిం మేకర్స్ బ్యానర్స్‌లో డాక్టర్ అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రానికి సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వం వహించారు.
ఇటీవల విడుదలైన ఈ మూవీకి అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో సోమవారం నుంచి ఈ సినిమాను థియేటర్స్‌లో ఒక టికెట్ పై ఇద్దరు ప్రేక్షకులు చూసే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. హీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ, 'సినిమాకు థియేటర్స్ నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. రక్షిత్ బాగా నటించాడు, ఈ సినిమాతో నటుడిగా మరో మెట్టు ఎక్కాడనే ప్రశంసలు వస్తున్నాయి. మా సినిమాలోని మెసేజ్ మరింత మంది ప్రేక్షకులకు రీచ్ అవ్వాలని నేటి నుంచి గురువారం వరకు ఒక టికెట్ మీద ఇద్దరు ప్రేక్షకులు సినిమా చూసేందుకు అవకాశం కల్పిస్తున్నాం' అని అన్నారు. 'మా సినిమాను పెద్ద హిట్ చేసిన ఆడియెన్స్‌కు థ్యాంక్స్. సినిమా చూసిన వాళ్ల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది' అని దర్శకుడు సెబాస్టియన్ చెప్పారు.
నిర్మాత డాక్టర్ అజ్జా శ్రీనివాస్ మాట్లాడుతూ, 'ఈ మూవీతో మా బ్యానర్ సుముఖ క్రియేషన్స్‌కు మంచి పేరొచ్చింది. ప్రొడక్షన్ వ్యాల్యూస్ బాగున్నాయని అంటున్నారు. విదేశాల నుంచి మా ఫ్రెండ్స్ ఫోన్ చేసి అప్రిషియేట్ చేస్తున్నారు.

నవచిత్రం

గొప్ప మ్యాజిక్ ఉన్న లవ్‌స్టోరీ


మృణాల్ ఠాకూర్, నాని


నాని నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హాయ్ నాన్నా' ఇప్పటికే ఈ సినిమాలోని మొదటి రెండు పాటలకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా బిట్స్ ఫిలాని క్యాంపస్‌లో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో ఈ సినిమాలోని మూడో సింగిల్ 'అమ్మాడి' పాటని లాంచ్ చేశారు.
ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ,'ఈ ఆడిటోరియం నాకు చాలా స్పెషల్. 'ఎవడే సుబ్రహ్మణ్యం' సమయంలో ఇక్కడికి వచ్చాను. వరుసగా ఎనిమిది సూపర్ హిట్లు నాన్ స్టాప్‌గా కొట్టాను. మళ్ళీ ఇప్పుడు ఇక్కడికి వచ్చాను. ఈసారి పదహారు సూపర్ హిట్లు కొట్టకుండా బ్రేక్ తీసుకుంటే కరెక్ట్ కాదని ఫిక్స్ అయిపోయా. ఇందులో మీకు కావాల్సినంత ప్రేమ దొరుకుతుంది. థియేటర్‌కి వెళ్లి మంచి ప్రేమకథ చూసి చాలా రోజులైంది. అలాగే ఇందులో గొప్ప మ్యాజిక్ ఉంది. అది మీ అందరికీ నచ్చుతుంది. 'సీతారామం' తర్వాత మృణాల్‌ను అందరూ సీత అంటున్నారు. దీనికి మించిన పాత్ర ఇందులో తను చేసిందని మా నమ్మకం. డిసెంబర్ 7 తర్వాత తన పేరు యష్నాగా మారిపోతుంది' అని తెలిపారు.
'సీతారామం'తో మీ అందరూ నాపై ఎంతో ప్రేమ చూపించారు. ఇందులో అమ్మాడి పాట చాలా స్పెషల్' అని మృణాల్ ఠాకూర్ అన్నారు.
దర్శకుడు శౌర్యువ్ మాట్లాడుతూ, 'పాటలు మీ అందరికీ నచ్చడం ఆనందంగా ఉంది. డిసెంబర్ 7న సినిమా విడుదలౌతుంది. అందరికీ ఖచ్చితంగా నచ్చుతుంది' అని చెప్పారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల భారీ స్థాయిలో నిర్మించిన ఈ పాన్ ఇండియా మూవీలో బేబీ కియారా ఖన్నా ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది.
డిసెంబర్ 7న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు


ఎస్.జె.సూర్య, వెంకటేష్, రాఘవ లారెన్స్

రాఘవ లారెన్స్, ఎస్.జె.సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన హై యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్' దీపావళి కానుకగా ఈ మూవీ ఈనెల 10న రిలీజ్ అవుతుంది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో స్టోన్ బెంచ్ ఫిలింస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని కార్తీకేయన్ నిర్మించారు. ఈ చిత్రాన్ని తమిళ్, తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు.
ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. హీరో వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని బిగ్ టికెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ట్రైలర్ అదిరిపోయింది. మూవీ తప్పకుండా బ్లాక్ బస్టర్ అవుతుందనే గట్టి నమ్మకం ఉంది. కార్తీక్ సుబ్బరాజ్ గురించి చెప్పాలంటే తనొక కల్ట్ డైరెక్టర్. ఈ ట్రైలర్ చూడగానే ఎగ్జైట్ అయ్యాను. తను నాకోసం త్వరలోనే ఓ స్క్రిప్ట్ చేస్తాడని అనుకుంటున్నాను. ఈనెల 10న ఈ మూవీని థియేటర్‌లో చూసి బ్లాక్‌బస్టర్ చేయాలి' అని అన్నారు.
'నవీన్ చంద్ర అద్భుతంగా నటించారు. నిర్మాత కార్తికేయన్ భారీ బడ్జెట్‌తో సినిమా చేశారు. ఎస్.జె.సూర్య నట రాక్షసుడు. ఈ సినిమాలో ఆయన సైలెంట్‌గా చేసిన పెర్ఫామెన్స్ ఆడియెన్స్‌కి నచ్చుతుంది. కార్తీక్ సుబ్బరాజ్ మేకప్ లేకుండానే నన్ను యాక్ట్ చేయించారు. నా సినిమాల్లో ఈ సినిమా మరోలా ఉంటుంది. తమిళనాడులో ట్రస్ట్ పెట్టి ఎలాగైతే సేవలు చేస్తున్నానో ఇక్కడ కూడా ట్రస్ట్ పెట్టి సేవలు అందించబోతున్నాను' అని రాఘవ లారెన్స్ చెప్పారు.
ఎస్.జె.సూర్య మాట్లాడుతూ, 'కార్తీక్ సుబ్బరాజ్ అనే గొప్ప డైరెక్టర్ క్రియేషన్‌లో ఈ సినిమాను చేశాం. తన మేకింగ్‌లో ఓ యూనిక్ స్టైల్ ఉంటుంది. 11 ఏళ్లలో ఆయన చేసిన బెస్ట్ మూవీ ఇది. ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు మంచి కాన్సెప్ట్ కూడా ఉంది' అని తెలిపారు. 'కార్తీక్ సుబ్బరాజ్ 'పిజ్జా' సినిమా చేసిన తర్వాత తనకు తెలుగులో వచ్చిన రెస్పాన్స్ చూసి ఆశ్చర్యపోయాడు. తర్వాత తను ఎన్నో సినిమాలను చేశాడు. తనతో తెలుగులో స్ట్రయిట్ సినిమా చేయాలనుకుంటున్నాను. మా బ్యానర్‌లో బిగ్గెస్ట్ బడ్జెట్ మూవీ ఇదే' అని నిర్మాత కార్తికేయన్ సంతానం చెప్పారు.
డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా నాకెంతో స్పెషల్ మూవీ. మీరు కచ్చితంగా డిసప్పాయింట్ కారు. ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు' అని తెలిపారు.

సైడ్ బి కూడా హిట్ ఖాయం


రక్షిత్ శెట్టి

ఈ ఏడాది సెప్టెంబర్‌లో విడుదలైన 'సప్త సాగరాలు దాటి సైడ్ ఎ' విశేష ఆదరణ పొందింది. దీంతో 'సప్త సాగరాలు దాటి సైడ్ బి' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.
ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి. విశ్వ ప్రసాద్, వివేక్ కూచిభొట్ల తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 17న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్‌ను అగ్ర కథానాయిక సమంత లాంచ్ చేశారు.
తెలుగులో 'సైడ్ ఎ' ఘన విజయం సాధించినట్లుగానే, 'సైడ్ బి' కూడా తెలుగు ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టడం ఖాయమని చిత్ర బృందం నమ్మకంగా ఉంది. హేమంత్ రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రక్షిత్ శెట్టి, రుక్మిణీ వసంత్, చైత్ర జె. ఆచార్ ప్రధాన పాత్రలలో నటించారు.

సరికొత్త కాన్సెప్ట్‌తో అథర్వ

సస్పెన్స్, క్రైమ్ జోనర్లకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. అయితే ఆ జోనర్‌తో యూత్‌కు నచ్చేలా రొమాంటిక్, లవ్ ట్రాక్‌ను జోడించి అన్ని రకాల ఎమోషన్స్‌తో తెరకెక్కించిన చిత్రమే 'అథర్వ'. నూతల పాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో పెగ్గో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రం రూపొందుతోంది.
ఈ సినిమాలో కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. మహేష్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా సుభాష్ నూతలపాటి నిర్మిస్తున్నారు. విజయ, ఝాన్సీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాను డిసెంబర్ 1న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో భారీగా రిలీజ్ చేయబోతున్నట్టు చిత్రయూనిట్ ప్రకటించింది.


కార్తీక్‌రాజు, సిమ్రాన్ చౌదరి

డైరెక్టర్ మహేష్ రెడ్డి మాట్లాడుతూ, 'ఒక క్రైమ్ సీన్‌లో క్లూ అనేది చాలా ఇంపార్టెంట్. ఇంపార్టెంట్ అయిన క్లూస్‌ని, ఎవిడెన్స్‌ని ఐడెంటిఫై చేసే క్లూస్ డిపార్ట్మెంట్ గురించే ఈ మూవీ' అని తెలిపారు. 'ఇదొక కొత్త కాన్సెప్ట్. క్లూస్ టీమ్ మీద ఇండియాలో ఇప్పటివరకు ఎవ్వరూ సినిమా తీయలేదు. డైరెక్టర్ చాలా ప్యాషన్‌తో తీసిన సినిమా ఇది. రీసెంట్‌గా క్లూస్ డిపార్ట్మెంట్‌కు ప్రత్యేక షో వేసినప్పుడు.. వాళ్లంతా సినిమా చూసి డైరెక్టర్ పర్ఫెక్షన్ చాలా బాగుందన్నారు. డిసెంబర్ 1న ఈ సినిమాని సురేష్ ప్రొడక్షన్స్ రిలీజ్ చేస్తోంది' అని హీరో కార్తీక్ రాజు అన్నారు.
నిర్మాత సుభాష్ నూతలపాటి మాట్లాడుతూ, 'ఎంతో మంది ప్యాషన్ ఉన్న వాళ్ళు కలిసి కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. ఓ పక్క థ్రిల్ చేసే అంశాలు, మరో పక్క మంచి రొమాంటిక్ లవ్ ట్రాక్ పర్‌ఫెక్ట్‌గా బ్లెండ్ అవ్వడంతో సినిమా చాలా బాగా వచ్చింది. తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అని తెలిపారు.

డార్క్ చాక్లెట్ తింటే...

చలికాలం వచ్చిందంటే చాలు అనేక సీజనల్ వ్యాధులు చుట్టుముడతాయి. అందువల్ల ఈ కాలంలో పోషకాలు ఎక్కువ ఉన్న ఆహారం తీసుకోవాలని డాక్టర్లు సలహాలిస్తుంటారు. అయితే చలికాలంలో చాక్లెట్లు తింటే జలుబు చేస్తుందని పిల్లలను చాక్లెట్ తినవద్దని తల్లిదండ్రులు చెబుతుంటారు. కానీ వాస్తవానికి డార్క్ చాక్లెట్ తింటే చాలా ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే డార్క్ చాక్లెట్ తయారీలో వాడే కోకో పౌడర్‌లో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. అందువల్ల శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలపడి ఎటువంటి ఇన్ఫెక్షన్లు ధరిచేరవు. శరీరంలో వేడిని పెంచి చలిని తట్టుకునే శక్తిని ఇస్తుంది. ఈ డార్క్ చాక్లెట్లు తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో చూద్దాం...!

రక్తపోటు తగ్గిస్తుంది : డార్క్ చాక్లెట్‌లో అధికంగా ఉండే మెగ్నీషియం రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ చాక్లెట్ తినడం వల్ల మీ శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ లెవల్ పెరుగుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. నైట్రిక్ ఆక్సైడ్ శరీరంలో సహజంగా సంభవించే పదార్థం. ఇది రక్త నాళాలలో చిన్న గ్రాహకాలపై పనిచేసి వాటిని విడదీయడానికి సహాయపడుతుంది, తద్వారా రక్తపోటు తగ్గుతుంది.

కొవ్వును తగ్గిస్తుంది : డార్క్ చాక్లెట్ తింటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది. అదేవిధంగా మంచి కొలెస్ట్రాల్ అయిన హెచ్‌డిఎల్‌ను పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది హృదయ సంబంధ వ్యాధులు, హార్ట్ స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది.

మెదడు పని తీరులో మెరుగుదల : జ్ఞాపకశక్తిని పెంచడానికి, మెదడును ఉత్తేజం చేయడానికి డార్క్ చాక్లెట్ సహాయ పడుతుంది. 2012లో నాటింగామ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు డార్క్ చాక్లెట్ తినడం వల్ల మెదడులోని కొన్ని ముఖ్య ప్రాంతాలకు రక్త ప్రవాహం పెరుగుతుందని కనుగొన్నారు. ఇది మెదడు పనితీరును, అప్రమత్తతను మెరుగుపరుస్తుంది. న్యూరాలజీ జర్నల్‌లో ప్రచురించబడిన మరో అధ్యయనంలో ప్రతిరోజూ డార్క్ చాక్లెట్ తినడం ద్వారా జ్ఞాపకశక్తి దాదాపు 30 శాతం పెరుగుతుందని, సమస్య పరిష్కార నైపుణ్యాలు కూడా మెరుగవుతాయని తేలింది.

గుండె ఆరోగ్యం మెరుగు : డార్క్ చాక్లెట్ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని 2015లో జరిగిన ఓ అధ్యయనంలో తేలింది. అమెరికన్ కెమికల్ సొసైటీ (ఏసిఎస్) సమర్పించిన మరో అధ్యయనంలో డార్క్ చాక్లెట్ తినేటప్పుడు కడుపులోని గట్ బ్యాక్టీరియాను బయటికి పంపిస్తుందని పేర్కొంది. దీంతో ప్రతిరోజూ చాక్లెట్ తినడం వల్ల గణనీయంగా హృదయ సంబంధ వ్యాధులు, హార్ట్ స్ట్రోక్ ప్రమాదాలు తగ్గుతాయని తేలింది.

బరువు అదుపులో : కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం 1000 మంది అమెరిన్లపై అధ్యయనం నిర్వహించింది. ఈ అధ్యయనంలో అప్పుడప్పుడు చాక్లెట్ తిన్న వారి కంటే ఎక్కువగా తిన్నవారే సన్నగా ఉన్నారని తేలింది. డార్క్ చాక్లెట్ కేలరీలతో నిండి ఉన్నప్పటికీ, బరువు తగ్గడానికి అనుకూలంగా ఉండే పదార్థాలు ఇందులో ఉన్నాయని పరిశోధకులు పేర్కొన్నారు. భోజనం చేసిన తర్వాత డార్క్ చాక్లెట్‌ను తింటే బరువు పెరగడాన్ని అరికట్టే అవకాశం ఉందని మరో అధ్యయనం తెలిపింది.





ఉల్లిపాయలు కట్ చేసిన తర్వాత చేతులు ఉల్లి వాసన వస్తుంటే కొంచెం పేస్టు వేసి కడిగేస్తే సరి.. వాసన పోతుంది.



డిజిటల్ యుగంలో మహిళా సాధికారత

పెరుగుతున్న డిజిటల్ ప్రపంచంలో మహిళలకు ఉపాధిలో కొన్ని అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. అయినప్పటికీ ఆధునిక సాంకేతికను ఉపయోగించడంలో లింగ అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయి. సాంకేతికతలో పురోగతి ఉన్నప్పటికీ మహిళలు డిజిటల్ సాధనాలు, సేవలు ఉపయోగించుకోవడానికి అడ్డంకులను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఈ డిజిటల్ లింగ అసమానత్వం మహిళల సాధికారతకు ఆటంకం కలిగించడమే కాకుండా సామాజిక, ఆర్థిక పురోగతిని కూడా తగ్గిస్తుంది. అయితే ఈ విభజనను పరిష్కరించడం కేవలం సమానత్వానికి సంబంధించిన విషయం కాదు, ఇది స్థిరమైన అభివృద్ధికి ప్రపంచ ఆవశ్యకత.

ప్రపంచవ్యాప్తంగా మహిళలు ఇంటర్నెట్‌ను ఉపయోగించేందుకు అవకాశాలను పరిశీలిస్తే పురుషుల కన్నా 6శాతం తక్కువగా ఉంది. మధ్యతరగతి, పేద దేశాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. GSMA ఇటీవలి అధ్యయనం ప్రకారం మహిళలు మొబైల్ ఇంటర్నెట్‌ను ఉపయోగించే అవకాశం 26శాతం తక్కువగా ఉంది. అనేక ప్రాంతాలలో డిజిటల్ యాక్సెస్ కోసం లైఫ్‌లైన్ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. డిజిటల్ లింగ వ్యత్యాసం సంఖ్యలకు మించి ఉంటుంది. ఇది ఇప్పటికే ఉన్న అసమానతలను మరింత తీవ్రతరం చేస్తుంది. సమాచారం, ఆన్‌లైన్ సేవలు, విద్యా వనరులకు మహిళలు దూరంగా ఉంటున్నారు. ఇది ఆరోగ్యం, విద్య, ఆర్థిక అవకాశాలలో అసమానతలను విస్తృతం చేస్తుంది. ఈ అంతరాన్ని తగ్గించడం నేడు చాలా అవసరం. లింగ సమానత్వాన్ని పెంపొందించడం, డిజిటల్ విప్లవంలో మహిళలు పూర్తిగా పాలుపంచుకునేలా చేయడం అందరి కర్తవ్యం.

సమగ్ర డేటా సేకరణ

డిజిటల్ లింగ అంతరాన్ని పరిష్కరించడానికి ముందు సమగ్ర డేటా సేకరణ అవసరం. ఇది డిజిటల్ యుగంలో యాక్సెస్, వినియోగం, భాగస్వామ్యంపై లింగ-విభజన సమాచారాన్ని పరిశీలిస్తుంది. అనేక దేశాలు డిజిటల్ లింగ అంతరాన్ని పరిష్కరించడానికి, తగ్గించడానికి డేటాను చురుకుగా ఉపయోగించుకుంటున్నాయి. నార్వే ఈ రంగంలో అగ్రగామిగా నిలిచింది. 2008 నుండి నార్వే స్టాటిస్టిక్స్ సామాజిక భాగస్వామ్యం, విద్య, శ్రామికశక్తి పంపిణీ, ఆదాయం, నాయకత్వ ప్రాతినిధ్యం వంటి వివిధ అంశాలను కలిగి ఉన్న లింగ సమానత్వ సూచికలను ప్రచురిస్తోంది. ఈ విధానం ప్రాంతీయ, స్థానిక అసమానతలను అంచనా వేయడానికి, తదనుగుణంగా జోక్యాలను రూపొందించడానికి విధాన నిర్ణేతలను అనుమతిస్తుంది.

అడ్డంకులను బద్దలు కొట్టడం

నైపుణ్యాలు, భద్రతతో పాటు మొదలైన అనేక అడ్డంకులు డిజిటల్ లింగ విభజనకు దోహదం చేస్తున్నాయి. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు, వ్యాపారాలు, పౌర సమాజం నుండి సహకార ప్రయత్నాలు అవసరం. ముఖ్యంగా తక్కువ ఆదాయం ఉన్న మహిళలకు ఆర్థిక స్థోమత అనేది ఒక ముఖ్యమైన అడ్డంకిగా మిగిలిపోయింది. ICT- నిర్దిష్ట పన్నులను తొలగించడం, పరికరాలు, సేవలు సరసమైన ధరలకు ప్రోత్సహించడం ద్వారా ఖర్చులను తగ్గించడానికి ప్రభుత్వాలు తప్పనిసరిగా పని చేయాలి. యాక్సెసిబిలిటీ మరొక క్లిష్టమైన అంశం. మహిళలు సాంకేతికతతో నిమగ్నమవ్వడానికి సురక్షితమైన, అందుబాటులో ఉండే ప్రదేశాలను సృష్టించడం చాలా అవసరం. పబ్లిక్ యాక్సెస్ సౌకర్యాలను ఏర్పాటు చేయడం ద్వారా, లోకేషన్ ఆధారిత భద్రతా సమస్యలను పరిష్కరించడం ద్వారా, ప్రభుత్వాలు మహిళల డిజిటల్ చేరికకు మార్గం సుగమం చేస్తాయి.



విద్య ద్వారా సాధికారత

డిజిటల్ యుగంలో మహిళా సాధికారతకు డిజిటల్ అక్షరాస్యత మూలస్తంభం. బాలికలకు డిజిటల్ నైపుణ్యాలు, STEM విద్యను చేర్చడానికి పాఠ్యాంశాలను బలోపేతం చేయడం చాలా ముఖ్యం. మహిళలకు, డిజిటల్ అక్షరాస్యతను పొందడం అనేది విద్య, ఉపాధితో పాటు పౌర సమాజంలో భాగస్వామ్యం కావడం వంటి వివిధ అంశాలలో మరింత స్వాతంత్ర్యం లభిస్తుంది. ఆరోగ్యం, విద్య లేదా వ్యవస్థాపకతలో, లింగ-నిర్దిష్ట సవాళ్లు, అవకాశాలను పరిష్కరించడానికి సాంకేతికత ఒక శక్తివంతమైన ఎనేబుల్‌గా ఉంటుంది. అంతేకాకుండా ఆన్‌లైన్ భద్రతను నిర్ధారించడం కూడా చాలా అవసరం. సైబర్ బెదిరింపు, వేధింపులు, ఆన్‌లైన్ దుర్వినియోగం మహిళలను ఎంతో ప్రభావితం చేస్తాయి. పటిష్టమైన ఆన్‌లైన్ భద్రతాచర్యలు, విద్యా ప్రచారాలను అమలు చేయడం ద్వారా, ప్రభుత్వాలు, టెక్ కంపెనీలు మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని సృష్టించాలి.

ఆవశ్యకతను గుర్తించాలి

డిజిటల్ యుగంలో మహిళలకు సాధికారత కల్పించడం అనేది సాంకేతిక విభజనను తగ్గించడం మాత్రమే కాదు, ఇది మానవాళిని అభివృద్ధి చేయడం కూడా. మహిళలు డిజిటల్‌గా సాధికారత పొందినప్పుడు వారిలో ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి, స్థిరమైన అభివృద్ధికి వారి సమాజాలు కూడా ప్రయోజనం పొందుతాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాలు, వాటాదారులు ఈ సమస్య ఆవశ్యకతను గుర్తించి, డిజిటల్ సమానత్వం వైపు సాహసోపేతమైన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఇది. అలా చేయడం ద్వారా ప్రపంచ జనాభాలో సగం మంది జీవితాలు మాత్రమే మెరుగుపడవు. మొత్తం ప్రపంచాన్ని మరింత సంపన్నమైన, సమానమైన భవిష్యత్తులోకి నడిపిస్తాయి.

డిజిటల్ సమానత్వం కోసం గ్లోబల్ సహకారం

డిజిటల్ సమానత్వ దృక్పథాన్ని గ్రహించడానికి సమన్వయంతో కూడిన ప్రపంచ చర్య అవసరం. ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, టెక్ కంపెనీలు, పౌర సమాజం కలిసి మహిళా డిజిటల్ సాధికారతకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాలి. ఇందులో విధాన సంస్కరణలు, డిజిటల్ పెట్టుబడి, విద్య కార్యక్రమాలు ఉన్నాయి. ఇంకా భాగస్వామ్యాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. డిజిటల్ విప్లవంలో గ్రామీణ మహిళలు, వికలాంగ మహిళలు, ఇతర వెనుకబడిన వర్గాలను చేర్చేందుకు కృషి చేయాలి. ఎవ్వరినీ వదిలిపెట్టకుండా నిజమైన సమ్మిళిత డిజిటల్ భవిష్యత్తును నిర్ధారించాలి.



ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక, పోరాడే శక్తులు, ప్రజలకు స్నేహితులుగా ఉండే వాళ్లతో నడుస్తామని చెప్పారు. మూడోది.. బీజేపీ ఈ దేశాన్ని చిన్నాభిన్నం చేస్తున్నదనీ, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నదనీ, నియంతృత్వ చట్టాలను తీసుకొస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులన్నీ అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ కుబేరులకు కట్టబెడుతున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీని గద్దెదించటం అవసరమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీ బలపడటానికి ప్రయత్నిస్తున్నదని చెప్పారు. ఆ పార్టీ చెప్పినట్టు అధికారంలోకి వచ్చే పరిస్థితి ప్రస్తుతం లేకపోయినప్పటికీ.. గెలవగలిగే రెండు మూడు స్థానాల్లోనైనా.. ఆ పార్టీని గెలవకుండా చేయటమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. బీజేపీ భావాజాలాన్ని ప్రజల మనుసుల్లోనుంచి తొలగించేందుకు వివిధ రూపాల్లో ప్రచారం నిర్వహిస్తామన్నారు. పొత్తుల విషయంలో కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదన్నారు.

అబద్ధాలే మీ ఆయుధాలు

(మొదటిపేజీ తరువాయి)

పొర్లి పొర్లి దండాలు పెట్టినా, పారవు మీ పాచికలు. తప్పవు మీకు శంకరగిరి మాన్యాలు'. అంటూ హెచ్చరించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

వివిధ పార్టీల ముఖ్య నాయకులు, విద్యార్థి జేఏసీ నాయకులు భారీగా కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు.నారాయణపేట జెడ్పీ చైర్‌పర్సన్ వనజ ఆంజనేయులుగౌడ్, మక్తల్ నియోజకవర్గానికి చెందిన సర్పంచులు శివరాం రెడ్డి, నర్సింహులు, మునిస్వామి, బీజేపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రహీం పటేల్, ఉపసర్పంచ్ కృష్ణయ్య గౌడ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కొడంగల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనుచరులు పల్లెగడ్డ వెంకటయ్య, గడ్డం రవి, చందు, నర్సింహులు గౌడ్, మద్దూరు మండలానికి చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ దొడ్ల ఈశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ డి.వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎస్.లింగారెడ్డి, ఎం.యాదగిరి, మాజీ సర్పంచ్ ఏ.సుబ్బారెడ్డి, ఇతర సీనియర్ నాయకులు, పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన ఎంపీటీసీ శ్రీనివాస్, సర్పంచ్ వెంకటేశం, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పలువురు కార్యకర్తలు హస్తం గూటికి చేరారు. సికింద్రాబాద్, తుంగతుర్తి నియోజకవర్గాలకు చెందిన పలువురు కార్యకర్తలు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఓయూ విద్యార్థి నేత కోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ యూనివర్సిటీల విద్యార్థి సంఘాల నేతలు, పరిశోధక విద్యార్థులు కాంగ్రెస్‌లో చేరారు. తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెంచాల సతీష్, ఎస్ఎఫ్ఐ మాజీ ఓయూ అధ్యక్షులు డాక్టర్ మాండ్ల రవి, టీవైఎఫ్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌రాజ్, టీవీఎస్ కాకతీయ యూనివర్సిటీ నాయకులు కూనూరి రంజిత్, టీఎస్‌పీ జేసీ రాష్ట్ర చైర్మెన్ కె. చంద్రశేఖర్, ఇతర విద్యార్థి సంఘాల నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మహువా మొయిత్రాకు వ్యతిరేకంగా సిఫార్సులు

- 7న ఆమోదించనున్న ఎథిక్స్ కమిటీ ముసాయిదా నివేదిక

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాకు వ్యతిరేకంగా సిఫారసుల మధ్య నవంబర్ 7న ఎథిక్స్ కమిటీ ముసాయిదా నివేదికను ఆమోదించనుంది. 15 మంది సభ్యుల కమిటీలో బీజేపీ సభ్యులు మెజార్టీగా ఉన్నారు. ఈ నివేదికలో మహువా మొయిత్రా ప్రవర్తనను తీవ్రంగా పరిగణించే అవకాశం ఉంది. గత సమావేశంలో కమిటీ చైర్మెన్ వినోద్ కుమార్ సోంకర్ తనను అసభ్యకరమైన, వ్యక్తిగత ప్రశ్నలు అడిగారని మహువా మొయిత్రా ఆరోపించిన తరువాత, ఆయన ఆ ఆరోపణలను ఖండించారు.

ఢిల్లీకి గులాములవుదామా?

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ప్రతి ఎన్నికల్లో పార్టీ మారే వ్యక్తి తుమ్మల నాగేశ్వరరావు అని బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. సభలో బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీలు బండి పార్థసారథి రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, బీఆర్ఎస్ సత్తుపల్లి, పాలేరు, మధిర, వైరా నియోజకవర్గాల అభ్యర్థులు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, లింగాల కమల్ రాజ్, బాణోత్ మదన్ లాల్, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మెన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి తెలంగాణ సొత్తు..

కొత్తగూడెం సింగరేణి ప్రకాశం మైదానంలో నిర్వహించిన సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. నల్ల బంగారమైన సింగరేణి తెలంగాణ సొత్తని, చేతకాని కాంగ్రెస్ నాయకుల కారణంగా కేంద్రానికి 49 శాతం వాటా ఇవ్వాల్సి వచ్చిందని, సీతారామ ప్రాజెక్టు పూర్తయితే జిల్లా బంగారు తునక అవుతుందని అన్నారు. రాష్ట్రంలో 134 ఏండ్ల చరిత్ర ఉన్న సింగరేణి పూర్తిగా తెలంగాణ ఆస్తి అని అన్నారు.

తెలంగాణ రాక ముందు సింగరేణి లాభాలు రూ.419 కోట్లు మాత్రమే ఉండేదని, తెలంగాణలో రూ. 2124 కోట్లకు తీసుకు పోయామని తెలిపారు. నూతన నియామకాల వల్ల యువ ఉద్యోగులతో కళకళ లాడుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో డిపెండెంట్ ఉద్యోగాలు తీసి వేసిందని, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 15,256 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించినట్టు చెప్పారు. గని కార్మికుడు చనిపోతే కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చేవారని, ఇప్పుడు రూ.10 లక్షలు ఇస్తున్నామని చెప్పారు. జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని బేరీజు వేసుకొని బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులు 70 శాతం పూర్తయ్యాయని, వచ్చేది మన ప్రభుత్వమేనని మిగిలిన పనులు పూర్తిచేసి తానే ప్రారంభిస్తానని చెప్పారు.

జిల్లాలో 16,769 ఎకరాల పోడు భూములను 4500 మంది గిరిజన కుటుంబాలకు పట్టాలు ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంపీలు నామ నాగేశ్వరరావు. పార్థసారధిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, ఎమ్మెల్యే అభ్యర్థులు వనమా వెంకటేశ్వరరావు, బి.హరిప్రియ, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అబ్బాస్‌తో బ్లింకెన్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించారు. పాలస్తీనా నేత అబ్బాస్‌తో భేటీ విషయాన్ని చివరి నిమిషం దాకా గోప్యంగా ఉంచారు. అక్టోబర్ ఏడు నుండి వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయిల్ దాడులు చేపట్టిన తర్వాత బ్లింకెన్ అబ్బాస్‌తో భేటీ కావడం ఇదే మొదటిసారి.

నెలరోజులైనా ఆగని భీకరదాడులు

ఇజ్రాయెల్-హమాస్ వార్ నెలరోజులకు చేరుకోగా గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగుతున్నాయి. మిలిటెంట్ గ్రూప్ హమాస్ లక్ష్యంగా గాజాపై వైమానిక, భూతల దాడులను ఇజ్రాయెల్ ముమ్మరం చేసింది. గాజాలోని మఘజి క్యాంప్‌పై శనివారం రాత్రి ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా 38 మంది పాలస్తీనీయులు మరణించారని పాలస్తీనా అధికారులు వెల్లడించారు.

గాజా స్ట్రిప్‌పై అణుబాంబు వేసే అవకాశాలను కూడా ఇజ్రాయెల్ పరిశీలిస్తుందని ఇజ్రాయిలీ మంత్రి అమిహై ఎలియహు ప్రకటించడం కలకలం రేపింది.ఈ అంశాన్ని కూడా ఇజ్రాయెల్ పరిశీలిస్తోందని, యుద్ధ నిర్ణయాలను తీసుకునేందుకు ఏర్పాటైన క్యాబినెట్ భద్రతా కమిటీలో తాను సభ్యుడిని కాదని, అయితే గాజాపై అణుబాంబును ప్రయోగించే అవకాశాలు లేకపోలేదని ఆయన చెప్పుకొచ్చారు. మరోవైపు గాజాపై భూతల దాడులు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకూ 2500 హమాస్ టార్గెట్స్‌ను ఇజ్రాయెల్ సైన్యం కూల్చివేసిందని ఐడీఎఫ్ వెల్లడించింది.

మిజోరంలో మణిపూర్ ఎఫెక్ట్



- జాతిహింసతో బీజేపీకి ప్రజల్లో వ్యతిరేకత
- క్రైస్తవ మెజారిటీ రాష్ట్రంలో హిందూత్వంతో ఎదురీత
- ఎన్నికల్లో భంగపాటు తప్పదంటున్న రాజకీయ విశ్లేషకులు

ఇంఫాల్ : ఈ ఏడాది మే 3 నుంచి ఈశాన్య రాష్ట్రం మణిపూర్ జాతి హింసతో తీవ్ర ఆందోళనలు, అలజడులను చూసింది. అక్కడి ప్రజలు ఎంతగానో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు మాత్రం అల్లర్లను కట్టడి చేయలేకపోయింది. పైగా కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారు సైతం హింసను అణచివేయటంలో విఫలమైంది. ఈ అల్లర్లు బీజేపీపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే, దీని ప్రభావం పొరుగున్న ఉన్న రాష్ట్రం మిజోరాంపై సైతం పడిందని చెప్తున్నారు. ముఖ్యంగా, క్రైస్తవులు మెజారిటీగా ఉండే ఈ రాష్ట్రంలో బీజేపీ తీరు ఆందోళనకరంగా ఉన్నదంటున్నారు. హిందూత్వంతో ఇక్కడ తన రాజకీయాన్ని నడపాలనీ, ఎన్నికలలో గట్టెక్కాలని చూస్తున్నదని రాజకీయ విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు.

దాదాపు 87 శాతం క్రిస్టియన్ మెజారిటీ ఉన్న మిజోరంలో బీజేపీకి ఎప్పుడూ గట్టిపోటీనే ఎదురవుతుండగా.. మణిపూర్ జాతి హింస అంశంతో ఇప్పుడు ఆ పార్టీలో గుబులు మొదలైందని అంటున్నారు. మిజోయేతర జనాభా ఎక్కువగా ఉన్న పశ్చిమ, దక్షిణ నియోజకవర్గాల్లోని 40 అసెంబ్లీ స్థానాల్లో 23 నుంచి బీజేపీ పోటీ చేయనున్నది. కనీసం ఐదుగురు బీజేపీ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. " పార్టీ 4-5 సీట్లు గెలుచుకోవాలని భావిస్తున్నది. ఇది హంగ్ అసెంబ్లీ విషయంలో తమను కింగ్‌మేకర్ స్థానంలో ఉంచవచ్చు" అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలు ఢిల్లీ అధిష్టానం పట్ల అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. మిజోరాంలోని మమిత్ జిల్లాలో ప్రధాని మోడీ షెడ్యూల్ చేసిన పర్యటన కూడా అకస్మాత్తుగా రద్దయిన విషయాన్ని గుర్తు చేశారు.

త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో మిజోరం ఒకటి. అయితే, మణిపూర్ అంశం మిజోరంలో తీవ్రంగా ప్రభావం చూపుతుందని బీజేపీ నాయకులు ఆందోళనలో ఉన్నారు. 'మిజోలు బీజేపీని విలన్‌గా భావిస్తున్నారు. పార్టీ క్రైస్తవ వ్యతిరేకమని వారు అనుకుంటున్నారు. ప్రతిపక్షం ఈ కథనాన్ని ఎంతగానో వ్యాప్తి చేసింది. అది ఇప్పుడు మిజోస్ రక్తంలో ఉంది" అని బీజేపీ నాయకుడు అవియా అన్నారు. దీని నుంచి బయటపడటం చాలా కష్టమని తెలిపారు. గత కొన్ని నెలలుగా బీజేపీ అధ్యక్షుడు జెపి నడ్డా, నితిన్ గడ్కరీ వంటి జాతీయ నాయకులు ఎన్నికల ప్రచారం కోసం రాష్ట్రానికి వచ్చారు. అయితే వారెవరూ అటల్ భవన్‌లోని కార్యాలయాన్ని సందర్శించి ఆఫీస్ బేరర్లు, పార్టీ కార్యకర్తలను కలిసే ప్రయత్నం చేయరని అవియా అన్నారు. "లోక్‌సభలో, మిజోరాంలో కేవలం ఒక సీటు మాత్రమే ఉన్నది. కాబట్టి పార్టీ పెద్దలు ఇక్కడ గెలుపు కోసం ఆసక్తితో లేరు. మనం గెలిచినా ఓడినా పట్టింపు లేదు. ఇతర రాష్ట్రాల్లో చాలా ఎక్కువ సీట్లు ఉన్నాయి. కాబట్టి వారు వాటి గురించి ఎక్కువ శ్రద్ధ వహిస్తారు" అని ఆయన తెలిపారు. క్రైస్తవ మెజారిటీ రాష్ట్రంలో హిందూత్వతో కొన్ని సీట్లన్నా గెలవాలని యోచిస్తున్న బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో భంగపాటు ఎదురుకాక తప్పదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

2018 కి మించి..

(మొదటిపేజీ తరువాయి)

యూనిట్లు పనిచేస్తున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో పట్టుబడిన నగదు, ఇతర వస్తువుల విలువ కేవలం రూ.137 కోట్లు మాత్రమే. ఇందులో రూ.125 కోట్ల నగదు ఉంది. మిజోరం శాసనసభలోని 40 స్థానాలకు, ఛత్తీస్‌గఢ్‌లోని 20 నియోజకవర్గాలకు రేపు పోలింగ్ జరుగుతుంది. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలోని మిగిలిన 70 స్థానాలతో పాటు మధ్యప్రదేశ్‌లోని మొత్తం 230 నియోజకవర్గాలకు ఒకే విడతలో ఈ నెల 17న ఎన్నికలు జరుగుతాయి. రాజస్థాన్‌లో 200 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 25న, తెలంగాణలోని 119 స్థానాలకు ఈ నెల 30న పోలింగ్ జరుగుతుంది.

స్వాతంత్ర్య సమరయోధుడికి 40 ఏండ్ల తర్వాత ఫింఛన్

(మొదటిపేజీ తరువాయి)

న్యాయస్థానం రూ.20,000 జరిమానా విధించింది. స్వాతంత్ర్య సమరయోధుల పట్ల వ్యవహరిస్తున్న తీరు, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడి పట్ల భారత ప్రభుత్వ తీరు బాధాకరమని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

ఈ మేరకు జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. "1980 సంవత్సరం నుంచి సింగ్ స్వాతంత్ర్య సైనిక్ సమ్మాన్ పెన్షన్‌ను సంవత్సరానికి 6 శాతం వడ్డీతో 12 వారాల్లోగా విడుదల చేయాలి" అని కేంద్రాన్ని ఆదేశించారు. అంతేకాకుండా, కేంద్రంపై కోర్టు రూ. 20,000 జరిమానా విధించింది. 1985లో బీహార్ ప్రభుత్వం సిఫారసు చేసిన పిటిషనర్ కేసులో భాగమైన సింగ్ పత్రాలను కేంద్రం కోల్పోయిందని కోర్టు పేర్కొన్నది. 1927లో జన్మించిన సింగ్ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. అతను బ్రిటీష్ ప్రభుత్వంచే నిందితుడిగా చేయబడ్డారు. అతను 1982, మార్చిలో స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2017 నవంబర్‌లో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ తన వద్ద సింగ్ రికార్డులు లేవని బీహార్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ కేసును అధికారులు పరిష్కరించకపోవడంతో సింగ్ హైకోర్టును ఆశ్రయించారు.

మంత్రి సబితా గన్‌మెన్ ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గన్‌మెన్ ఏఎస్ఐ ఫాజిల్‌కు ఇద్దరు కూతుర్లు ఉన్నారని, వారి వివాహాలకు అయిన అప్పులతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని తెలిపారు. దాంతో బ్యాంక్ ఆఫ్ బరోడాలో రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారని, గతంలో ఉన్న లోను క్లియర్ చేస్తే రూ.10 లక్షల లోన్ ఇస్తామని చెప్పి రూ.3లక్షలు కట్టించుకొని, ఆ తర్వాత తనకు సర్వీస్ తక్కువగా ఉందని, లోనివ్వటం కుదరదని బ్యాంకు సిబ్బంది చెప్పటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. అనంతరం జూబ్లీహిల్స్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నేడు క్రిమినల్ చట్టాలను మార్చే బిల్లుల ముసాయిదా నివేదికలు ఆమోదం..!

- హోం స్టాండింగ్ కమిటీ భేటీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రస్తుత మూడు క్రిమినల్ చట్టాలను మార్చుతూ తీసుకొచ్చిన మూడు బిల్లులను పరిశీలించిన హోం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ముసాయిదా నివేదికల స్వీకరణకు సోమవారం సమావేశం కానుంది. కొంతమంది ప్రతిపక్ష సభ్యులు ఈ చర్యలను మరింత విస్తృతంగా పరిశీలించడానికి ప్యానెల్ పొడిగించాలని కోరారు. అక్టోబర్ 27న హోం స్టాండింగ్ కమిటీ మూడు ముసాయిదా నివేదికలను అధ్యయనం చేయడానికి మరికొంత సమయం కావాలని ప్రతిపక్ష సభ్యులు ఒత్తిడి చేయడంతో వాటిని ఆమోదించలేకపోయింది. కొంతమంది ప్రతిపక్ష సభ్యులు ప్యానెల్ చైర్‌పర్సన్ బ్రిజ్‌లాల్ పదవీకాలాన్ని మూడు నెలలు పొడిగించాలని, స్వల్పకాలిక ఎన్నికల లాభం కోసం ఈ బిల్లులను బుల్డోజ్ చేయడం ఆపాలని కోరారు.

ఉద్యమాల గడ్డ హుస్నాబాద్



ఇందుర్తిలో సీపీఐ, కాంగ్రెస్‌కు సమభాగం

పునర్విభజనలో బీఆర్ఎస్‌కే మొగ్గు

యువత, మహిళా ఓట్లు కీలకం

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

ఉద్యమాలకు మారుపేరుగా హుస్నాబాద్ గడ్డ ఊపిరి పోసుకున్నది. పేదల కోసం కమ్యూనిస్టులు ఉద్యమాలు చేసిన చరిత్ర హుస్నాబాద్ ప్రాంతానిది. నైజాంకు వ్యతిరేకంగా ఉద్యమానికి నాయకత్వం వహించడం, నాడు సాయుధ పోరాటంలో పోరాడి అమరులయ్యాయిన వారు ఎందరో ఉన్నారు. అలాంటి చైతన్యం కలిగిన ఈ ప్రాంతం ఆది నుంచి కూడా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నది.

స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ ఎన్నికల ప్రచార ప్రస్థానాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించి విజయ దుందుబి మోగించారు. రెండోసారి కూడా అదే ఫార్ములాతో ప్రచారం ప్రారంభించి మరోమారు గులాబీ జెండా ఎగురవేశారు. ఇప్పుడు మూడోసారీ అదే సెంటిమెంట్‌ను ఫాలో అవుతున్నారు. దాంతో రాజకీయ రంగంలో హుస్నాబాద్‌కు ఓ ప్రత్యేకత సంతరించుకున్నది.

ఇందుర్తిలో సీపీఐ, కాంగ్రెస్‌కు సమభాగం

నియోజకవర్గాల పునర్విభజన, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కట్టారు. 15 సార్లు ఎన్నికలు జరగ్గా పునర్విభజనకు ముందు ఇందుర్తి నియోజకవర్గంలో సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మధ్య గట్టి పోటీ ఉండేది. కాంగ్రెస్ 5 సార్లు, సీపీఐ 6 సార్లు విజయం సాధించింది. ఇందుర్తి నియోజకవర్గం ప్రజలు సీపీఐ, కాంగ్రెస్ అభ్యర్థులకు సమభాగంగా విజయాన్ని అందించారు. 2009లో హుస్నాబాద్ నియోజకవర్గ ఏర్పడినప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రవీణ్ రెడ్డి గెలుపొందగా తెలంగాణ ఉద్యమం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థికే ప్రజలు పట్టం కట్టారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ రెండోసారి గెలవడంతో ఇక్కడ కమ్యూనిస్టుల ప్రభావం తగ్గింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య గట్టి పోటీ ఉంటుంది. కాగా, ఈసారి హుస్నాబాద్‌లో యువత, మహిళల ఓట్లు కీలకంగా మారనుంది. నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ పార్టీని గెలిపించి హ్యాట్రిక్ ఇస్తారా.. లేదా కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తారా వేచి చూడాల్సిందే.

మొట్టమొదట హుస్నాబాద్ నుస్తుల్లాపూర్‌లో..

హుస్నాబాద్ నియోజకవర్గం మొట్టమొదట 1952లో నుస్తులాపూర్‌గా నియోజకవర్గంగా ఏర్పడింది. ఈ నియోజకవర్గంలో హుస్నాబాద్, బెజ్జంకి, మానకొండూర్, నుస్తులాపూర్ మండలాలున్నాయి. 1957లో నియోజకవర్గ పునర్విభజనలో ఇందుర్తి నియోజకవర్గం ఏర్పాటు చేశారు. ఉమ్మడి హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, చిగురు మామిడి మండలాలతో ఇందుర్తి నియోజకవర్గం ఏర్పడింది. 2009లో మరొకసారి నియోజకవర్గ పునర్విభజన చేశారు. పునర్విభజనలో ఇందుర్తి నియోజకవర్గంలోని బెజ్జంకి మండలాన్ని మానకొండూరులో కలిపారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలను ఇందుర్తి నియోజకవర్గం లోని ఉమ్మడి హుస్నాబాద్, కోహెడ, చిగురుమామిడి మండలాలతో హుస్నాబాద్ నియోజకవర్గం 2009లో ఏర్పడింది.

సీపీఐ(ఎం) అభ్యర్థులు..

ఖమ్మం నియోజకవర్గం



పేరు : యర్రా శ్రీకాంత్ (60)
తల్లిదండ్రులు : పుల్లయ్య
జన్మస్థలం : ఖమ్మం
నివాసం : శ్రీనివాసనగర్, ఖమ్మం 3 టౌన్
రాజకీయ ప్రస్థానం : 1980లో సీపీఐ(ఎం)లో చేరిక నుంచి వివిధ హోదాల్లో పనిచేశారు. పూర్తికాలం కార్యకర్తగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు.

ముషీరాబాద్ నియోజకవర్గం



అభ్యర్థి పేరు : మద్దెల దశరథం (44)
పుట్టింది : వనపర్తి
తల్లిదండ్రులు : వెంకటయ్య- లక్ష్మి
కుటుంబ నేపథ్యం : వ్యవసాయ ఆధారిత కుటుంబం
నివాసం : గోల్కొండ చౌరస్తా, ముషీరాబాద్
రాజకీయ ప్రస్థానం : ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల్లో చేశారు. 1998 నుంచి సీపీఐ(ఎం) పూర్తికాలం కార్యకర్త. గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శివర్గ సభ్యులు, ముషీరాబాద్ నియోజవకవర్గం కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

వైరా అసెంబ్లీ నియోజకవర్గం



పేరు : భూక్యా వీరభద్రం (41)
తల్లిదండ్రులు : కమలమ్మ - సామ్యా నాయక్
జన్మస్థలం : కస్నాతండా, ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం జిల్లా
నివాసం : వైరా, సుందరయ్య నగర్ (వైరా నియోజకవర్గం)
రాజకీయ ప్రస్థానం : సీపీఐ(ఎం) పార్టీలో పూర్తికాలం కార్యకర్త, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్నారు. పోడు రైతులకు హక్కు పత్రాలు ఇప్పించడంలో కీలకపాత్ర పోషించారు. బంజారా పోరుబాట పాదయాత్రలో 60 రోజుల పాటు 500 తండాల్లో 1261 కిలో మీటర్లు పాదయాత్ర నిర్వహించారు.

మధిర నియోజకవర్గం



పేరు : పాలడుగు భాస్కర్
తల్లిదండ్రులు : చిన్న వెంకయ్య, వెంకటమ్మ
సొంతూరు : గార్ల, ఇల్లెందు నియోజకవర్గం
రాజకీయ ప్రస్థానం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. కాలేజీ సమయంలో ఎస్ఎఫ్ఐలో చేరారు. గార్ల మండల ప్రజాశక్తి దినపత్రిక విలేఖరిగా పనిచేశారు. ఈ సమయంలోనే సీపీఐ(ఎం), సీఐటీయులో చురుకైన పాత్ర నిర్వహించారు. 1999లో గార్ల పిఏసిఎస్ చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. కేవీపీఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీకి ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు.

పాలేరు నియోజకవర్గం



పేరు : తమ్మినేని వీరభద్రం (69)
తల్లిదండ్రులు : కమలమ్మ-సుబ్బయ్య
పుట్టింది : తెల్దారుపల్లి గ్రామం, ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం జిల్లా.

రాజకీయ ప్రవేశం : 1971లో సీపీఐ(ఎం)లో చేరారు. ఖమ్మం డివిజన్, ఖమ్మం జిల్లా యువజనోద్యమ నిర్మాణానికి కృషి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా అనేక ఉద్యమాలు, పోరాటాలకు నాయకత్వం వహించారు. 1985లో ఖమ్మం డివిజన్ కార్యదర్శిగా, 1990లో జిల్లా తాత్కాలిక కార్యదర్శిగా, 1991లో జిల్లా కార్యదర్శిగా ఎన్నికై 1996 వరకు పని చేశారు. తిరిగి 2001లో జిల్లా కార్యదర్శిగా రెండోసారి ఎన్నికయ్యారు. 1986లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, 1990 నుంచి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా, 1999 నుంచి కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై కొనసాగుతున్నారు. 100 రోజులు 2,662 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం కోసం 2016 అక్టోబర్ 17నుంచి మహాజన పాదయాత్ర 2017 మార్చి వరకు సుమారు 5 నెలలు రాష్ట్ర వ్యాప్తంగా 4,200 పైచిలుకు కి.మీ.లు పాదయాత్ర నిర్వహించారు.

ప్రజాప్రతినిధిగా అనుభవం : 1991లో మొదటిసారిగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీచేసి స్వల్పతేడాతో ఓటమిచెందారు. 1996లో పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయ్యారు. 2004లో ఖమ్మం అసెంబ్లీ స్థానం నుంచి గెలిచారు.

భద్రాచలం



పేరు : కారం పుల్లయ్య (38)
చదువు : పదవ తరగతి
తల్లితండ్రులు : మహాలక్ష్మి, ముత్తయ్య
పుట్టిన స్థలం : మారాయి గూడెం, దుమ్ముగూడెం మండలం, భద్రాద్రి జిల్లా

పార్టీలో ప్రస్తుత బాధ్యతలు : సీపీఐ(ఎం) దుమ్ముగూడెం మండల కార్యదర్శి, భద్రాచలం నియోజకవర్గం కో కన్వీనర్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శిగా చేస్తున్నారు.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం



అభ్యర్థి పేరు : పగడాల యాదయ్య (55)
తల్లిదండ్రులు : పగడాల రాములు- వెంకటమ్మ

రాజకీయ ప్రస్థానం : సీపీఐ(ఎం)లో వివిధ హోదాల్లో పనిచేశారు. డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, వృత్తి సంఘాలు, జీఎంపీఎస్ సంఘంలో బాధ్యతలు చేపట్టారు. పీఏసీఎస్ చైర్మెన్‌గా, మంచాల ఎంపీపీగా, జెడ్పీటీసీగా, 2014, 2018లో సీపీఐ(ఎం) ఎమ్మెల్యేగా అభ్యర్థిగా పోటీ చేశారు.



అశ్వరావుపేట

పేరు : పిట్టల అర్జున్ (48)
తండ్రి : నాగులు
గ్రామం : సీతమ్మ

రాజకీయ ప్రస్థానం : 1994లో విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐలో పని చేశారు. 2021 నుంచి 2011 వరకు సీపీఐ(ఎం) దమ్మపేట మండల కార్యదర్శిగా పని చేశారు.



సత్తుపల్లి

పేరు : మాచర్ల భారతి (60)
తల్లిదండ్రులు : మన్యం దేవానందం - నాగరత్నం
జన్మస్థలం : గార్ల,మహబూబాబాద్ జిల్లా
నివాసం : ఖమ్మం

రాజకీయ ప్రస్థానం : సీపీఐ(ఎం)లో పూర్తికాలం కార్యకర్త, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు



జనగామ నియోజకవర్గం

అభ్యర్థి పేరు : మోకు కనకా రెడ్డి (49)
తండ్రి : యాదవరెడ్డి
పుట్టిన ఊరు : నాగపురి, చేర్యాల మండలం

రాజకీయ ప్రస్థానం : ఎస్ఎఫ్ఐ జనగామ డివిజన్ కార్యదర్శిగా, డీవైఎఫ్ఐ, సీఐటీయూ, రైతు సంఘంలో చేశారు. ప్రస్తుతం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శిగా ఉన్నారు.

మిర్యాలగూడ నియోజకవర్గం



అభ్యర్థి పేరు : జూలకంటి రంగారెడ్డి (68)
తల్లిదండ్రులు : జూలకంటి కాశిరెడ్డి, లక్ష్మమ్మ
పుట్టిన ఊరు : కొత్తగూడెం, తిప్పర్తి మండలం
ప్రజా ప్రాతినిధ్యం : 1987 నుంచి 1992 వరకు మిర్యాలగూడ మున్సిపల్ వైస్ చైర్మెన్, 1994, 2004, 2009 మూడు పర్యాయాలు మిర్యాలగూడ ఎమ్మెల్యేగా..

పార్టీలో ప్రాతినిధ్యం : 1978లో సీపీఐ(ఎం)లో చేరిక. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడుగా, సీఐటీయూ జిల్లా అధ్యక్షునిగా, జిల్లా కార్యదర్శిగా, ప్రస్తుతం సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పనిచేస్తున్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉన్నారు.

నకిరేకల్ నియోజకవర్గం



అభ్యర్థి పేరు : బొజ్జ చినవెంకులు (55)
తల్లిదండ్రులు : బొజ్జ రామచంద్రయ్య, మరియమ్మ
కుటుంబం : వ్యవసాయ కుటుంబం, కేతపల్లి మండలం, ఇనుపాముల గ్రామం.

రాజకీయ ప్రస్థానం : ఎస్ఎఫ్ఐ, రైతు సంఘం, వ్యవసాయకార్మిక సంఘం నేతగా పనిచేశారు. ఇనుపాముల గ్రామ సర్పంచ్‌గా, పీఏసీఎస్ చైర్మెన్‌గా, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులుగా ఉన్నారు.

భువనగిరి నియోజకవర్గం



అభ్యర్థి పేరు : కొండమడుగు నర్సింహ (48)
తల్లిదండ్రులు : కొండమడుగు సాయమ్మ, బాలయ్య
గ్రామం : ముత్తిరెడ్డిగూడెం, భువనగిరి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా.

రాజకీయ ప్రస్థానం : ఎస్ఎఫ్ఐలో వివిధ కమిటీల్లో పని చేశారు. ప్రజానాట్యమండలి ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిగా పనిచేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా, 2018లో రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా ఉన్నారు.

పటాన్‌చెరు నియోజకవర్గం



అభ్యర్థి పేరు : జొన్నలగడ్డ మల్లికార్జున్ (59)
తల్లిదండ్రులు : జొన్నలగడ్డ కనకదుర్గమ్మ- సత్యనారాయణ
వృత్తి : 1985 నుంచి (విడియ పరిశ్రమల) ఇప్పటి శాండివిక్ పరిశ్రమలో కార్మికుడిగా, 1989 నుంచి ఆల్విన్ వాచ్ పరిశ్రమలో కార్మికుడిగా 2000 వరకు పనిచేశారు.

తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులుగా కొనసాగుతున్నారు.

రాజకీయ నేపథ్యం : 1979లో విద్యార్థి సంఘం నాయకుడిగా చేశారు. 2000 నుంచి సీపీఐ(ఎం) పూర్తి కాలం కార్యకర్తగా పని ప్రారంభం.. సీఐటీయూ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉన్నారు. పటాన్ చెరువు పారిశ్రామిక ప్రాంతంలోని పాశం మైలారం, పటాన్‌చెరువు, రామచంద్రపురం, బొల్లారం తదితర పరిశ్రమల్లో కార్మిక సంఘం అధ్యక్షునిగా కొనసాగుతున్నారు.

పంచ్ తంత్రం!



పదవేది లేకుంటే పనికిరాదనుమాట
అన్నిపార్టీలను అల్లుకొనియే
ఎన్నికల్లోగెల్పు ఏకైక లక్ష్యమై
గ్రూపులన్నింటినో ట్రూపుజేసే
ప్రజలకై నిలుచుట ప్రజలకై నడుచుట
సకలపార్టీలలో సంకనాకె
ఏపార్టీ గెలుచునో ఆపార్టీ గొడుగుకై
అవురు మనుటకాలస్యమేది
ఎన్ని గుంపులు ముందున్ననేమీ ఫలము
ఎన్నికల చాట దులిపిన వెన్నువెంట
అందరధికార పార్టీకే అమ్ముడైరి

- ఏనుగు నరసింహారెడ్డి

ఆదర్శ కమ్యూనిస్టు కొండిగారి

- రెండు సార్లు ఎమ్మెల్యే అయినా సాధారణ జీవితం
- ప్రజావేదికేదైనా సామెతలతో రక్తి కట్టించే ప్రసంగం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

కొండిగారి రాములు నిస్వార్థానికి నిలువుటద్దం. కమ్యూనిస్టు ఆదర్శాలను ముందుకు తీసుకుపోవడమే కర్తవ్యం. పుచ్చలపల్లి సుందరయ్యనే స్ఫూర్తి. రెండుసార్లు ఎమ్మెల్యే అయినా ప్రజల మినిషిగా సాధారణ జీవితం గడుపుతున్నారు. ఆయన జీవితంపై రాజకీయాలకు అతీతంగా ఎవరూ వేలెత్తి చూపే వారు కాదు. కొండిగారిలా బతకడం సాధ్యం కాదంటారు. ప్రజల మనిషిగా ముందుకు సాగుతున్నారు.

రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలో కొండిగారి రాములు జన్మించారు. ఆయన తండ్రి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా పని చేశారు. రాములు బాల్యంలో 1952లో పంచాయతీ సమితి ఎన్నికల్లో ఆయన తండ్రి కనకయ్య వార్డు సభ్యుడిగా పోటీ చేశారు. అంతకుముందు తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. కమ్యూనిస్టు పార్టీలో ఆయన తండ్రి పని చేస్తున్నారని అప్పటి దొరలు కొండిగారి రాములుపై కక్షగట్టారు. 9వ తరగతిలోనే చురుకైన కార్యకర్తగా వ్యవహరించడంతో పాఠశాల నుంచి తొలగించాలని అధికారులకు లేఖ రాశారు. అతనిలో కమ్యూనిస్టు భావజాలం ఉందని పాఠశాల నుంచి పంపించారు. చదువు మానేశాక 14 ఏటనే అసెంబ్లీ ఎన్నికల్లో పీడీఎఫ్ తరఫున పిలాయిపల్లి పాపిరెడ్డికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. అదే స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. కుటుంబ పోషణకు వ్యవసాయ, కూలీ పనులు చేస్తూనే పార్టీ కోసం పని చేశారు. ఈ తరుణంలో 1989లో శాసన సభ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థిగా భారీ మెజార్టీతో విజయం సాధించారు. 1994లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. మొదటిసారి ఎన్నికల్లో మొత్తం రూ.88వేలు, రెండోసారి ఎన్నికల్లో రూ.3 లక్షలు పార్టీ విరాళాలు సేకరించి ఖర్చు చేసింది.

ఆణిముత్యాలు..

భూ పోరాటాలకు పదును..

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భూపోరాటాలకు పదును పెట్టారు. అప్పట్లో అసైన్‌మెంట్ కమిటీ చైర్మెన్‌గా స్థానిక ఎమ్మెల్యేలకే హక్కు ఉండేది. దీంతో నియోజకవర్గంలోని నిరుపేదలకు భూములు పంపిణీ చేయాలని సంకల్పించారు. తద్వారా కొండిగారి రాములు ఆధ్వర్యంలో 20 వేల ఎకరాలను పేదలకు పంచి పట్టాలు ఇచ్చారు. బావుల నిర్మాణం, రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల అందజేత, బస్సు డిపో నిర్మాణం, ప్రతి గ్రామానికీ బస్సులు, ఇబ్రహీంపట్నంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆయన సారథ్యంలోనే వచ్చాయి. ఆ భూములనే నేడు ప్రభుత్వం సెజ్‌లు, కంపెనీల పేరుతో వెనక్కి తీసుకుంటోంది. ప్రస్తుతం ఎమ్మెల్యేలకు లక్షల్లో జీతాలుంటే.. అప్పట్లో కొండిగారి రాములు మొదట ఎమ్మెల్యేగా చేసినప్పుడు రూ.7,500 జీతం వచ్చేది. ప్రస్తుతం ఆయనకు వచ్చే పింఛన్‌తోనే నిరాడంబర జీవితం గడుపుతున్నారు.. ఆయన నేటి తరం నేతలకు ఆదర్శప్రాయం.

ఎన్నికల ఖర్చు రూ.88 వేలే..

1989లో ఎన్నికల ఖర్చు రూ.88వేలు మాత్రమే. 1994లో రూ.3 లక్షలు ఖర్చు మాత్రమే. ఆ డబ్బు కూడా పార్టీ విరాళాలు సేకరించి ఖర్చు చేసిందే. అప్పట్లో గోడల మీద రాతలు, నాయకులు గ్రామాల్లో కాలినడకన తిరుగుతూ ప్రచారం చేసేవారని గుర్తు చేస్తుంటారు పార్టీ శ్రేణులు.



సుందరయ్య ఆదర్శం..

ఆదర్శమూర్తి, మార్గదర్శకుడు పుచ్చలపల్లి సుందరయ్యనే రాములుకు ఆదర్శం. ఆయనంటే పిచ్చి అభిమానం. ఆ దారిలోనే హంగూ ఆర్భాటాలకు పోకుండా సాధారణ జీవితానికి అలవాటు పడ్డారు. త్యాగధనుడు సుందరయ్య బాటలోనే నడవాలని తపించారు. అదే బాటలో నడుస్తున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



ఇజ్రాయిల్ ఆటవిక యుద్ధాన్ని ఆపాలని కోరుతూ జకార్తాలోని నేషనల్ మాన్యుమెంట్ వద్ద భారీ ర్యాలీ

పాలస్తీనాకు సంఘీభావంగా

ప్రపంచ వ్యాపితంగా ర్యాలీలు

- వాషింగ్టన్‌లో వైట్ హౌస్ ఎదుట భారీ ప్రదర్శన
- జకార్తాలో పోటెత్తిన జన సంద్రం

వాషింగ్టన్/ జకార్తా: గాజాలో గత నెల రోజులుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని ఆపాలని కోరుతూ శని, ఆది వారాల్లో భారీ ర్యాలీలు ప్రపంచవ్యాపితంగా జరిగాయి. అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసిలో వైట్ హౌస్ ఎదుట శనివారం వేలాది మందితో పాలస్తీనా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఇజ్రాయిల్ అనాగరిక దాడుల్లో గత 30 రోజుల్లో పది వేల మంది దాకా చనిపోయారు. వీరిలో మహిళలు, పిల్లలే అధికం. ఇజ్రాయిల్ ఊచకోత యథేచ్ఛగా సాగుతున్నా దీనిని ఆపేందుకు అమెరికా ససేమిరా అంటోందని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలస్తీనాలో కనివిని ఎరుగని రీతిలో సాగుతున్న మారణహోమానికి బైడెనే కారణమని నిందించారు. 'బైడెన్ బైడెన్ యు కాంట్ హైడ్' (బైడెన్ బైడెన్ నువ్వు దాక్కోలేవు) అంటూ వారు బిగ్గరగా నినదించారు. గాజాలో ఇజ్రాయిల్ అదే పనిగా సాగిస్తున్న బాంబు దాడులు జాతి ప్రక్షాళనకు దారితీసే ప్రమాదముందని ఐరాస నిపుణులు హెచ్చరించారు. ఇండోనేషియా, పాకిస్తాన్, భారత్‌తో తదితర దేశాల్లోనూ పాలస్తీనాకు సంఘీభావంగా పీపుల్స్ మార్చ్‌లు జరిగాయి.జకార్తాలో జాతీయ స్మృతి చిహ్నం వద్ద బ్రహ్మాండమైన ర్యాలీ నిర్వహించారు.



పాలస్తీనాకు సంఘీభావంగా వాషింగ్టన్‌లో వైట్ హౌస్ ఎదుట వేలాది మంది అమెరికన్ల ర్యాలీ

రాజస్థాన్‌లో బీజేపీ ఐదో జాబితా

జైపూర్: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బీజేపీ తన ఐదో జాబితాను ఆదివారం విడుదల చేసింది. ఈ జాబితాలో 15 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. మావ్లీ (ఉదయ్‌పుర్) నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మనారాయణ్‌ను కాదని, ఆయన స్థానంలో కేజీ పలివాల్‌ను బరిలోకి దింపింది. సివిల్ లైన్స్ నుంచి గోపాల్ శర్మ, ఆదర్శనగర్ నుంచి రవి నాయ్యర్‌లకు టికెట్లు కేటాయించింది. వీరు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే మొదటిసారి. ఈ నెల 2న మూడో జాబితాలో మాజీ మంత్రి దేవీసింగ్ భాటి కోడలు పూనమ్ కన్వర్ భాటికి కొలాయత్ నియోజకవర్గ టికెట్ కేటాయించింది. ఆదివారం జాబితాలో ఆ పేరును తొలగించి.. ఆమె కుమారుడు అంశుమాన్ సింగ్ భాటికి అవకాశం ఇచ్చింది. రాజస్థాన్‌లో మొత్తం 200 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇప్పటివరకు బీజేపీ 198 మంది పేర్లను ప్రకటించింది. సోమవారంతోనే నామినేషన్ల గడువు ముగియనుంది.

కేసీఆరే మళ్లీ సీఎం

- బీఆర్ఎస్ ఎన్నారై విభాగం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్‌పార్టీ విజయం సాధిస్తుందనీ, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని భారత రాష్ట్ర సమితి ఎన్నారై యూఎస్ఏ విభాగం కో ఆర్డినేటర్ తన్నీరు మహేశ్ అన్నారు. యూఎస్ఏ లోని డెలవేర్ రాష్ట్రంలో చార్లెస్ ఈ ప్రైస్ మెమోరియల్ పార్క్‌లో 'గులాబీల జెండలే రామక్క' అనే పాటను టెస్ల లైట్ షో ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి తెలంగాణ మోడల్ అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్లోబల్ డిజిటల్ మీడియా కో ఆర్డినేటర్ మహేష్ బీగాల, బాస్కర్ పిన్నా తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టంలో ఆ భాగాన్ని కొట్టివేయలేం

- నోటీసు ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ
- జనగణన తర్వాతే అమల్లోకి...

న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ చట్టంలోని ఓ భాగాన్ని కొట్టివేయడం కష్టమని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. జనగణన తర్వాతే ఈ చట్టం అమలులోకి వస్తుందని తెలిపింది. సార్వత్రిక ఎన్నికల లోగా లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత జయ ఠాకూర్ దాఖలు చేసిన పిటిషన్‌పై నోటీసు జారీ చేసేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ పెండింగులో ఉన్నదని, ఠాకూర్ అభ్యర్థనను ఈ నెల 22న పరిశీలిస్తామని న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, ఎస్‌వీఎన్ భట్టితో కూడిన బెంచ్ తెలిపింది. ఠాకూర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినేందుకు సుప్రీం బెంచ్ నిరాకరించింది.

మధ్యప్రదేశ్‌లో 35 మంది బీజేపీ నేతలపై వేటు

- బుజ్జగింపు ప్రయత్నాలు విఫలం తరువాతే బహిష్కరణ

న్యూఢిల్లీ బ్యూరో : మధ్యప్రదేశ్‌లో 35 మంది బీజేపీ నేతలపై వేటు పడింది. బుజ్జగింపు ప్రయత్నాలు విఫలం తరువాతే బహిష్కరణ జరిగింది. తిరుగుబాటుదారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ, పార్టీ అధికారిక అభ్యర్థులకు వ్యతిరేకంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న 35 మంది నేతలను బీజేపీ సస్పెండ్ చేసింది. సస్పెండ్ చేయబడిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది చంబల్, బుందేల్‌ఖండ్, మాల్వా-నిమార్ ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. వేటు పడిన జాబితాలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. మొరెనా నుంచి మాజీ మంత్రి రుస్తోమ్ సింగ్, తికమ్‌గఢ్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కేకే శ్రీవాస్తవ్, బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు నందకుమార్ చౌహాన్ కుమారుడు హర్షన్ వర్ధన్ చౌహాన్, సిద్ధి నుంచి బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కేదార్‌నాథ్ శుక్లా తదితరులను పార్టీ సస్పెండ్ చేసింది. తిరుగుబాటు నేతలను శాంతింపజేసేందుకు కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్ సహా పలువురు సీనియర్ నేతలు రంగంలోకి దిగారు. చాలా వరకు విఫలమయ్యారు. మధ్యప్రదేశ్‌లో మూడు రోజుల పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తిరుగుబాటుదారులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు.

జాతీయ రహదారి బాధిత ఆదివాసీలకు నష్టపరిహారం ఇప్పించాలి

- ఏపీ సీఎంకు సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి లేఖ

అమరావతి : జాతీయ రహదారి నెంబరు 516ఇ విస్తరణ కోసం ధ్వంసం చేసి, స్వాధీనం చేసుకున్న భూములకు సంబంధించి ఆదివాసీలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీ(ఐ)ఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. విజయనగరం నుంచి రాజమండ్రి వరకు జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 156ఇ) నిర్మాణానికి ప్రభుత్వం అనుమతినిచ్చిందని, దీనికోసం అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు, జి మాడుగుల, జికెవీధి, కొయ్యూరు, రాజవొమ్మంగి మొత్తం 11 మండలాల్లో రహదారి నిర్మాణ పనులను గుత్తేదారు ప్రారంభించి 30 శాతం పూర్తి చేశారని తెలిపారు. ముఖ్యంగా జిరాయితీ పట్టా భూమి, అటవీ పోడు భూములు కలిపి సుమారు 50 ఎకరాలు రహదారికి ఇరువైపులా ధ్వంసం చేశారని, ఆదివాసీలకు అటవీ పోడు భూములే ప్రధానమైన జీవనాధారమని పేర్కొన్నారు. కాఫీ తోటలు, వరి, రాజ్‌మా చిక్కుడు, పసుపు పంట సుమారు 1500 మంది సాగుచేస్తున్నారని తెలిపారు. 2005వ సంవత్సరానికన్నా ముందు అటవీ ప్రాంతంలో జీవిస్తున్న, సాగుచేస్తున్న ఆదివాసీలకు వ్యక్తిగత, ఉమ్మడి అటవీ యాజమాన్యపు హక్కును కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. పదెకరాలకు తక్కువ లేకుండా వ్యక్తిగత అటవీహక్కు పత్రాలు జారీచేయాల్సిన అధికారులు హక్కు పత్రాలు లేవని మాయమాటలు చెప్పి బలవంతంగా లాక్కొన్నారని, తాగునీరు పైపు, గ్రామ ఆలయాన్ని కూడా ధ్వంసం చేశారని వివరించారు.

బీజేపీపై యువనేతల ఆగ్రహం

- టికెట్ల కేటాయింపుపై తీవ్ర అసంతృప్తి
- అవకాశవాదులకు సీట్లివ్వడంపై ప్రశ్నిస్తున్న వైనం
- పార్టీ కోసం పనిచేస్తున్నా పట్టించుకోకపోవడంపై నిలదీత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో బీజేపీ క్షేత్రస్థాయిలో ఎంతోకొంత పునాది వేసుకున్న దంటే దానికి యువతే కారణం. ఇప్పుడు ఆ యువతే బీజేపీ నాయకత్వంపై తిరగబడుతున్నది. టికెట్ల కేటాయింపులో తమకు జరుగుతున్న అన్యాయంపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నది. పార్టీ ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తున్న తమనే పట్టించుకోకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. అవకాశవాదులకు సీట్లివ్వడంపై ప్రశ్నిస్తున్నది.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీలో యువ నాయకులకు కనీసం 10 శాతం టికెట్లు ఇవ్వాలనే డిమాండ్‌ను బీజేవైఎం తెరపైకి తెచ్చింది. కానీ, రాష్ట్ర నాయకత్వం దీన్నేం పట్టించుకోలేదు. బీజేపీ భావజాలంతో సంబంధం లేని వారికి టికెట్లు కేటాయిస్తూ పోతున్నది. విద్యార్థి విభాగం నుంచి క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని యువతలో ఎక్కిస్తూ బీజేపీని బలోపేతం చేస్తున్న తమకు పార్టీలో ప్రాధాన్యత ఎందుకివ్వడం లేదని రాష్ట్ర నాయకత్వాన్ని యువనాయకులు ప్రశ్నిస్తున్నారు. టికెట్ కోసం ఆశపడి వస్తున్నవారికి ప్రాధాన్యత ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. సిద్ధాంత భావజాలం లేకుండా తమ అవసరం కోసం పార్టీలోకి వచ్చే వారు ఎన్నికలు అయిపోగానే తమ దారి తాము చూసుకుంటారనీ, అలాంటి వారికి సీట్లు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఓడినా, గెలిచినా పార్టీ కోసం కష్టపడి పనిచేసేది యువమోర్చా నాయకులే అని తేల్చిచెబుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీ యువ నేత రాకేశ్‌రెడ్డి రాజీనామా చేసిన విషయం విదితమే. భావోద్వేగాలను రెచ్చగొట్టి యువతను ఆకర్షిస్తున్న బీజేపీ..రాజకీయంగా వాడకుంటున్నదని ఆయన స్వయంగా ఆరోపిస్తున్న విషయం విదితమే. ఒక్క తేజస్వీ సూర్యను ఎంపీగా చేసి దేశానికంతా ఆయన్నే చూపుతున్నదనీ, ఆయన తప్ప పార్టీల్లో యువకులెవ్వరూ లేరా? అని పార్టీని కడిగిపారేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర నాయకత్వం తీరుపై గోషామహల్ సీటు ఆశించిన విక్రమ్ గౌడ్ కూడా ఆగ్రహంతో ఉన్నారు.

ముషీరాబాద్ టికెట్ రాకపోవడంతో దత్తాత్రేయ బిడ్డ బండారు విజయలక్ష్మి కూడా అలిగి కూర్చున్నది. బీజేపీ యువ నేతలు గడీల శ్రీకాంత్‌గౌడ్, సింగాయపల్లి గోపి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు కూడా పార్టీ నేతల తీరుపై ఆగ్రహంతో ఉన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి టికెట్‌ను బీజేవైఎం నేతలు భానుప్రసాద్, సాయి ఆశిస్తున్నారు . ఇప్పటి వరకూ ఆ స్థానంలో అభ్యర్థినే ప్రకటించలేదు. పొత్తుల్లో భాగంగా చివరి జాబితాలో ఆ సీటును జనసేనకు కేటాయించబోతున్నారనే ప్రచారంతో వారిద్దరూ అలర్ట్ అయ్యారు. పార్టీ ఎదుగుదలలో యువనాయకత్వం కృషిని జాతీయస్థాయి నాయకులకు వివరించి సీటు తెచ్చుకునే పనిలో వారిద్దరూ ఎవరికివారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకవేళ టికెట్ దక్కకపోతే వారు పార్టీకి దూరమయ్యే అవకాశం కూడా ఉందనే చర్చ మొదలైంది.

అవినీతిని అంతం చేయాలి

- రైల్వే చీఫ్ విజిలెన్స్ అఫీసర్ అర్వింద్ మళ్ఖేడే

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అవినీతిని అంతం చేసేందుకు ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ విజిలెన్స్ అఫీసర్ అర్వింద్ మళ్ఖేడే అన్నారు. అవినీతికి పాల్పడినా, ప్రలోభపెట్టినా నేరమేననీ, దేశ భవిష్యత్ నిర్దేశకులు ప్రభుత్వ ఉద్యోగులేననీ, వారు అవినీతికి దూరంగా ఉంటే, ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవల్ని అందించగలుగుతామని అభిప్రాయపడ్డారు. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా ఉద్యోగులు నిర్వహించిన అవగాహనా ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అవినీతికి కారణాలు, అవినీతి పద్ధతులు, వాటిని అరికట్టే విధానాలపై ఉద్యోగులకు విశదీకరించారు. అనంతరం 'నుక్కడ్' అనే నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో హైదరాబాద్ డివిజన్ ఏడీఆర్ఎం/ఆపరేషన్స్ ఎం.కోటేశ్వరరావు, ఏడీఆర్ఎం/ఇన్ఫ్రా ఎంఏ రెహ్మాన్,





సీనియర్ డి.సి.యం. వై బాలాజీ కిరణ్, సీనియర్ డి.ఇ.ఇ. కే కిరణ్ కుమార్, సీనియర్ డి.యం.ఇ. జీషన్ అహ్మద్, డి.పి.వో/కో-ఆర్డినేషన్ ఎ.జె.వి.ప్రకాష్ కుమార్, డి.ఇ.యన్/ఎస్టేట్ శశాంక్ యాదగిరి, స్టేషన్ డైరెక్టర్/కాచిగూడ కే బాలాజీ, ఎ.డి.ఇన్.హెచ్.యమ్. బాబులు, ఎ.డి.ఇ.యన్./ఎస్టేట్ బి.రాము, స్టేషన్ మేనేజర్/కాచిగూడ ఆర్.బి.మీనా తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తత

- సమ్మెలో ఉన్న గార్మెంట్ ఫ్యాక్టరీలను తెరిచిన పోలీసులు
- కార్మికులపై రబ్బరు బుల్లెట్లు, టియర్ గ్యాస్ ప్రయోగం



ధాకా : బంగ్లాదేశ్‌లో కార్మికుల సమ్మె కారణంగా మూత పడిన గార్మెంట్ ఫ్యాక్టరీలను పోలీసులు తెరవడంతో ఉద్రికత్త పరిస్థితులు నెలకున్నాయి. గార్మెంట్ ఫ్యాక్టరీలను తెరవకుండా పోలీసుల చర్యలను కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. విధుల్లోకి వెళ్లకుండా తోటి కార్మికులను కార్మికులు అడ్డుకోవడంతో పాటు ఆందోళనలకు దిగారు. దీంతో కార్మికులను చెదరగొట్టడానికి వారిపై పోలీసులు రబ్బరు బుల్లెట్లు, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ధాకాకు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీపూర్ వద్ద 35 ఏళ్ల మహిళ తీవ్రంగా గాయపడింది. కాగా, కొన్ని ప్రాంతాల్లో కార్మికులు ఫ్యాక్టరీలకు నిప్పు అంటించారని, లూటీలకు పాల్పడ్డారని పోలీసులు ఆరోపిస్తున్నారు.

వేతనాలను కనీసం మూడు రెట్లు పెంచాలని డిమాండ్‌తో కొన్ని రోజుల నుంచి బంగ్లాదేశ్‌లోని గార్మెంట్ కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో వారం రోజుల నుంచి గార్మెంట్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో పోలీసులు వాటిని తెరిచారు. కార్మికులు దీనిని తీవ్రంగా ప్రతిఘటించారు. 'బ్రాండ్లు, రిటైలర్ల లాభం గురించి మాత్రమే ప్రభుత్వం శ్రద్ధ పెడుతుంది. కార్మికుల శ్రేయస్సు లేదా కార్మికులు అర్ధాకలితో ఉన్నారనే వాస్తవాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు' అని బంగ్లాదేశ్ గార్మెంట్ అండ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కల్పోనా అక్తర్ ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల నుంచి సాగుతున్న సమ్మెతో కొన్ని ప్రపంచ అగ్రశ్రేణి ఫ్యాషన్ బ్రాండ్‌ల ఉత్పత్తికి అంతరాయం కలిగిందని, దీంతో పోలీసులు రంగంలోకి దిగారని ఆరోపించారు.

జీవన వ్యయాలు విపరీతంగా పెరిగిపోవడంతో కుటుంబాన్ని పోషించ లేక ఇబ్బందులు పడుతున్నామని గార్మెంట్ కార్మికులు చెబుతున్నారు.

సమ్మెతో ఫ్యాక్టరీ యజమానులకు ప్రాతినిధ్యం వహిస్తున్న బంగ్లాదేశ్ గార్మెంట్ తయారీదారులు, ఎగుమతిదారుల సంఘం (బిజిఎంఇఎ) కార్మికులకు 25 శాతం వేతన పెంపును అందించింది. అయితే ఇది కార్మికులు డిమాండ్ చేస్తున్న కోరిన 23,000 టాకాల (209 అమెరికా డాలర్లు) నెలవారీ వేతనం కంటే ఇది చాలా తక్కువగా ఉంది.

బంగ్లాదేశ్‌లో సుమారు 3,500 గార్మెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. దక్షిణాసియా నుంచి ఎగుమతయ్యే మొత్తం ఎగుమతుల్లో 85 శాతం వాటాను ఈ ఫ్యాక్టరీలు కలిగి ఉన్నాయి. గ్యాప్, వాల్‌మార్ట్, హెచ్‌అండ్ ఎం, జారా, ఇండిటెక్స్, బెస్ట్ సెల్లర్, లెవీస్, మార్క్స్ అండ్ స్పెన్సర్, ప్రిమార్క్ ఆల్డి వంటి ప్రపంచ ప్రముఖ బ్రాండ్ల యూనిట్లు బంగ్లాదేశ్‌లో ఉన్నాయి. అయితే కార్మికుల పని పరిస్థితులు చాలా భయంకరంగా ఉన్నాయి. ఇక్కడ కనీస నెలసరి వేతనాలు 8,300 టాకా (75 డాలర్లు) నుండి ప్రారంభమవుతాయి.

శాసనసభ తాజా చట్టాన్ని రూపొందించగలదు

- కానీ.. కోర్టు తీర్పును నేరుగా అతిక్రమించ లేదు: భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్

న్యూఢిల్లీ:ఎగ్జిక్యూటివ్, లెజిస్లేచర్, న్యాయవ్యవస్థల మధ్య అధికారాల విభజనపై భారత ప్రధాన న్యాయ మూర్తి డి వై చంద్రచూడ్ కీలక వ్యాఖ్య లు చేశారు. చట్టంలోని లోపాన్ని సరి చేయడానికి శాసనసభ తాజా చట్టాన్ని రూపొందించగలిగినప్పటికీ.. అది కోర్టును నేరుగా అధిగమించదని ఆయన అన్నారు. "కోర్టు తీర్పు వచ్చిన ప్పుడు శాసనసభ ఏమి చేయ గలదో, శాసనసభ ఏమి చేయలేదో అనేదానికి మధ్య విభజన రేఖ ఉంది. ఒక నిర్దిష్ట సమస్యను నిర్ణయించే న్యాయస్థానం తీర్పు ఉంటే.. ఆ తీర్పు చట్టంలోని లోపాలను ఎత్తిచూపినట్లయితే, లోపాన్ని నయం చేయడానికి తాజా చట్టాన్ని రూపొందించడానికి శాసన సభకు అధికారం ఉంటుంది. న్యాయ స్థానం తీర్పును శాసనసభ నేరుగా తిరస్కరించడం సాధ్యం కాదు... అది పూర్తిగా అనుమతించ



బడదు... కానీ ఒక తీర్పు చట్టం యొక్క నిర్దిష్ట దృక్కోణాన్ని తీసుకుంటే, లోపాన్ని నయం చేయడానికి అది శాసనసభకు ఎల్లప్పుడూ తలుపు తెరిచి ఉంటుంది"అని హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన అన్నారు.

రాజస్థాన్‌లో సీపీఐ(ఎం) విస్తృత ప్రచారం





సికార్ : రాజస్థాన్‌లో సీపీఐ(ఎం) అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సభలకు, ఎన్నికల ర్యాలీలకు భారీగా జనం హాజరవుతున్నారు. రాయిసింగ్‌నగర్ నుంచి అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్యోంపత్‌రామ్ నామినేషన్ సందర్భంగా శనివారం వేలాదిమంది జనం తరలివచ్చారు. అభ్యర్థికి మద్దతుగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. సికార్ జిల్లా లక్ష్మనగర్ అభ్యర్థిగా బరిలో నిలిచిన విజేందర్ దాకా నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

బీజేపీ లో చేరే వారే

అవినీతిపరులు : కేజ్రీవాల్



చండీఘర్ : అవినీతికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వ పోరాటం ఓ 'జిమ్మిక్కు' అని ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విమర్శించారు. హర్యానాలోని రోహ్‌తక్‌లో ఆప్ ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అవినీతికి, నేరానికి పాల్పడిన వ్యక్తి బీజేపీ లో చేరగానే.. ఈడీ,సీబీఐ, ఐటి వంటి దర్యాప్తు సంస్థలు అతనిని తాకేందుకు కూడా సాహసించవని విమర్శించారు. 'అవినీతి పరులంటే ఇడి విచారణతో జైలు పాలైన వారు కాదు. ఈడీ భయంతో బీజేపీ లో చేరిన వారే అవినీతి పరులు. ఇడి దాడులతో జైలు పాలైన వారు, బీజేపీ లో చేరని వారు నిజాయితీపరులు. ఎప్పటికైనా వారు జైలు నుంచి బయటికి వస్తారు" అని అన్నారు. నిజాయితీ లేనివారు జైలుకెళ్తే.. జీవితాంతం జైలులోనే ఉండాల్సివస్తుందని వారికి తెలుసని, అందుకే బీజేపీ లో చేరతారని చెప్పారు. అవినీతిపరులు, నిజాయితీపరుల మధ్య తేడాను ప్రజలు స్పష్టంగా తెలుసుకోవాలని అన్నారు. ఇటీవల ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కేజ్రీవాల్‌కు ఇడి సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే.

నిజ్జర్ హత్య ఆరోపణలపై ఆధారాలు సమర్పించండి : భారత రాయబారి


ఒట్టావా : ఖలిస్తానీ వేర్పాటువాద నేత నిజ్జర్ హత్య ఆరోపణలపై కెనడా ప్రభుత్వం ఆధారాలు చూపాలని భారత రాయబారి సంజయ్ కుమార్ వర్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ మీడియా గ్లోబ్ అండ్ మెయిల్‌తో ఆయన మాట్లాడుతూ నిజ్జర్ హత్యలో భారతదేశ ప్రమేయం ఉందని ఆరోపించిన కెనడా, దాని మిత్ర దేశాలు స్పష్టమైన ఆధారాలు చూపించలేదని విమర్శించారు. ఈ కేసు దర్యాప్తులో వారికి సహాయం చేయడానికి నిర్దిష్ట లేదా సంబంధిత సమాచారం అందించలేదని చెప్పారు. ఈ దర్యాప్తు మొత్తాన్ని తారుమారు చేశారని ఆరోపించారు. ఈ హత్యలో భారత ఏజెంట్లు ఉన్నట్లు చెప్పాలని కెనడాలోని అత్యున్నత స్థాయి అధికారుల నుంచి సూచనలు వచ్చాయని అన్నారు.

సుప్రీంలో ఇంప్లీడ్ అవుతాం-ఎమ్మెల్సీ కే కవిత

సుప్రీంకోర్టు విచారణలో ఉన్న మహిళా రిజర్వేషన్ల బిల్లు తక్షణ అమలు కేసులో న్యాయ నిపుణుల సలహా మేరకు ఇంప్లీడ్ అవుతామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ బిల్లు అమలుపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలనీ, 2024 సార్వత్రిక ఎన్నికల నుంచే ఈ రిజర్వేషన్లు అమలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

బీసీ కులగణన చేస్తేనే బీజేపీకి మద్దతు

- 7 న జరిగే బీసీ సదస్సులో ప్రధాని ప్రకటించాలి
- లేకుంటే 9న భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తాం : బీసీ వెల్ఫేర్ సోసియేషన్ జాతీయ అధ్యక్షులు జాజుల



నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

బీసీ ముఖ్యమంత్రితో పాటు బీసీల కుల గణన, దామాషా ప్రకారం రిజర్వేన్లు, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ప్రకటిస్తేనే బీజేపీకి మద్దతిస్తామని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఏర్పాటు చేసిన బీసీల రాజకీయ మేధో మదన సదస్సులో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ 23, కాంగ్రెస్ 20 స్థానాల్లో మాత్రమే బీసీలకు టికెట్లు కేటాయించాయని విమర్శించారు. ఒకటి అర శాతం ఉన్న సామాజిక తరగతులకు మెజార్టీ సీట్లు ఇచ్చాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీ కుల గణన చేపడుతామని చెబుతున్న రాహుల్ గాంధీ మాటలు నమ్మశక్యంగా లేవని అన్నారు. ఉదయపూర్ డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు దిక్కులేదని విమర్శించారు. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బీజేపీ 7న హైదరాబాద్‌లో నిర్వహించే బీసీ సదస్సులో ప్రధాని స్పష్టమైన హామి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 9న భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ చిరంజీవులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ అఫైర్స్



- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545

అత్యంత వేగవంత సెంచరీ - రోహిత్ శర్మ



12 అక్టోబర్ 2023 ఢిల్లీలో అరుణ్‌జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ప్రపంచకప్ 2023 మ్యాచ్‌లో భారత్ కెప్టెన్ రోహిత్ శర్మ తన 31వ వన్డే సెంచరీ సాధించాడు. రోహిత్ 63 బంతుల్లో తన సెంచరీ పూర్తి చేశాడు. ప్రపంచకప్ చరిత్రలో అత్యంత వేగవంత సెంచరీ సాధించిన భారతీయుడిగా రోహిత్ రికార్డ్ సృష్టించాడు. 1983 జింబాబ్వేపై కపిల్ దేవ్ 72 బంతుల్లో ఈ రికార్డ్ నెలకొల్పాడు.

ప్రపంచ ఆకలి సూచీ - 2023లో 111వ స్థానంలో భారత్



ప్రపంచ ఆహార సూచీ - 2023లో భారత్ 111వ స్థానంలో నిలి చింది. ఈ సూచీలో మొత్తం 125 దేశాల్లో ఇండియాకు 111వ ర్యాంకు దక్కింది. అయితే కేంద్రం ఇది ర్యాకంగ్ అంటూ మండిపడింది. అన్ని రకాలు సంక్షోభంలో వున్న పాకిస్థాన్ (102) శ్రీలంక 60తో పాటు బంగ్లా దేశ్ (81) నెపాల్ (61) మనకంటే మెరుగైన స్థానాల్లో ఎలా వున్నాయని కేంద్రం ఆశ్చర్యం వ్యక్త పరిచింది. 28.7 స్కోరులో బారల్ పరిస్థితి ఆందోళనకరంగా వుందని నివేదిక పేర్కొంది.

ప్యూమా రోప్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా మహ్మద్



ప్రముఖ బ్రాండ్ అయిన ప్యూమా ప్రముఖ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీని బ్రాండ్ అంబాసిడర్‌గా చేర్చుకొన్నట్లు ప్రకటించింది. పాదరక్షలు, దుస్తులు, ఉపకరణాలతో సహ అన్ని రకాల ఉత్పత్తులకు ఈ భాగస్వామ్యం వర్తిస్తుంది.

గాజాకు 35 టన్నుల ఆహార పదార్థాలు, వైద్య పరికరాలు

ఇజ్రాయిల్ దాడులకు తీవ్రంగా నష్టపోయిన గాజాకు 35 టన్నుల ఆహార పదార్థాలు, వైద్య పరికరాలను భారత్



అందించింది. అక్టోబర్ 7న హమాస్ దాడి అనంతరం ఇజ్రాయిల్ గాజాపై బాంబు దాడులను కొనసాగించింది. ఈ నేపథ్యంలో గాజాలో భారీగా ప్రాణ నష్టం వాటిల్లింది. ఈ ఉగ్రదాడిని భారత్ ఖండించింది.

నిలవు కుడిచ సింహగల్ - ఎస్.సోమనాథ్



ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ "నిలవు కుడిచ సింహగల్" (వెన్నెల గ్రోలిన సింహాలు) పేరిట మలయాళంలో ఆత్మ కథను రాశారు. యువ తరానికి తన జీవితం స్ఫూర్తిగా నిలవాలనే ఈ ఆత్మకథ రాసినట్టు ఆయన వెల్లడించారు. అత్యంత నిరుపేద కుటుంబంలో పుట్టి ఇస్రో చైర్మన్‌గా ఎదిగిన తీరు, ఆ క్రమంలో ఎదురైన కష్టాలు ఆయన ఇందులో హృద్యంగా వివరించారు. చంద్రయాన్‌మిషన్ విజయం తనను ఆత్మకథ రచనకు పురిగొల్పిందని చెప్పారు.

దేశంలో తొలి బధిర మహిళా అడ్వకేట్ - సారా



భారత దేశ తొలి బధిర మహిళా అడ్వకేట్ సారా సన్ని తాజాగా సుప్రీంకోర్టులో సైన్ లాంగ్వేజ్‌లో వాదన వినిపించింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తి ఎదుట ఇంటర్ ప్రెటర్ సహాయంతో ఆమె తన వాదనలు వినిపించి ప్రశంసలు పొందింది. "ఇలాంటిది ఇంతకు ముందే జరగాలి ఆలస్యం చేశాం" అని జస్టిస్ చంద్రచూడ్ సారాని ఉద్దేశించి అన్నారు. దివ్యాంగులు హక్కుల కోసం జావేద్ అబిధి ఫౌండేషన్ వారు వేసిన ఆ కేసులో ఫౌండేషను తరపున సారా వాదనలు మొదలు పెట్టింది.

ఇక నుంచి ఈ - పాస్ పోర్టులు



పాస్‌పోర్టు సేవా ప్రోగ్రాం 2.0 కింద ఈ - పాసు పోర్టులను ఏడాది చివరి నాటికి ప్రవేశ పెట్టడం ద్వారా గణనీయమైన డిజటల్ మార్పునకు నాంది పలికేందుకు భారత్ సిద్ధమైంది. ఈ కొత్త ఈ పాస్‌పోర్ట్ ఇంటిగ్రేటెడ్ చిప్‌తో వస్తుంది. వ్యక్తికి చెందిన బయో మెట్రిక్ డెటా ఇందులో నిక్షిప్తమై వుంటుంది. దీని వల్ల అంత ర్జాతీయ సరి హద్దులో పాస్ పోర్టులను నకిలీ చేయడం కష్టతరం అవుతుందని విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ తెలిపారు. ఈ ఈ-పాస్ట్‌పెర్టును మొదట ఫిన్‌లాండ్ ప్రారంభించింది.

స్కిన్ క్యాన్సర్‌కు సబ్బు కనిపెట్టిన 14 ఏండ్ల హేమన్ బెకెలే



అమెరికాలోని వర్జిని యాకు చెందిన 14 ఏండ్ల హేమన్ బెకెలే స్కిన్ క్యాన్సర్‌ను జయించేలా సబ్బును కని పెట్టాడు. ఈ సబ్బు ధర కేవలం 800 రూపాయలు. ఈ సరి కొత్త ఆవిష్కరణకు టాప్ యంగ్ సైంటిస్ట్‌గా అవార్డు గెలుచుకున్నాడు. యు.ఎస్‌లో ప్రతి ఏడాది నిర్వహించే 2023 3ఎం యంగ్ సైంటిస్ట్ చాలెంజ్‌లో పాల్గొని దాదాపు 9 మందితో పోటిపడి బెకెలే యంగ్ సైంటిస్ట్‌గా విజయం కైవసం చేసుకొన్నాడు.

అమెరికాలో అంబేద్కర్ విగ్రహం



భారత రాజ్యాంగ రూపశిల్పి బి.ఆర్. అంబేద్కర్ అత్యంత ఎత్తయిన విగ్రహాన్ని అమెరికా రాజధాని వాషింగ్టన్ శివారులోని మేరిల్యాండ్‌లో ఆవిష్కరించారు. అంబేద్కర్ వర్ధంతి రోజైన 14న అంబేడ్కుర్ ఇంటర్నే షనల్ సెంటర్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ 19 అడుగులు ఎత్తైన ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. "స్టాట్యు ఆఫ్ ఈ క్వాలిటీ"గా పిలుచుకునే ఈ విగ్రహ ఆవిష్కరణకు 500 మందికి పైగా భారతీయ అమెరికన్స్‌తో పాటు, భారత్ తదితర దేశాల నుంచి తరలి వచ్చారు. ఈ విగ్రహాన్ని ప్రత్యేక శిల్పి రామ్ సుతార రూపొందించారు.

భారత నేవీ మాజీ అధికారులకు ఖతార్‌లో మరణ శిక్ష



గుడాచార్యం ఆరోపణలపై భారత నావికాదళానికి చెందిన 8 మంది మాజీ అధికారులకు ఖతార్ మరణ శిక్ష విధించింది. ఈ తీర్పుపై భారత విదేశాంగ మంత్రిత్వశాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. దీనిపై అప్పీలుకు వెళ్ళనున్నట్లు ప్రకటించింది. ఈ కేసుకు అధిక ప్రాముఖ్యత ఇస్తామని, అన్ని రకాల సాయాన్ని అందిస్తామని పేర్కొంది.


ఆస్కార్ యాక్టర్స్ జాబితాలో ఎన్టీఆర్

దీ అకాడమీ ఆఫ్ మోహన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ (ఆస్కార్ కమిటి) తాజాగా వెల్లడించిన మెంబర్ క్లాస్ ఆఫ్ యాక్టర్స్ జాబితాలో ఎన్టీఆర్‌కు చోటు దక్కింది. ఎన్టీఆర్‌తో పాటు అమెరికన్ నటుడు కె.హ్యూక్వాన్, అమెరికన్ నటి మార్ష స్టెపానీ బ్లేక్, ఐరన్ నటి కెర్రీ కాండన్, అమెరికన్ కమ్ కెనెడియన్ నటి రోసా సలాజర్‌లు ఈ జాబితాలో నమోదయ్యారు.



1. హరప్పాలో చెక్కతో చేసిన శవ పేటిక లభ్యమయ్యింది
2. సుర్కొటడాలో కుండ పెంకులతో వున్న సమాధి లభ్యమైంది
3. లోథన్‌లో జంట ఖననం (ఆడ,మగ) లభ్యమయ్యింది.
4. కాలిబంగన్‌లో ఇటుకలుతో నిర్మించిన సమాది లభ్యమైంది.
5. సింధూ ప్రజల నదీ దేవత వాహనం - **మొసలి**
6. ప్రపంచంలో మొట్టమొదట ప్రత్తిని పండించిన వారు - **సింధూ ప్రజలు**
7. సింధూ నాగరికత గురించి మొట్ట మొదట ప్రచురించిన పత్రిక - **లండన్ వీక్లి (1924)**
8. మొదటసారిగా హరప్పా గురించి ప్రస్తావించిన ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగి - **సి.మాసన్**
9. మొసపటోమియా అంటే 2 నదులు మధ్యప్రాంతం అని అర్థం (ఇరాన్‌లోని టైగ్రిస్, యూప్రటీస్ నదులు మధ్య మొట్ట మొదట నాగరికత మొసపటామియా నాగరకత)
10. ప్రపంచంలో మొట్టమొదటి ట్రెడల్ ఫోర్టు - **లోథర్**
11. హరప్పాను 1921లో దయారామ్ సహని కనుగొన్నారు - **రావి నది ఒడ్డున**
12. మొహంజొదారోను 1922లో సింధూ నది ఒడ్డున ఆర్.డి బెనర్జీ కనుగొన్నారు.
13. చాన్హూదారాను 1925లో సింధూ నది ఒడ్డున మంజుదార్, మాకి కనుగొన్నారు.
14. కాలిబంగన్‌ను 1953లో గాగ్గర్ నది ఒడ్డున ఏ.ఘోష్ కనుగొన్నారు.
15. లోథాల్‌ను 1957లో బాగావార్ నది ఒడ్డున ఆర్.ఆర్ రావు వాట్స్ కనుగొన్నారు.
16. చరిత్ర కారుల అభిప్రాయం ప్రకారం మొహంజదారో జనాభా - **35000 - 41000**
17. సింధు నాగరికతలో పశు సంవర్ధక కేంద్రాల పేరు - **నేసదీ**
18. లోథాల్‌లో దర్వాజాలు ప్రధాన వీధి వైపు అమర్చబడి వుండేవి.
19. వ్యవసాయం కోసం మొదటిసారిగా నదులుపై ఆనకట్టలు నిర్మించింది - **ద్రావిడులు**

లోక్‌పాల్‌కు రాజ్యాంగబద్ధ హెూదా కల్పించడానికి ప్రవేశపెట్టిన బిల్లు ఏది?



41. లోక్‌పాల్ బిల్లును రెండవ సారి ఏ లోక్‌సభ కాలంలో ప్రవేశపెట్టారు?
1. 7వ లోక్‌సభ 2. 4వ లోక్‌సభ
3. 5వ లోక్‌సభ 4. 8వ లోక్‌సభ

42. క్రింది వాటిలో లోకాయుక్త పరిధిలోకి వచ్చే అంశాలు.
ఎ. సహకార సంఘం అధ్యక్షులు
బి. ముఖ్యమంత్రి
సి. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్లు
డి. శాసన సభ్యులు
1. ఎ, బి, డి 2. బి, సి, డి
3. ఎ, సి, డి 4. ఎ, బి, సి, డి

43. రాష్ట్రస్థాయిలో అవినీతి నిర్మూలన కోసం లోకాయుక్తను ఏర్పాటు చేయాలని పరిపాలన సంఘం ఏ సంవత్సరంలో సిఫార్సు చేసింది?
1. 1971 2. 1962
3. 1985 4. 1966

44. లోకాయుక్త చట్టం చేసిన మొదటి రాష్ట్రం ఏది?
1. మహారాష్ట్ర 2. గోవా
3. కేరళ 4. ఒరిస్సా

45. లోకాయుక్త విచారణ కాలపరిధి ఎంత?
1. 3 నెలలు 2. 60 రోజులు
3. 6 నెలలు 4. 30 రోజులు

46. లోకాయుక్తలను తొలగించునది ఎవరు?
1. గవర్నర్ 2. రాష్ట్రపతి
3. పార్లమెంట్ 4. సుప్రీంకోర్టు

47. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో "ధర్మ మహాపాత్ర" అనే పేరుతో లోకాయుక్తను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
1. 1983 2. 1984
3. 1976 4. 1972

48. లోక్‌పాల్ ఎన్ని సంవత్సరాలకు సంబంధించిన కేసులను విచారిస్తుంది?
1. 6 సంవత్సరాలు
2. 10 సంవత్సరాలు
3. 15 సంవత్సరాలు
4. 20 సంవత్సరాలు

49. లోక్‌పాల్‌కు రాజ్యాంగబద్ధ హెూదా కల్పించడానికి ప్రవేశపెట్టిన బిల్లు ఏది?
1. 124వ రాజ్యాంగ సవరణ బిల్లు
2. 110 వ రాజ్యాంగ సవరణ బిల్లు
3. 116వ రాజ్యాంగ సవరణ బిల్లు
4. 120వ రాజ్యాంగ సవరణ బిల్లు

50. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి లోకాయుక్త.
1. ఆవుల సాంబశివరావు
2. పి. లక్ష్మణ్ రెడ్డి
3. సి.వి. రాములు
4. నిరంజన్ రావు

51. లోకాయుక్త, తమ నివేదికను ఎవరికి సమర్పిస్తారు.
1. ముఖ్యమంత్రి 2. రాష్ట్రపతి
3. గవర్నర్
4. ప్రధానమంత్రి



డాక్టర్ అలీ సార్
భారత రాజ్యాంగ నిపుణులు
9494228002

సమాధానాలు

1.3	2.3	3.4	4.4	5.1
6.1	7.1	8.2	9.3	10.1
21.3				

చంద్రగ్రహణం అపోహలు - వాస్తవాలు

వేదిక



చార్వాక జి
9347284111

సూర్యుడు, చంద్రుడు, భూమి ఒకే సరళరేఖ పైకి వచ్చినప్పుడు గ్రహణాలు ఏర్పడతాయి. ముఖ్యంగా సూర్య గ్రహణం అమావాస్య నాడు పగటిపూట ఏర్పడుతుంది. చంద్రగ్రహణం పౌర్ణమి నాడు రాత్రి సమయంలో ఏర్పడుతుంది. అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా భూమి మీద గ్రహణాలు ఏర్పడడాన్ని సమయంలో చిన్నమార్పులతో భూమిపై నుండి వీక్షిం చవచ్చు. అక్టోబర్ 28, 2023 శనివారం రాత్రి 1 గంట 5 నిమిషాల నుండి 2 గంటల 22 నిమిషాల వరకు పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడింది. ఈ సంవత్సరంలో ఏర్పడే చివరి చంద్రగ్రహణం ఇది మన ఇండియాతో పాటుగా ఆస్ట్రేలియా, యూరప్, ఉత్తర, దక్షిణాఫ్రికా, ఆసియా, అంటార్కిటికా ప్రాంతాల్లో కనబడుతుంది. సాధారణంగా ప్రతి సంవత్సరం ఏడు గ్రహణాలు ఏర్పడతాయి అందులో ఐదు సూర్య గ్రహణాలు ఉంటే రెండు చంద్రగ్రహణాలు లేదా నాలుగు సూర్య గ్రహణాలు ఉంటే మూడు చంద్రగ్రహణాలు సర్వసాధారణంగా ఏర్పడతాయి. ఇదే క్రమం ప్రతి పదేండ్లకు ఒకసారి తిరిగి పునరావృతం అవుతూ ఉంటుంది.

చంద్రగ్రహణం:

చంద్రుడికి సూర్యుడికి మధ్యలో భూమి వచ్చినప్పుడు సూర్యుడు నుండి వెలువడే కాంతి చంద్రుడిపై పడకుండా భూమిపై పడటం వల్ల భూమిపైన ఉన్న వారికి చంద్రుడు కనిపించరు దీన్నే చంద్రగ్రహణం (లూనార్ ఎక్లిప్స్) అని అంటారు. చంద్రగ్రహణం పౌర్ణమి నాడు మాత్రమే ఏర్పడుతుంది. చంద్ర గ్రహణ సమయంలో చంద్రుడు కొన్ని గంటల పాటు అర్ధ గోళాకారంలో కనిపిస్తుంది. చంద్రుడు కొద్ది భాగం మాత్రమే భూమి నీడలోకి ప్రవేశించి నప్పుడు పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడుతుంది. చంద్రుడు పూర్తి భాగం భూమి నీడలోకి ప్రవేశించి నప్పుడు సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. చంద్ర గ్రహణం ఏర్పడ్డ సమయంలో భూమిపైన మనకు చంద్రగ్రహణం ఏర్పడితే అదే సమయంలో గనక మనం చంద్రుడు పైనుండి చూస్తే సూర్యగ్రహణం ఏర్పడుతుంది. చంద్రగ్రహణం నాడు భూమిపై నుండి చూస్తే చంద్రుడు కనిపించడు సూర్యగ్రహణం నాడు భూమిపై నుండి చూస్తే సూర్యుడు కనిపించడు. సూర్యగ్రహణం ఏర్పడ్డ సమయంలో గ్రహణాన్ని నేరుగా కళ్ళతో వీక్షించ రాదు. సూర్యుడిపై నుండి వెలువడే అతినీల లోహిత కిరణాలు నేరుగా మన కంటిపై పడి కంటిలోని సున్నిత రెటీనా దెబ్బతినే ప్రమాదం ఉంది. చంద్ర గ్రహణాన్ని మాత్రం నేరుగా మన కళ్ళతో చూడ వచ్చు ఎటువంటి హాని కలగదు, కళ్లకు ఎటువంటి ప్రమాదం కలగదు. చంద్రగ్రహనాన్ని క్షుణ్ణంగా చూడాలంటే మాత్రం దూరాన ఉన్న వస్తు వులు చూసే బైనాక్యులర్ సహాయంతో చూస్తే చంద్రగ్రహణం మరింత స్పష్టంగా కనబడుతుంది.

సూపర్ మూన్ :

భూమి నుండి చంద్రుడు లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్నాడు. భూమి, చంద్రుడు మధ్య సరాసరి దూరం 3 లక్షల 84 వేల 440 కిలోమీటర్లు. భూమికి దగ్గరగా చంద్రుడు వచ్చినప్పుడు ఏర్పడే పౌర్ణమి నాటి చంద్రుడిని సూపర్ మూన్ అంటారు. అప్పుడు భూమికి చంద్రుడికి మధ్య దూరం 3 లక్షల 56వేల 509 కిలోమీటర్లు దూరం కొంత తగ్గుతుంది. పౌర్ణమి నాడు చంద్రుడు సాధారణ రోజుల కంటే 14 రేట్లు పెద్దగా 3 రేట్లు ప్రకాశవంతంగా కొత్తకొత్త రంగులో కనిపించడం జరుగుతుంది. చంద్రుడు భూమికి దూరంగా వెళ్ళినప్పుడు 4 లక్షల 6వేల 662 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

బ్లూ మూన్ :

ఒకే నెలలో రెండుసార్లు పౌర్ణమి వస్తే అలా వచ్చిన నెల చివరలో రెండవ పౌర్ణమి నాటి చంద్రుని బ్లూ మూన్ అని అంటారు. 30 నెలల కోసారి ఇలా ఒకే నెలలో రెండు పౌర్ణములు రావడం జరుగుతుంది.

బ్లడ్ మూన్ :

సూపర్ మూన్ సందర్భంగా చంద్రగ్రహణం ఏర్పడినప్పుడు సాధారణం కంటే ఆ రోజు చంద్రుడు ఎక్కువ ఎర్రగా కనపడటం వల్ల ఆరోజు కనబడే చంద్రుని బ్లడ్‌మూన్ అని అంటారు. సూర్య రష్మి సూర్యుడి నుండి వెలువడి భూమి వాతావరణంలోనికి వచ్చినప్పుడు రంగులు దేనికవి విడిపోతాయి అన్ని రంగుల్లో కెల్లా ఎక్కువ తరంగదైర్ఘ్యం కలిగిన ఎరుపు, నారింజ రంగులు ఎక్కువ దూరం ప్రయాణిస్తాయి. ఎక్కువ దూరం ప్రయాణించడం వల్ల చంద్రుడు ఎరుపు రంగులో కనిపించడం వల్ల దాన్ని బ్లడ్‌మూన్ అని అంటారు. గ్రహణ సమయంలో చంద్రుడు భూమి నీడలోకి వెళ్లడం వల్ల సూర్యుడు నుండి వచ్చే కాంతి భూమిపై పడి ఆ తరువాత చంద్రుడు పై పడుతుంది అందుకే ఆ రోజు చంద్రుడు సాధారణ రోజుల కంటే ఎర్రగా కనిపిస్తుంది.



ముఖ్యంగా గ్రహణ సమయంలో ఏమీ తినకూడదని మూఢ నమ్మకం బలంగా ఉంది. గ్రహణ సమయంలో ఆహారం సేకరించడం వల్ల ఎటువంటి నష్టము జరగదు. వేల సంవత్సరాలుగా సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను వదిలి శాస్త్రీయంగా ఆలోచించి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని శాస్త్రీయ సమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుకుందాం. రేపటి తరమైన నేటి బాలబాలి కలకు, విద్యార్థిని విద్యార్థులకు ఆశాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించ కుండా శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించేలా కృషి చేద్దాం. మూఢనమ్మకాలను నిర్మూలిద్దాం.

వేల సంవత్సరాలుగా మన దేశంలో అన్ని మతాల్లో మరీ ముఖ్యంగా హిందూమతంలో గ్రహణ సందర్భంగా రకరకాల మూఢనమ్మకాలు సమాజంలో ఉన్నాయి. అక్టోబర్ 28, 2023 శనివారం రాత్రి ఏర్పడిన చంద్ర గ్రహణం అశ్విని నక్షత్ర నాలుగో పాదంలో కండగ్రాసమైన రాహు గ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సింహ లగ్నం లో ఏర్పడుతుందని ఈ సందర్భంగా కొన్ని రాశుల వారికి శుభము, మధ్యమము, అరిష్టము అని అరిష్టము ఉన్న వారు వెండి పాత్ర, వెండి పాము, బంగారము, వస్త్రము, గిన్నె, ధనము అన్నింటిని బ్రాహ్మణుడికి దానం ఇవ్వాలని గర్భిణులు ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి వెళ్ళకూడదని ఒకవేళ బయటికి వెళ్ళినట్లయితే గర్భంలో ఉన్న శిశువుపై గ్రహణ ప్రభా వం వల్ల గ్రహణ దోషంతో పిల్లలు పుడతారని ప్రచారంలో ఉంది. గ్రహణ సమయంలో ఆహార పదార్థాల పైన గడ్డి (దర్భ) గరక వేసి ఉంచాలని గ్రహణం వల్ల వచ్చే అశుభం ఆహార పదార్థాలకు అంటదని చెప్పడం. కొడుకులు ఉన్నవారు ముఖ్యంగా వారి తల్లి పూజలు చేయాలని ఇంట్లో గ్యాస్‌స్టవ్ కింద పలానా రంగు వస్తువు పెట్టాలని ఇంట్లో ఒక ప్రాంతంలో నిమ్మకాయను ఉంచాలని గ్రహణ దోషం ఆరు నెలలపాటు ఉంటుందని రాహువు కేతువు చంద్రు డిని మింగుతుందని చిన్నప్పటి నుంచే పిల్లలకు చెప్పడం ముఖ్యంగా నేడు ఏర్పడుతున్న చంద్రగ్రహణం శీతాకాలం అయినా సమయంతో సంబంధం లేకుండా అర్ధరాత్రి చంద్రగ్రహణం అనంతరం చన్నీళ్ళతో స్నానం చేయాలని చెప్పడం అలా చేయకపోతే అరిష్ట మని ఇలా ఎన్నో రకాల మూఢనమ్మకాలు సమాజంలో నేటికీ చలామణిలో ఉన్నాయి. వాస్తవానికి ఇంత చలికాలంలో అర్ధరాత్రి స్నానం చేస్తే జలుబు, జ్వరం వస్తుంది తప్ప ఏమీ జరగదు.

ముఖ్యంగా గ్రహణ సమయంలో ఏమీ తినకూడదని మూఢ నమ్మకం బలంగా ఉంది. గ్రహణ సమయంలో ఆహారం సేకరించడం వల్ల ఎటువంటి నష్టము జరగదు. వేల సంవత్సరాలుగా సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను వదిలి శాస్త్రీయంగా ఆలోచించి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని శాస్త్రీయ సమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుకుందాం. రేపటి తరమైన నేటి బాలబాలి కలకు, విద్యార్థిని విద్యార్థులకు ఆశాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించ కుండా శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించేలా కృషి చేద్దాం. మూఢనమ్మకాలను నిర్మూలిద్దాం.శాస్త్రీయ సమసమాజాన్ని నిర్మిద్దాం.


"చేసిన ప్రమాణా (హామీ)లకు కట్టుబడి ఉండాలి. రాజకీయాల్లో నైతిక విలువలు నిలబెట్టుకోవాలి. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయరాదు. ప్రజల పవిత్రమైన ఓటును అంగడి సరుకు చేయబోమనే హామీ ఇవ్వాలి. ప్రశ్నించే స్వేచ్ఛను పరిరక్షి స్తామని, ఆచరణాత్మక హామీలతో ఓటర్లను ప్రసన్నం చేసు కోండి.. శంకించవలసింది ఓటర్లను కాదు, ముమ్మాటికి రాజకీయ పార్టీ(నాయకు)లనే ఆత్మవిమర్శ చేసుకొని చిత్తశుద్ధితో జాతి సంపదను పౌరులకు సమంగా పంచుతామని, పౌర స్వేచ్ఛను కాపాడుతామని ఓట్లను వినమ్రంగా అర్థించండి. ప్రజా చైతన్యానికి పరీక్షా కాలమే!"

ప్రజలు ఎవరిని నమ్మాలి?

ఐదు రాష్ట్రాల ఎన్నికల సంగ్రామం మొదలైంది. మన తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 30న ఎన్నికలు, డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడించ నుంది. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికలు మేనిఫెస్టో(పథకా)లు వెల్లడిస్తున్నారు. పార్టీ(నాయకు)లు ఒకరిని మించి ఇంకొకరు ఓటర్లను ప్రసన్నం చేసుకోవ డానికి మేనిఫెస్టోలో ఆశలు రేపే హామీల జోరు కొనసా గుతుంది. మా పథకాలను మీరు కాపీ కొట్టారని! కాదు మీరే కాపీ కొట్టారని మాటల జోరు వేడిని పెంచుతున్నారు. నేటి తాజా రాజకీయ పరిస్థితులు చూస్తుంటే? ఈ పార్టీ ఆ పార్టీ అనే తేడా లేకుండా పార్టీ(నాయకు)లు కప్ప దాటుడును.. జంప్ జిలానీలను ప్రోత్సహిస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలు, వాగ్దానాలను, ఇచ్చిన మాటలను తుంగలో తొక్కేసి రాత్రికి రాత్రే పార్టీ (కండువా)లు మార్చేస్తున్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధించడానికి ఎన్ని చట్టాలు చేసినా లాభం లేకుండా పోతుంది. రాజకీయాల్లో నైతిక విలువలు కనుచూపు మేరలో కానరావడం లేదు. ప్రజాస్వామ్య విలువలు అడుగంటి పోతున్నాయి. సీటుకు నోటు, ఓటుకు నోటు, తాయిలాలు, ఉచితాల హామీలతో ఓటర్లను తమ ఖాతాలో వేసుకునడానికి పడరాని పాట్లుపడుతు న్నారు. మీరు చేసింది శూన్యం!,కాదు మీరేం చేశారని విమర్శలు, ప్రతి విమర్శలతో వారిని బంగాళాఖాతంలో కలపండి అంటే? కాదు వారిని పాతాళంలోకి నేట్టేయండనే మాటలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతూ ఓట్లు రాబట్టుకునే ప్రయత్నాల్లో అన్ని పార్టీలు "ఆ తాను ముక్కలే" అన్నట్లు పోటీ పడుతున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ పార్టీ (నాయకు)లు సభలు, సమావేశాలతో దూకుడుగా ప్రచార వేగాన్ని పెంచుకుంటూ దూసుకుపోతున్నారు. ఎవ రిని నమ్మాలనే ప్రజలకు కన్ఫ్యూజన్లో మైండ్ గేమ్ (మాన సిక క్రీడ) మొదలైంది. అన్ని పార్టీ(నాయకు)లు డాక్టర్ అంబేద్కర్ అందించిన "ఓటు బలమైన ఆయుధం" మీ స్థితి గతులను రాష్ట్ర, దేశ పరిస్థితులను మార్చే ఓటును ఆగం గాకుండా ఆలోచించి, మీకు మేలు చేసే వారికి ఓటు వేయండి అనే ఓటు నీతు(భజన)లు మొదలుపెట్టారు. ఎవరిని నమ్మాలో! ఎవరిని నమ్మకూడదో.. అర్థం కాని అయోమయ స్థితిని సృష్టిస్తున్నారు నాయకులు, పార్టీలు." ప్రజల నమ్మకం అమ్ముడై పోవడంతో". మీ కోసమే పార్టీలు ఫిరాయి స్తున్నామని అభివృద్ధి బోధనలతో ప్రజలను నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ప్రజాపాలకులను నమ్మి జాతి పురోభివద్ధి కోసమే నని నమ్మకం పునాదుల మీద పార్టీ (నాయకు)లకు ఓట్లు వేస్తూనే ఉన్నారు. ఓట్లు పడి అధికారం చేతికొచ్చాక హామీలు, మేనిఫెస్టో అమలు చేయని ఫలితంగానే దేశంలో, రాష్ట్రాల్లో ఆర్థిక, సామాజిక, రాజకీయ, స్వేచ్ఛలో అసమానతల అగాధం పెరిగిపోతున్నాయి. దేశ సంపద గుప్పెడు మంది చేతు (జేబు)ల్లో ఉండిపోయింది. ప్రతిసారి ఎన్నికల ముందు ఇదే తంతు కొనసాగుతుంది. ఆ తర్వాత "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లుగా ప్రజానీకం పరిస్థితులు ఉన్నాయి.

మన రాష్ట్రంలో ఎన్నికలవేళ ప్రజల నాడిని అంచనా వేయడం పేరుతో పోల్ సర్వే సంస్థలు హడావుడి చేస్తున్నాయి. ఇలా ఎన్నికల ముందు నుండే వందలాది సర్వే సంస్థలు ఫీల్డ్ స్టడీ మొదలెట్టాయి. ఈ ఎన్నికల్లో విజయ అవకాశాలు ఎలా! ఏ మేరకు ఉన్నాయని అన్ని పార్టీలు సొంత సర్వే సంస్థలచే సర్వే చేయించుకుంటు న్నాయి. వాటి ఆధారంగానే వ్యూహాలు రచించాయి. వివిధ టెలివిజన్ ఛానల్స్, వార్తాపత్రికలు సొంతంగా కానీ లేదా సర్వే సంస్థల ద్వారా చేస్తున్నాయి. వీటిని ఒపీనియన్ పోల్స్ అంటారు. వీటి ఆధారంగా చర్చాగోష్టులను నిర్వహిస్తున్నారు. వీటిలో వైరి వర్గాలు గొడవలు పడుతున్న తీరును చూస్తున్నాం. ఈ సంస్థలే పోలింగ్ ముగిసిన తర్వాత ఎగ్జిట్ పోల్స్ నిర్వహిస్తాయి.ఏ పార్టీకి ఎంత శాతం ఓట్లో, ఎన్ని సీట్లో జోస్యం చెప్తాయి. వాస్తవానికి ఈ సర్వేలన్నీ విశ్వసనీయతలో అనుమానాలు ఉన్నాయి. ఖచ్చితమైన అంచనాలు నిరూపించబడలేదు. ఒపీనియన్, ఎగ్జిట్ పోల్స్ సర్వే అంచనాలకు వాస్తవ ఫలితాలకు మధ్య తేడాలే కనిపించాయి.కొన్నిసార్లు అయితే చాలా భిన్నంగా కూడా వచ్చాయి. ఇలాంటి వేల కనీసం తప్పుడు అంచనాలను ప్రజలపై రుద్దినందుగాను క్షమాపణ కూడా కోరలేదు!. కొన్ని దేశాల్లో శాస్త్రీయ పద్ధతుల్లో సర్వేలు నిర్వహిస్తు న్నారు. కొన్ని నియోజకవర్గాల్లోనో, కొద్దిమంది అభిప్రాయాలను సేకరించి ఓ నిర్ధారణకు రావడం చాలా కష్టం. అందువల్లే కచ్చితత్వం లోపిస్తుంది. ఈ విషయం సర్వే సంస్థలకు తెలిసిన ఒప్పుకోరు. దీని వెనుక అనేక అపోహలు, ఆర్థిక లావాదేవీలు ఉంటున్నాయని తెలుస్తుంది. ఈ సంస్థలన్నీ ఎన్నికల సర్వేల పేరిట ప్రజలను నమ్మించేందుకే పార్టీ (నాయకు)లు ఉపయోగించుకుంటాయన్న అనుమానాలు, సందేహాలు ఉన్నాయి. పార్టీలు ప్రజల్లో ఈ సర్వేల కన్ఫ్యూజన్ సష్టిస్తున్నారు. వీటి మెథడాలజీ, శాస్త్రీ యతపై సందేహాలున్నాయి.షెడ్యూల్ విడుదలయ్యేంత వరకే ఈ సర్వేల హల్చల్ చేస్తాయి,ఆ తర్వాత నిషేధించబడుతాయి. ఆ తర్వాత ఎన్నికల అనంతరం ఫలితాలకు ముందు ఎగ్జిట్ పోల్స్ ప్రకటిస్తారు. వాటిలోనూ అంచనాలు తారుమారే అవుతున్నాయి. తాజాగా సోషల్ మీడియా వేదికగా ప్రచారం జోరందుకుంటున్నది.

దేశంలోనే ఎక్కువ మొబైల్ ఫోన్లు వినియోగించే రాష్ట్రాల్లో తెలంగాణ 9వ స్థానంలో ఉంది. అందుకే రాజకీయ ప్రచారంలో సామాజిక మాధ్యమాల పాత్ర కీలకంగా మారింది. అన్ని పార్టీలు సోషల్ మీడియా విభాగాలను ఏర్పాటు చేసుకోగా, ఇప్పుడు వార్ రూమ్లను రంగంలోకి దింపాయి. ఓటర్ నాడిని పట్టుకొని వారి మనసును సాంకే తిక తంత్రంతో మార్చడమే వాటి పని. తమ అభ్యర్థుల గెలుపుతో పాటే, ప్రత్యర్థి స్థైర్యాన్ని దెబ్బతీయడమే వాటి లక్ష్యం. ఆ మేరకు తమ వ్యూహాలను పదను పెడుతు న్నాయి. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని ఓటర్ల చెంతకు తీసుకెళ్లడం వార్‌రూమ్ల ఏర్పాటు లక్ష్యం. అన్ని పార్టీ భావ జాలాలని, ప్రత్యర్థి బలహీనతలను ప్రజల మనసుల్లోకి చొ ప్పించే వ్యూహాలను సిద్ధం చేస్తాయి. స్వల్ప నిడివితో ఉండే వీడియోలు, పంచులతో ఉండే చిత్రాలను సిద్ధం చేసి నిత్యం సామాజిక మాధ్యమాల్లో వదులుతుంటాయి. ఈ వార్ రూమ్ బందంలో 10 నుంచి 15 మంది సభ్యులు ఉంటారు. ఈ ఒప్పందం ప్యాకేజీ రూ.కోట్లలోనే ఉంటుం దని తెలుస్తోంది. ప్రజల్లో నానుతున్న అంశమే వారు రూముల ప్రధాన ఆయుధం. ఎక్కడైనా ఒక నాయకుడు సంబంధించిన లోపం వెలుగు చూస్తే సినిమాల్లో దానికి సంబంధించిన సన్నివేశాలు వ్యంగ్యమైన వ్యాఖ్యలు జత చేసి దృశ్యం ఇవ్వడం. అలాంటి వాటిని స్మార్ట్‌ఫోన్లు వినియోగించి ఓటర్లతో అనుసంధానం కావడం వీరి ప్రధాన విధుల్లో ఒకటి. సామాజిక మాధ్యమ బృందాలు ఏర్పాటు చేసి వార్‌రూంలో రూపొందించే అంశాలు వాట్సాప్, ట్విట్టర్, ఫేస్బుక్, ఇనిస్టా, యూ ట్యూబ్‌లలో పోస్ట్ చేస్తుంటారు. ఇలా పార్టీల తరపున ప్రచారంలోకి వార్ రూమ్లో పద్ధతిలో బలాలు, లోపాలు, అస్త్రాలుగా ఉపయోగించి తెరచాటు యుద్ధం కొనసాగిస్తున్నారు.



ఇప్పటికైనా పార్టీ(నాయకు)లు ప్రజల ఆకాంక్షల మేరకు పాలిస్తామని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యపాలన నేతల స్వార్థం కోసం కాదు? ప్రజల సమ్మిళిత అబివృద్ధి కోసమేనని గ్రహించి నడుచు కోవాలి. చేసిన ప్రమాణా (హామీ)లకు కట్టుబడి ఉండాలి. రాజకీయాల్లో నైతిక విలువలు నిలబెట్టుకోవాలి. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయరాదు. ప్రజల పవిత్రమైన ఓటును అంగడి సరుకు చేయబోమనే హామీ ఇవ్వాలి. ప్రశ్నించే స్వేచ్ఛను పరిరక్షిస్తామని, ఆచరణాత్మక హామీలతో ఓటర్లను ప్రసన్నం చేసు కోండి.. శంకించవలసింది ఓటర్లను కాదు, ముమ్మాటికి రాజకీయ పార్టీ(నాయకు)లనే ఆత్మ విమర్శ చేసుకొని చిత్తశుద్ధితో జాతి సంపదను పౌరులకు సమంగా పంచుతామని, పౌర స్వేచ్ఛను కాపాడుతామని ఓట్లను వినమ్రంగా అర్థించండి. ప్రజా చైతన్యానికి పరీక్షా కాలమే! అయినా తగ్గేదే లేదంటూ, అన్ స్టాపబుల్‌గా ఓటర్లు మన:సాక్షిగా మీ సమస్యలు పరిష్కారం చేసేవారికి స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటేయండి.. ఇదీ ఓటర్ చైతన్యమని నిరూపించండి..

- మేదాజీ

మహిళా సాధికారిత



- మహిళా భద్రతా చర్యలు, అభివృద్ధికి ప్రత్యేక పథకాలు
- వరకట్న నిషేధం, ఆస్తి హక్కు చట్టాలను గట్టిగా అమలు చేసేందుకు ఒత్తిడి చేస్తాము.
- లైంగికదాడులను నిరోధించేందుకు, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు తగు చర్యలు చేపట్టాలని పోరాడతాం
- ఒంటరి మహిళలకు రూ.5వేలు పెన్షన్ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తాం
- మద్యాన్ని నియంత్రిస్తూ, బెల్టుషాపులను పూర్తిగా ఎత్తివేయాలి.
- పొదుపు సంఘాలకు బాకీపడ్డ వడ్డీ డబ్బు చెల్లించాలి. వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలి. అభయహస్తం, జనశ్రీ బీమా యోజన పథకాలను పునరుద్ధరించాలి.



మత్స్య కార్మికులు

- విత్తన చేపల ఉచిత పంపిణీ, పడవలు, వలలు తదితర పనిముట్లు సబ్సిడీపై సరఫరా చేసేందుకు ఒత్తిడి చేస్తాం.
- చేపల వృత్తికి పడవలు, వలలు తదితర పనిముట్లు సబ్సిడీపై సరఫరా చేస్తాం
- మత్స్య సంపదకు మద్దతు ధర ప్రకటించాలి. కోల్డ్ స్టోరేజిల సౌకర్యం ప్రతి మండల/ జిల్లా కేంద్రాలలో హోల్ సేల్/ రిటేల్ మార్కెట్ల నిర్మాణం చేపట్టాలి.
- మత్స్యకార యువత/ మహిళలకు మొబైల్ ఫిష్ మార్కెట్లు, ఫిష్ ఫుడ్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తాం.

గీత కార్మికులు



- గీతకార్మికుల చెట్ల పెంపకానికి ప్రతి గ్రామానికి 5 ఎకరాలు భూమి కేటాయింపుకు, నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పి, వృత్తిని ఆధునీకరించేందుకు ప్రభుత్వంపై పోరాటవ చేస్తాం.
- ప్రమాదంలో చనిపోయిన, శాశ్వత వికలాంగులకు రూ.10లక్షలు, తాత్కాలిక వికలాంగులకు రూ.5లక్షలు ఎక్స్ గ్రేషియా ఇచ్చేందుకు కృషి చేస్తాం. వారి పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు ఒత్తిడి చేస్తాం.



మైనార్టీలు

- బ్యాంకు లింకు లేకుండా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ప్రత్యక్ష రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తాం.
- మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన సబ్‌ప్లాన్ రూపొందించాలి.
- వక్ఫ్‌బోర్డుకు క్వాసీ జుడిషియల్ అధికారాలిచ్చి వక్ఫ్ ఆస్తులను కాపాడాలి. సచార్, సుధీర్, రంగనాథన్ కమిటీల సిఫార్సులను అమలుజేయాలి. ఉర్దూను రెండవ భాషగా గుర్తించి అభివృద్ధి చేయాలి.
- సంచార ముస్లిం జాతులైన ఫకీరు, గారడీ, ఎలుగుబంట్ల, బుగ్గేవాలా, అత్తరుసాహెబ్, దండేవాలా, బోరేవాలా, తురక కాశలకు ఓటరు గుర్తింపు కార్డులు, ఇండ్లు, సంక్షేమపథకాలు అమలు చేసేలా ప్రభుత్వంపై పోరాడతాం.



వికలాంగులు

- వికలాంగుల పింఛన్ రు.10వేలకు పెంచుతాం. వికలాంగుల కోటా ఉద్యోగాలను భర్తీ చేస్తాం. 90శాతం సబ్సిడీతో 5లక్షల రుణాలను అందిస్తాము. వికలాంగుల చట్టాలను సక్రమంగా అమలు చేస్తాం.
- పెన్షనర్లకు ఆదాయ పరిమితి విధించే జీఓ 17ను రద్దు చేసి, 40శాతం వెకల్యం కలిగిన వికలాంగులకు పెన్షన్లు ఇస్తాం

గొర్రెల కాపరులు

- ప్రతి గ్రామంలో 10 ఎకరాలు గొర్రెల మేతకు కేటాయించాలి. తుమ్మచెట్లు, చెరువుపడకలపై ఉచితంగా హక్కులు కల్పించాలి. సాగుకు యోగ్యం కాని భూములన్నింటినీ గొర్రెల మేతకు కేటాయిస్తాం.





విశ్వకర్మ వృత్తిదారులు

- విశ్వకర్మ వృత్తిదారులకు ప్రత్యేక నిధులు కేటాయించి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.
- విశ్వకర్మ వృత్తిదారులకు ముడిసరుకు సబ్సిడీతో అందించాలి. వారి ఉత్పత్తులకు మార్కెట్ వసతి, గిట్టుబాటు ధర కల్పించాలి.



రజక, క్షౌర

- జి.ఓ.నెం.27 ప్రకారం ఆస్పత్రులు, పోలీస్ శాఖ, తదితర సంస్థల్లో ఖాళీ దోబీ, బార్బర్ పోస్టులు భర్తీ చేస్తాం. .

లౌకిక విలువలు

- మతం వ్యక్తిగత విశ్వాసం. మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడాన్ని నిరోధించాలి. మత సామరస్యాన్ని పెంపొందించాలి.
- తమ రాజకీయ ప్రయోజనాల కోసం మతపరమైన విభజన సృష్టించేందుకు మతోన్మాద శక్తులు చేస్తున్న ప్రయత్నాలను నిలువరిస్తాము. లౌకిక ప్రజాస్వామ్య శక్తులను సమీకరించి పోరాడుతాం.
- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని, చరిత్రను వక్రీకరించేందుకు మతోన్మాదులు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, ఎదుర్కొంటాం.

ఆర్‌టీసీ

- ప్రజా రవాణాను మెరుగుపరిచేలా ప్రభుత్వాలపై పోరాడుతాం.
- ప్రైవేటు బస్సుల అక్రమ రవాణాను అరికడతాం.
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం వల్ల తలెత్తే సమస్యలు , గతం నుండీ ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికుల పోరాటానికి అండగా ఉంటాము.





నిరుద్యోగులకు భృతి

- నిరుద్యోగభృతికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి రూ. 5,000/-లు నిరుద్యోగ భృతి కల్పిస్తాం.
- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు స్టడీసర్కిల్స్ నిర్వహిస్తాం. టీచింగ్ స్టాఫ్, హాస్టల్ వసతిని కల్పిస్తాము.



పర్యావరణం

- పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తుంది. కార్పొరేషన్స్, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పరిశ్రమల స్థాపనను నిషేధిస్తాం. ప్రస్తుతం పర్యావరణకు హాని కలిగిస్తున్న పరిశ్రమలను క్రమబద్ధీకరిస్తాం.



క్రీడలు

- గ్రామ, మండల, జిల్లా రాష్ట్ర స్థాయిలో క్రీడలకు ప్రోత్సాహం కల్పిస్తాం. ప్రత్యేక నిధులు కేటాయించి జాతీయ స్థాయి సామర్థ్యాన్ని పెంచే విధంగా క్రీడల విద్యా కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. అన్ని రకాల క్రీడలకు వనరులు కల్పించడంతో పాటు, ట్రైనింగ్ సెంటర్లు నిర్వహిస్తాం.

పౌర హక్కుల రక్షణ

- పౌర, ప్రజాస్వామిక హక్కులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి.
- సమాచార హక్కు చట్టాన్ని సమర్ధవంతంగా అమలుచేస్తాం
- ప్రజలకు నిరసన తెలిపే హక్కును, పోరాడే హక్కును, పౌర హక్కులను కాపాడాలి. పై హక్కుల కోసం ప్రజలకు సమీకరిస్తాము.

ట్రాన్స్‌జెండర్లు

- ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు, వసతి సౌకర్యాలు కల్పిస్తాము. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేస్తాం. గౌరవప్రదమైన జీవితం గడిపే విధంగా ప్రోత్సహించి, రక్షణ కల్పిస్తాము. అన్ని రకాల వృత్తుల్లో వీరికి అవకాశం కల్పిస్తాం.



జర్నలిస్టులు

- పాత్రికేయులకు రక్షణ కల్పించి, సంక్షేమ పథకాలు అమలుచేస్తాం.
- ప్రతి జర్నలిస్టుకు 300 గజాల ఇంటిస్థలం ఉచితంగా కేటాయిస్తాం. రు.10లక్షల ఆర్థిక సహాయం ఇస్తాం.
- పదవీ విరమణ పొందిన జర్నలిస్టులకు ప్రతి నెలా రూ.10వేల పెన్షన్ సౌకర్యం కల్పి.

విద్యుత్తు

- 250 యూనిట్లలోపు కరెంటు వాడకం ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం మీద వత్తిడి చేస్తాం
- విద్యుత్తు రంగంలో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తాం. ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలి.

భువనగిరి నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థిగా

కొండమడుగు నరసింహను ఆదరించండి

చెరుపల్లి సీతారాములు (సీపీఎం మాజీ ఎమ్మెల్సీ, కేంద్ర కమిటీ సభ్యులు)

నవతెలంగాణ- భువనగిరి

భువనగిరి నియోజకవర్గం సీపీఎం పార్టీ అభ్యర్థిగా కొండమడుగు నరసింహను నియోజకవర్గ ప్రజలు ఆదరించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో రాష్ట్ర కమిటి సభ్యులు బట్టుపల్లి అనురాధ అధ్యక్షతన సిపిఎం భువనగిరి నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. నిత్యం ప్రజా సమస్యల కోసం పోరాటం చేసే ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సిపిఎం అభ్యర్థి కొండమడుగు నరసింహను భువనగిరి నియోజకవర్గ ప్రజలు ఆదరించాలని, ప్రజా ఉద్యమాలను ప్రజల గొంతుకను శాసనసభలలో వినిపించేందుకు నరసింహకు అమూల్యమైన ఓటు వేయాలని వారు కోరారు. భువనగిరి నియోజకవర్గంలో నిరంతరం ప్రజా సమస్యలపై పని చేసే సీపీఎం పార్టీకే ఓటు అడిగే నైతిక హక్కు ఉందని ప్రజలు సిపిఎం పోరాటాలను బలపరిచే విధంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు కోరారు. ఊహ తెలిసినప్పటినుండి నరసింహ విద్యార్థి, యువజన, కళాకారుల మరియు వ్యవసాయ కూలీల సమస్యల మీద అనేక పోరాటాలు చేసిన అనుభవం కలిగిన వ్యక్తిగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే తన ఎజెండాగా పెట్టుకొని పనిచేస్తున్న నరసింహను ప్రజలు ఆదరించాలని, భూనిర్వాసితులకు నష్టపరిహారం ఇప్పించడంలో, మూసి జల కాలుష్యాన్ని



అరికట్టడంలో, జిల్లా సమగ్ర అభివృద్ధి సాధనకై అనేక పోరాటాలు నిర్వహించిన వ్యక్తిగా ప్రజల ముందుకు కొండమడుగు నరసింహను సీపీఎం అభ్యర్థిగా ముందుకు తీసుకొస్తున్నామని ప్రజలు ఆదరించాలని వారు కోరారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ కొండమడుగు నరసింహ పేద బడుగు బలహీన వర్గాల సమస్యల ప్రతినిధిగా నిరంతరం ప్రజలలో ఉంటూ ప్రజల తలలో నాలుకగా మెలిగిన వ్యక్తిగా ప్రజల ముందుకు సీపీఎం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వస్తున్నాడని ప్రజలు వారిని ఆదరించి మీ అమూల్యమైన ఓటును వినియోగించుకొని సీపీఎం సుత్తికొడవలి నక్షత్రం గుర్తు మీద ఓటు వేయాలని వారు పిలుపునిచ్చారు.

వీరితోపాటు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, నాయకులు సిర్పంగి స్వామి, మాయ కృష్ణ, దయ్యాల నర్సింహ, బొల్లు యాదగిరి, గడ్డం వెంకటేష్, బోలగాని జయరాములు, వనం రాజు, ఈర్లపల్లి ముత్యాలు, బోడ భాగ్య, సందేల రాజేష్, అన్నంపట్ల కృష్ణ, గాడి శ్రీనివాస్, నాయకులు బండారు శ్రీరాములు, కళ్లెం సుదర్శన రెడ్డి, గుండు నర్సింహ, గూడూరు బుచ్చిరెడ్డి, కొండ అశోక్, గందమల్ల మాతయ్య, కల్లూరి నాగమణి, లలిత, కొండమడుగు నాగమణి, మంచాల మధు, రాంచంద్రం, ఉమర్,కోట రామచంద్రారెడ్డి, బర్ల వెంకటేష్, కవుడే సురేష్ పలేర్ల అంజయ్య, కుకూట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.